RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



08 జనవరి 2025 బుధవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:187

## ప్రజాబలం దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటీ





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** మంగళవారంనాడు తెలంగాణా రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొంగులేటీ శ్రీనివాస్‌రెడ్డి ప్రజాబలం దిన పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటీ శ్రీనివాస్‌రెడ్డి తోపాటు సమాచార పౌరసంబంధాలశాఖ కమీషనర్ హరీష్ మరియు ప్రజాబలం దినపత్రిక బ్యూరోఛీఫ్ ఆర్వల్లి శ్రీనివాస్‌లు పాల్గోన్నారు.

## నిర్మల్ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేస్తాం.

### ధూంధాంగా సాగిన నిర్మల్ ఉత్సవాలు. పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క



ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. నిర్మల్ ఉత్సవాల 2వ రోజు సోమవారం సాయంత్రం జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్సవాలలో పాల్గొన్న మంత్రి సీతక్కకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పూల మొక్కతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి సంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు.

ఈ సందర్బంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, నిర్మల్ చరిత్రపై పరిశోదనలు జరిపి భవిష్యత్ తరాలకు తెలియజేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మాహిళా,శిశు,సంక్షేమ శాఖ,జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. వినూత్నంగా జిల్లాలో నిర్మల్ ఉత్సవాల పేరిట ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ను మంత్రి అభినందించారు. నిర్మల్ జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి తెలియచెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయం అని తెలిపారు. నిర్మల్ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వ,ప్రయివేట్, మహిళా స్వయం సంఘాలచే ఏర్పాటు చేసిన స్టాళ్లు గొప్పగా ఉన్నాయని అభినందించారు.

ఖానాపూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ, నిర్మల్ కు ఘనమైన చరిత్ర ఉందని,బయట ప్రపంచానికి తెలిపేలా ఇలాంటి ఉత్సవాలు నిర్వహించుకోవడం గొప్ప విషయం అని అన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజలందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,జిల్లా చరిత్రను ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్క,ఇతర ప్రజాప్రతినిధులకు సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారులు,ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజా ప్రతినిధులను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. జిల్లా అధికారులతో మంత్రి గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లు,ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీలు అవినాష్, రాజేష్ మీనా,ఉపేంద్ర రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రో డీపీఆర్‌లను మార్చిలోగాపూర్తి చేయాలిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రో మార్గాలకు సంబంధించిన సమగ్ర వివరణాత్మక ప్రణాళికలు (డీపీఆర్‌లు) మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు మెట్రోల డీపీఆర్‌లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని సీఎం సూచించారు.

హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి గారు ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం - ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ.), జేబీఎస్ - శామీర్‌పేట మెట్రో (22 కి.మీ.), ప్యారడైజ్ - మేడ్చల్ మెట్రో (23 కి.మీ.) మార్గాలకు సంబంధించి భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలి.

మేడ్చల్ మార్గంలో ఎన్‌హెచ్ మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో లైన్ తీసుకెళ్లాలి. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలి. శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలి. అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలి.

జంక్షన్‌కు సంబంధించిన పూర్తి ప్రణాళికను తయారు చేయాలి. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాబలం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా



ఎల్.బీ.నగర్ ప్రజాబలం ప్రతినిధి: ప్రజాబలం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ అత్యంత వైభవంగా కన్నుల పండుగగా భీష్మ పితామహులు ఆర్యవైశ్యల ముద్దుబిడ్డ మృదు స్వభావి సేవ తత్పురులు ఆర్యవైశ్య సంఘం కొత్తపేట చీఫ్ అడ్వైజర్ ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా చేతులను మీదుగా కన్నుల పండుగ ఆవిష్కరింపబడింది ఈ కార్యక్రమానికి ప్రజాబలం దినపత్రిక బ్యూరోఛీఫ్ ఏ శ్రీనివాస్ మంజరీ ఆర్యవైశ్య సంఘం అడ్వైజర్ బిల్లగంటి రాజు గుప్తా ,శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యన్నాదన సత్యం ట్రస్ట్ ఫౌండర్ & జాతీయ అధ్యక్షులు యాద ఆశోక్ గుప్తా ,అధ్యక్షులు మాడూరి వాసు గుప్తా సెక్రటరీ అత్యం సత్తయ్య రేణిగుంట శ్రీనివాస్ ఆర్వేపల్లి శ్రీనివాస్ గుప్తా మరియు కార్యవర్గ సభ్యులు. తెలంగాణా కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి రామ్ శెట్టి నరేందర్, కాంగ్రెస్‌పార్టీ డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్.ధన్‌రాజ్ ,కాంగ్రెస్‌పార్టీ సీనీయర్ నాయకులు సతీష్ గౌడ్ , అశోక్ జైన్ , అశోక్ ,నాగులు ,నాగరాజు , కే నాగరాజు గుప్తా పాల్గొనడం జరిగింది.





## తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ దీప్ దాస్ మున్షీ ని కలిసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

జగిత్యాల నిజామాబాద్ జిల్లా లోని డిచ్ పల్లి కే ఎన్ ఆర్ గార్డెన్స్ లో నిజామాబాద్ పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ హాజరై ముందుగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ దీప్ దాస్ మున్షీ, టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి,టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి లకుమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పుష్ప గుచ్చాం అందజేసి స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మద్దతుగా పార్టీలో చేరడం జరిగిందన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కొత్త పాత అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని,స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వెంట మున్సిపల్ చైర్మన్ లు మోర హనుమండ్లు,అడువాల జ్యోతి లక్ష్మణ్,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం,వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్,సీనియర్ నాయకులు బాలే శంకర్,రవీందర్ రావు,కోల శ్రీనివాస్,గన్నెరాజిరెడ్డి,కౌన్సిలర్ లు,జగిత్యాల నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

08 జనవరి 2025 బుధవారం

# అభాసుపాలైన ఓటు బ్యాంకు వ్యూహం!

మణిపూర్‌లో 2023 మే మూడవ తేదీన రెండు సామాజిక తరగతుల మధ్య పరస్పర అనుమానాలతో ప్రారంభమైన ఘర్షణ 2024లో కొనసాగి మూడో ఏడాదిలో ప్రవేశించింది. ఎప్పుడు ముగుస్తుందో తెలియటం లేదు. పరిస్థితిని చక్కదిద్దటంలో విఫలమైనందుకు విచారంగా ఉందంటూ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పారు. అయితే ఒక్క రోజు కూడా గడవక ముందే విమర్శకులపై ఎదురు దాడికి దిగటాన్ని బట్టి విచార ప్రకటనలో చిత్తశుద్ధి లేదని స్వయంగా వెల్లడించుకున్నారు. మెయితీ–కుకీ, జో తెగల మధ్య ప్రారంభమైన ఘర్షణల్లో కొందరు మహిళలపై అత్యాచారాలు, నగంగా ఊరేగింపులు జరిగాయి. 260 మంది ప్రాణాలు కోల్పోయారు. అరవై వేల మంది నెలవులు తప్పారు. బాధితుల్లో ఎక్కువ మంది గిరిజనులైన కుకీలే ఉన్నారు. మెయితీలందరినీ గిరిజనులుగా పరిగణించాలంటూ హైకోర్టు పెట్టిన చిచ్చు అక్కడ జరుగుతున్న దారుణ మారణకాండకు మూలం. రెండింజన్ల పాలన సాగిస్తున్న బిజెపి ఆదిలోనే దానికి తెర దించి ఉంట్టే ఇంత జరిగేది కాదు. మణిపూర్‌లో బిజెపి రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడటంలో ఘోరంగా విఫలమైంది. అదే ఏ ప్రతిపక్ష పార్టీనో అధికారంలో ఉంటే అలా ఉపేక్షించేదా? అల్లకల్లోల పరిస్థితి ఏర్పడిన కారణంగా రాష్ట్రం మొత్తాన్ని మిలిటరీకి అప్పగించారు. అక్కడ బిజెపికి చెందిన ముఖ్యమంత్రి, మంత్రులు రాజభోగాలు అనుభవించటం తప్ప చేసేదేమీ లేదు. ప్రపంచమంతటా, మణిపూర్ చుట్టూ ప్రధాని నరేంద్రమోడీ విమానాల్లో తిరుగుతారు, సుభాషితాలు చెప్పి వస్తున్నారు తప్ప మణిపూర్ వెళ్లి భరోసా ఇచ్చేందుకు ఎలాంటి చొరవ లేదు. ప్రతిపక్షాలు ముందుకు తెచ్చిన అనేక అంశాల మీద మోడీ మౌనంగా ఉన్నట్లుగానే ఆయన ప్రధమ గణంలోని బీరేన్ సింగ్ మౌనంగా ఉంటే అదొక తీరు. కానీ ఎదురుదాడికి దిగారు. గతంలో కూడా మణిపూర్‌లో అనేక ఉదంతాలు జరిగాయి కదా వాటన్నింటికీ నాడు ప్రధానులుగా ఉన్న పివి నరసింహారావు, ఐకె గుజ్రాల్ క్షమాపణలు చెప్పారా అని ప్రశ్నించారు. ఆ నాడు రాష్ట్ర ముఖ్యమంత్రులుగా ఉన్నవారు కూడా క్షమాపణలు చెప్పిన దాఖలా లేదు, మరి బీరేన్ సింగ్ ఎందుకు చెప్పినట్లు? నాడు మణిపూర్‌లో జరిగిన ఉదంతాలను పాలకులు మూసిపెట్టలేదు, మోడీ ఏలుబడిలో ఎందుకు పాచిపోయేట్లు చేసినట్లు? మణిపూర్ అంశం ప్రస్తావనకు వచ్చినపుడల్లా బిజెపి నేతలు గతంలో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి, విదేశీ జోక్యం గురించి చెబుతూ తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు చూస్తారు. సరిహద్దుల భద్రత, అక్రమ చొరబాట్లను అరికట్టాల్సింది కేంద్ర ప్రభుత్వం. పదేళ్ల నుంచి ఏం చేస్తున్నట్లు? 2017 నుంచి ఇదే బీరేన్ సింగ్ సిఎంగా ఉన్నారు. ఈ పెద్దమనిషి ఏం చేస్తున్నట్లు? అంతా చేసి నేరం నుంచి తప్పించుకోవటం తప్ప క్షమాపణలో చిత్తశుద్ధి లేదని మణిపూర్ గిరిజన సంఘాల ఐక్యతా కమిటీ బీరేన్ సింగ్ ప్రకటన మీద వ్యాఖ్యానించింది. ఒక మైనారిటీ తరగతి మీద జరిపిన మారణకాండ బాధ్యత నుంచి తప్పించుకొనేందుకు సిఎం చూశారని పేర్కొన్నది. కుకీ–జో గిరిజనుల పట్ల వివక్ష నిలిపివేయాలని మరో గిరిజన సంఘాల కమిటీ డిమాండ్ చేసింది. మణిపూర్‌లో సాయుధ బృందాలపై భద్రతా దళాలు జరిపిన దాడులలో స్టార్ లింక్ ఉపగ్రహ యాంటెన్నా, రౌటర్‌తో పాటు ఆధునిక రైఫిళ్లు దొరికినట్లు ప్రకటించారు. మారుమూల ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలను అందించే ఈ ఉపగ్రహం సేవలను పొందటం మన దేశంలో నిషిద్ధం, అయినప్పటికీ అవి దొరికాయంటే అనధికారికంగా సమాచారం అందుకున్నట్లు స్పష్టమౌతోంది. వీటిని మెయితీలు అధికంగా నివసించే ప్రాంతాలపై జరిగిన దాడుల సమయంలో సాయుధులు వదలివేసి పారిపోయినట్లు పోలీసులు ప్రకటించారు. అయితే తమ ఉపగ్రహం నుంచి భారత్‌కు సంకేతాలు అందకుండా చేసినట్లు ఎలన్ మస్క్ చెప్పుకున్నాడు. తమ దాడుల సందర్భంగా మయన్మార్‌లో తయారైన ఆయుధాలు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు కూడా పోలీసు అధికారులు చెప్పారు. వాటిలో మయన్మార్ సైనికులు వాడే ఎంఎ4 రైఫిల్, ఎకె47 కూడా ఉంది. గత ఐదారు నెలల నుంచి సాయుధ బృందాలు తల దాచుకున్న ప్రాంతాలలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, మిలిటరీ యూనిఫారాలు తదితరాలను కూడా పట్టుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మయన్మార్ సరిహద్దులను దాటి ఉగ్రవాదులు రాకపోకలు సాగిస్తున్నా, ఆయుధాలు అక్రమ రవాణా జరుగుతుంటే సరిహద్దు భద్రతలను చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తున్నట్లు? స్టార్ లింక్ ఉపగ్రహం నుంచి ఉగ్రవాదులు, సాయుధ మూకలకు సంకేతాలు, సందేశాలు అందుతుంటే అడ్డుకోవాల్సిన బాధ్యత కూడా కేంద్రానిదే. భద్రమైన చేతుల్లో దేశం ఉందని నరేంద్ర మోడీ గురించి గొప్పలు చెప్పుకోవటం తప్ప ఉపయోగం ఏముంది? తాజా ఘర్షణలు, దాడులకు 2023 ఏప్రిల్ 14న మణిపూర్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలే మూలం! మెయితీ సామాజిక తరగతికి గిరిజన హోదా కల్పించాలని కేంద్రానికి సిఫార్సు చేయాలంటూ తనకు లేని అధికారంతో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తరువాత సుప్రీం కోర్టు ఈ చర్యను తప్పు పట్టింది. ఒక పెద్ద కుట్రలో భాగంగా అక్కడ పరిణామాలు జరిగినట్లు భావిస్తున్నారు. హైకోర్టు ఆదేశాన్ని నిరసిస్తూ మే 3వ తేదీన గిరిజన విద్యార్థులు నిరసన తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఏదో ఒక వైపు నుంచి హింసాకాండ జరుగుతూనే ఉంది. మెయితీ–గిరిజనుల మధ్య పరస్పరం అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. మయన్మార్‌లో 2021 మిలిటరీ తిరుగుబాటు సమయంలో అక్కడి నుంచి శరణార్ధులుగా వచ్చిన వారి గురించి మెయితీలు అభ్యంతరం తెలిపారు. ఇవన్నీ కూడా బిజెపి రెండింజన్ల పాలనలోనే జరిగాయి. అందువలన గత కాంగ్రెస్ పాలనే కారణం అనటం తప్పించుకోచూడటం తప్ప మరొకటి కాదు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అక్కడ నాగా పీపుల్స్ ఫ్రంట్ అనే ఒక ప్రాంతీయ పార్టీతో జత కట్టి చెరో సీటులో పోటీ చేసింది.

# షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

## ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామి

## కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం





ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 07 : చెన్నూర్ నియోజకవర్గం లోని కోటపల్లి మండలంలో షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ మరియు కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి.మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మీటింగ్, కార్యకర్తలు అందరూ సమిష్టిగా పని చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరిన వివేక్ వెంకటస్వామి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఈ రోజు మీ అందరినీ కలవడం చాలా సంతోషంగా ఉంది,ఈరోజు ఇక్కడ కోటి రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది,మనకు ఒక మంచి అవకాశం వచ్చింది రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడానికి, తెలంగాణా వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి చెందుతది అనుకుంటే ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది నియోజకవర్గంలో అన్ని సమస్యలు పరిష్కారం దిశగా నిధులు మంజూరు చేయడం జరుగుతుంది.

ఈ ప్రాంతంలో అటవీశాఖ అనుమతులు లేక అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి

ఇప్పుడు ఆ ఆటంకాలను అధిగమించి ఒక్కొక్కటిగా సమస్యల పరిష్కారం చేస్తున్నాము సుమారు 100 కోట్ల రూపాయలతో నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి,నేను నక్కలపల్లి గ్రామానికి ఏడు సార్లు సందర్శించి సమస్యను తెలుసుకొని పరిష్కరించడం జరిగింది.నేను ఎప్పుడూ కలెక్టర్ తో మాట్లాడి నా నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూనే ఉంటాను,కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత ప్రజాపాలన కొనసాగుతుంది.గత ప్రభుత్వంలో ప్రశ్నిస్తే అక్రమ పోలీసులతో వేధింపులకు గురిచేశారు.మన ప్రభుత్వం వచ్చాక ఎక్కడ కూడా కేసులను పెట్టలేదు.

నా పైన సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారు.నా పైన ఎన్ని ఆరోపణలు చేసినా నేను ఎవరిపైనా కేసులు పెట్టలేదు,గత ప్రభుత్వంలో అందరూ ఇసుక దందాలు, భూదందాలు,బియ్యం దందాలు చేసారు,నేను ఎమ్మెల్యేగా గెలిచాక అక్రమ పనులు అన్నీ ఆపేసాను,నేను ఎక్కడ కూడా అవకతవకలు లేకుండా నిజాయితీగా పని చేస్తున్నాను,గత ప్రభుత్వం 7 లక్షల కోట్ల అప్పులు చేసారు,కాళేశ్వరం ప్రాజెక్టు లో లక్ష కోట్ల రూపాయల దుర్వినియోగం చేసారు,కేసీఆర్ తుమ్మిడి హెట్టి ప్రాజెక్టును విస్మరించి కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టడం జరిగింది,జాతీయ పార్టీ పెట్టి కేసీఆర్ ఇంకా పైసలు సంపాదించాలి అనుకున్నాడు, తెలంగాణా ఉద్యమ సమయంలో ఒక్క పైసా లేని కేసీఆర్ కు వేల కోట్లు ఎలా వచ్చాయి,కేటీఆర్ రైతులకు 15 వేలు రైతు భరోసా ఇవ్వాలని అంటున్నాడు.మీ హయంలో పంటలు పండని భూములకు 10 వేలు ఇచ్చారు,రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగు పడ్డాక అందరికీ 15 వేలు ఇస్తాము,2 లక్షల రూపాయల రుణ మాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది,దేశంలో ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ చేసిన ప్రభుత్వం మన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే స్థానిక ఎన్నికల్లో మీరు కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి మన సత్తా చాటాలి,చెన్నూర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కావాలని సీఎం గారిని కోరాను,సోమనపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయి,మన ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ స్కూల్ తీసుకొని రావడం జరిగింది.ఇప్పటి వరకు రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం పని చేసాము,ఈ సంవత్సరంలో విద్య వైద్యం కోసం పని చేసి అభివృద్ధి చేస్తాను.అన్ని స్కూల్స్ కి ఆర్ ఓ ప్లాంట్స్ కి నిధులు మంజూరు చేయడం జరిగింది.నియోజకవర్గంలో ఎం సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకురావాలి,నేను చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతాను,నేను కేవలం 10 రోజులు ఎలెక్షన్ ప్రచారం నిర్వహించిన నన్ను ఆదరించి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి –చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 7 :స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. మంగళవారం చెన్నూర్ నియోజకవర్గం లోని కోటపల్లి మండలంలో ఏర్పాటుచేసిన షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి షాద్ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో అన్ని సమస్యలు పరిష్కారం దిశగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఈ ప్రాంతంలో అటవీశాఖ అనుమతులు లేక అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు.కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత ప్రజాపాలన కొనసాగుతుందనీ, గత ప్రభుత్వంలో ప్రశ్నిస్తే అక్రమ పోలీసులతో వేధింపులకు గురిచేశారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కావాలని సీఎం గారిని కోరానన్నారు. సోమనపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయన్నారు. మన ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ స్కూల్ తీసుకొని రావడం జరిగిందనీ, అన్ని స్కూల్స్ కి ఆర్ ఓ ప్లాంట్స్ కి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

# అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీతను సన్మానించిన ఆది జాంబవ సంఘం



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 7:మందమర్రి పట్టణానికి చెందిన దాసరి శ్రావణ్ కుమార్ (హెూం గార్డు)ఇటీవల బహుజన సాహిత్య అకాడమీ సంస్థ వారిచే అంబేద్కర్ జాతీయ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా మంగళవారం సింగరేణి హైస్కూల్ లో ఆది జాంబవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కంబాల రాజనర్సు మాట్లాడుతూ ఒక సింగరేణి కార్మికుడి బిడ్డ దాసరి శ్రావణ్ కుమార్ చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అంబేద్కర్ జాతీయస్థాయి అవార్డును అందుకోవడం సంతోషమన్నారు. ఒక వైపు పోలీస్ గా సేవలందిస్తున్న శ్రావణ్ సామాజిక సేవ చేయడం ఆయన సేవా స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బీదునూరి శంకర్, జనరల్ సెక్రటరీ ఆవునూరి పోషం, ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి రాజనర్సు, విరుగురాల వెంకటి, గాలిపెల్లి తిరుపతి ఏల్పుల వెంకటి, నరెడ్ల లక్ష్మణ్, సంఘీ రవి, రేగుంట రాజన్న, కల్వల సురేష్, అంతర్పుల మధు, తొకల కుంబులు, బత్తుల శ్రీనివాస్, కల్వల పోషం, మంతెన భూమయ్య, జూపాక స్వామి, అరెంద కరుణాకర్, జూపాక శ్యామ్, బండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# చందు క్లిక్ కి జాతీయ బహుమతి




ఖమ్మం ప్రతినిధి జనవరి 07 (ప్రజాబలం) తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి వ్యక్తిగత ఛాయ చిత్రగ్రాహకుడిగా పనిచేస్తున్న చందుకి జాతీయ స్థాయి ఘనత దక్కింది. జనవరి 5,6వ తేదీలలో హుస్సేన్ ఖాన్ ఆధ్వర్యంలో ఒడిస్సా రాష్ట్రంలో సెవెంత్ నేషనల్ వర్క్షాప్ పేరుతో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో కన్సొలేషన్ విభాగంలో ప్రథమ బహుమతి లభించింది. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ తమిళనాడు, కర్ణాటక మహరాష్ట్ర ఒడిస్సా సహా పలు రాష్ట్రాలకు చెందిన 120 మందికి పైగా దిగ్గజ ఫొటోగ్రాఫర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గిరిజన జాతిలోని బొండాస్ అనే ఓ తెగకు సంబంధించిన వారి సాంప్రదాయ వేషధారణ, నృత్యాలు, జీవన శైలి విధానాలపై ఈ వర్క్ షాపు జరిగింది. ఇందులో దిగ్గజ ఫొటోగ్రాఫర్లతో పోటీపడిన చందుకి కన్సొలేషన్ విభాగంలో బహుమతి లభించడం విశేషం. చందుకి జాతీయ స్థాయిలో బహుమతి రావడం పట్ల జిల్లాకు చెందిన ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు

# విశాఖ రైల్వే జోన్.. ఒడిస్సా అభ్యంతరం

విశాఖపట్టణం, జనవరి 7,ఏపీలో కొత్తగా ఏర్పాటు కానున్న రైల్వే డివిజన్‌లో వాల్తేర్ డివిజన్ భాగం కానుంది. వాల్తేర్ రైల్వే డివిజన్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ నుంచి వేరు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం ఒడిశాపై తీవ్ర ఆర్థిక పరిణామాలకు దారి తీస్తుందని ఒడిశాలో ప్రధాన ప్రతిపక్షమైన బీజేడీ ఆందోళన వ్యక్తం చేసింది.వాల్తేర్ డివిజన్ విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే జోన్‌లో కలిపే అంశంపై బీజేపీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆ పార్టీ ప్రశ్నించింది. రాయగడలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటును బీజేడీ స్వాగతించింది.రాయగడలో కొత్త రైల్వే డివిజన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు.ఈస్ట్ కోస్ట్ రైల్వే నుంచి ఆదాయాన్ని ఆర్జించే భాగమైన వాల్తేరు డివిజన్ ను విడ దీయడం కేవలం ఆంధ్రప్రదేశ్ ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యమని బీజేడీ నేత బ్రుగు బక్షిపాత్ర ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈసీవోఆర్ పరిధిలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే డివిజన్లలో వాల్తేరు రైల్వే డివిజన్ ఒకటని పేర్కొన్నారు.డివిజన్ ను విభజించి ఈసీఓఆర్ కు కీలకమైన ఆదాయాన్ని ఆర్జించే భాగాన్ని దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు బదలాయించాలన్న నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ను, ముఖ్యంగా దాని రాజకీయ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం మాత్రమేనని బక్షిపాత్ర విమర్శించారు.

# పరమ పవిత్రం వైకుంఠ ఏకాదశి

ధనుర్మాసము సౌరమానము యొక్క ప్రామాణికాను సారము కాగా, శుక్ల ఏకాదశి చాంద్రమానమైన తిథి. ప్రతి మాసమునందలి ఏకాదశులు ఎంతో పవిత్రమైనవి. "గృహస్థో బ్రహ్మచారీ చ ఆహితాగ్నిస్త థైవచబీ ఏకాదశ్యాంశ భుంజిత పక్షయోరు భయోరపి" అని అగ్ని పురాణాదులు వివరిస్తున్నాయి. గృహస్థులకు, బ్రహ్మచారులకు, నిత్యాగ్ని హెూత్రులకు నైమిత్తిక కర్మగా ఉపవాసాద్యాచరణము విధించ బడినది. ఇట్టి ఏకాదశి విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన దివసము కావునే ఏకాదశి హరి వాసరముగా కొనియాడ బడుచు న్నది. అందు సౌరమానము నందలి ప్రశస్తమైన ధనుర్మాసంలో వచ్చే శుక్ల పక్ష ఏకాదశి (మార్గశీర్షము లేక పుష్య మాసం) "వైకుంఠ ఏకాదశి"గా పిలువ బడుచు న్నది. సూర్య చంద్రులు నేత్రములుగా కలిగిన వైకుంఠ వాసునుకి సౌర, చాంద్ర మానాలలో ప్రశస్తమైన ధనుర్మా శుక్ల పక్ష ఏకాదశి అత్యంత ప్రీతికరమైనది. ధనూరాశి స్థితే సూర్యే శుక్ల ఏకాదశి తిథౌబీ త్రింషత్ కోటి సురైః సాకం బ్రహ్మ వైకుంఠ మాగత: పాలస్త్యేనని పీడితా: సురగణాః వైకుంఠలోకం యయు:బీ ద్వారే తత్ర విషాదభావ మనసా సూక్తైర్ హరిం తుష్టువు: శుక్లే: శ్రీహరి వాసరే ప్రభాత సమయే భానౌ ధనుః సంస్థితే, తేభ్యోదాత్ సుఖ దర్శనం కరుణయా నారా యణో మాధవ:" రావణుని బాధలను తాళలేని దేవతలు బ్రహ్మను ఆశ్రయింపగా...ఆ దేవుదు ధనుర్మాస శుక్ల ఏకాదశి దినమున దేవతలందరితో వైకుంఠము నుచేరి, హరి వాసరమునందు దేవతలు విషాద భావ మనస్సులై శ్రీహరిని వేదోక్తంగా స్తుతించగా, వారికి శ్రీహరి సుఖ దర్శనమును కలుగజేసెనని వివరించ బడినది. (శ్రీప్రశ్న సంహిత (ఐదవ అధ్యాయము) నందు గల ఐతిహ్యము ననుసరించి మధు కైటభులను భగవానుడు సంహరించినపుడు వారు దివ్యరూపధారులై దివ్య జ్ఞానము పొందగా, బ్రహ్మదులెవరైనను నీలోకము వంటి మందిరమును నిర్మించి, ఏకాదశి దినోత్సవమును గావించి, నిన్ను నమస్కరించి ఉత్తర ద్వార మార్గమున సమీపింతురో, వారికి వైకుంఠ ప్రాప్తి కలుగునట్లు దీనిని మోక్ష ఉత్సవ దినముగా వరమిచ్చినట్లు తెలియు చున్నది. ముక్కోటి దేవతల బాధలను నివారించినందున 'ముక్కోటి ఏకాదశి'గాను, వైకుంఠ దర్శనము కలిగించునది కనుక 'వైకుంఠ ఏకాదశి'గాను, భగవద్దర్శనము చేయు పవిత్ర దినమైనందున భగవదవలోక దివసము'గ కొనియాడ బడుచున్నది. ధనుర్మాస ఏకాదశి కొన్నిసార్లు మార్గశిర మాసమందు, మరికొన్ని మారులు పుష్యమాసమందు రావడం చేత రెండు మాసాల శుక్ల ఏకాదశులు ప్రశస్తములైనవే. మార్గశిరమాస ఏకాదశిని మోక్షైకాదశి అని, పుష్యమాస ఏకాదశిని పుత్రదైకాదశి, రైవత మన్వాది దినమని పిలుస్తారు. వైకుంఠ ఏకాదశి అనే పేరులో వైకుంఠ, ఏకాదశి అని రెండు పదాలున్నాయి. వైకుంఠ శబ్దం ఆకారాంత పుంలింగం. ఇది విష్ణువునూ, విష్ణువుండే స్థానాన్ని కూడా సూచిస్తుంది. చాక్షుస మన్వంతరంలో వికుంఠ అనే ఆమె నుండి అవతరించి నందున విష్ణువు "వైకుంఠః" (వైకుంఠుడు) అయ్యాడు. అదేకాక జీవులకు నియంత, జీవులకు సాక్షి, భూతముల స్వేచ్ఛావిహారాన్ని అణచేవాడు – అని అర్థాలున్నాయి. సూర్యుడు ధనురాశిపై నుండగా వచ్చిన తొలి ఏకాదశి (వైకుంఠ) పుణ్యదినాన తన దివ్యమంగళ రూపంతో వైకుంఠ ద్వారంవద్ద దేవతలకు శ్రీమహా విష్ణువు దివ్యదర్శనం గావించిన సంద ర్భంగా, కోటి తేజోమూర్తిని దర్శించిన బ్రహాదిదేవతలు, సనక సనందాది మునులు, 'పశ్యన్ నిముష మాత్రేన కోటి యజ్ఞంఫలం లభేత్' అని వచించినట్లు బ్రహాండ పురాణంలో వర్ణించ బడింది. ఈ పవిత్ర దినాన వైష్ణవ సంబంధ ఆలయాలలో, ఉత్తర ద్వారం వద్ద సూర్యోదయానికి పూర్వమే స్వామి దర్శనం చేసికోవడం అనాదిగా ఆచరిస్తున్న సత్సాంప్రదాయం.

## నూతన ఆవిష్కరణల రూపకర్త

గెలీలియో గెలీల ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త. టెలీస్కోపు (దూరదర్శిని) ను వాడుకలోకి తెచ్చాడు. గెలీలియో గెలీలి (జననం 1564 ఫిబ్రవరి 15..మరణం 1642 జనవరి 8) ఇటలీలోని పీసా నగరంలో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు. గెలీలియో కాలం అనగా 16 వ శతాబ్దం వరకు క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే ప్రాచుర్యంలో ఉండేవి. సృష్టిలోని సత్యాలనన్నిటినీ స్వచ్ఛమైన ఆలోచనల ద్వారా మాత్రమే వివరించ వచ్చును. ప్రయోగాల ప్రమేయం ఏ మాత్రం అవసరం లేదన్నది అరిస్టాటిల్ సిద్ధాంతాల్లోని పెద్ద లోపం. అరిస్టాటిల్ సిద్ధాంతంతో ఏకీభవించని గెలీలియో పీసా గోపురం 180 అడుగుల ఎత్తు పైనుంచి 100 పౌండ్లు, 1 పౌండు బరువు గల రెండు ఇనప గుండ్లను ఒకేసారి క్రిందికి వదలి, అవి రెండూ ఒకే కాలంలో భూమిని చేరుకుంటాయని ప్రయోగం ద్వారా నిరూపించాడు. గురుత్వ త్వరణం గూర్చి ఆ కాలం నాటికే అర్థం చేసుకోగలిగాడు. 20 సంవత్సరాల వయసులో అయన ఒక రోజు ప్రార్థన కోసం చర్చికి వెళ్ళాడు. చీకటి పడుతున్న వేళలో చర్చి సేవకుడు దీపాలు వెలి గించగా ఎన్నో దీపాలు చర్చి పైభాగం నుండి వ్రేలాడుతూ ఉన్నాయి. ఆ దీపాలు ఉయ్యాల మాదిరి అటు, యిటూ ఊగటం గమనించాడు. వాటి డోలనా సమయాలు ఒకటేనని లెక్క వేశాడు. గెలీలియో కాలంనాటికి కచ్చితంగా కాల నిర్ణయం చేసే గడియారాలు లేనప్పటికి ఆయన డోలన కాలాలను గణించటం విశేషం. వైద్య విద్యార్థి కాబట్టి, నాడి కొట్టుకోవటం, గుండె కొట్టుకోవటం గురించి పరిచయం ఉంది కాబట్టి కాల నిర్ణయాన్ని తేలికగా చేయగలిగాడని అనుకోవచ్చు. ఈ పరిశీలన ఆధారంగా గెలీలియో "పల్స్ మీటరు" రూపొందించాడు. పాండువా విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ప్రధానాచార్యునిగా చేరాడు. అక్కడే గెలీలియో యాంత్రిక శాస్త్రం రచించాడు. ఇది సామాన్యులకు కప్పీలు, తులాదండాలు, వాలుతలాల ద్వారా బరువులు సులభంగా ఎత్తడానికి ఉపకరించింది. ఆ సమయంలోనే వాయు థర్మామీటర్ ను, పల్లపు ప్రాంతం నుంచి ఎత్తుకు నీటిని చేరవేసి వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాన్ని, గణితంలో వర్గాలు, వర్గమూలాలు కనుగొనే కంపాస్ పరికరాన్ని కనుగొన్నారు. ఆ సమయంలోనే లోలకాలు, వాయు తలాలపై కూడా కీలకమైన ప్రయోగాలు చేశాడు. గెలీలియో మొట్టమొదటి నాణ్యత గల టెలిస్కోప్ నిర్మాత. ఆయన టెలిస్కోప్ గురించి విని సింగ్ ఆరోరియా మహారాజు వెనిస్ కు రమ్మని కబురు చేశాడు. ఆయన టెలిస్కోప్ చూసి ఎంతోమంది ఆశ్చర్య పడ్డారు. వెనిస్ చర్చి పైభాగానికి వెళ్ళీ ఎంతో దూరంలో ఉన్న నౌకలను పది రెట్లు దగ్గరగా ఎంతో మంది గెలీలియో టెలిస్కోప్ ద్వారా చూడ గలిగారు. ఆయనను ప్రశంసించారు. ఈ టెలిస్కోప్ గెలీలియో పరిశోధనలో ముఖ్యమైనది. ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించ గలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు. గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధృవీకరించాడు. పాలపుంతలో కోట్లాది నక్షత్రాలు ఉన్నాయని ఊహించి చెప్పగలిగాడు. ఈ టెలిస్కోప్ ను ఉపయోగించి సేకరించిన సమాచారాన్ని బట్టి కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతను బలపరిచాడు. క్రీ.శ 1616 లో గెలీలియో, సూర్యుడే కేంద్రమని సూర్యుని చుట్టే భూమి తిరుగుతుందని నిర్ద్వందంగా ప్రకటించాడు. అప్పటికే మత గ్రంథాలలో ప్రముఖ స్థానాన్ని పొందిన భూకేంద్రక సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నందుకు కోపర్నికస్ సిద్ధాంతాన్ని నిషేధించి, కొందరు మతాధికారులు గెలీలియో ప్రయోగాలు మత వ్యతిరేకమైనవని తీర్మానించారు. తన ప్రయోగాలను ఎన్నటికీ బహిర్గతం చేయనని ప్రమాణం తీసుకున్నారు. ఈ ప్రకటనకు ఆగ్రహం చెందిన చర్చి మతాధికారులు గెలీలియో ఎటువంటి ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. దీంతో క్రీ.శ.1630 వరకు గెలీలియో నోరు విప్పలేక పోయాడు.

అయినా ఆయన తన వాదాలను విడిచి పెట్టలేదు. వాటిని పుస్తక రూపంలో వెలువరించాడు. 1632లో వెలువడిన ఈ ఐఋశ్రీశీస్త్రబవం ఎశీఅఎవతీఅఱఅస్త్ర్ ష్ట్రవ్ షశీ ఎష్ట్రఱవట షశీతీశ్రీ్స ం఑వవఎం అనే గ్రంథం ఐరోపా ఖండంలో సారస్వత వేదాంత గ్రంథానికి ఉదాహరణగా పేర్కొంటారు. నిర్భయంగా తాను వాస్తవమని నమ్మిన శాస్త్రీయ విషయాలను వెల్లడించాడు. అయితే ఈ గ్రంథాన్ని ప్రజలు కోపర్నికస్ సిద్ధాంతాన్ని సమర్థించేదిగా భావిస్తున్నారని తెలుసుకున్న మతాధికారులు దీని ప్రచురణను నిలిపివేయడమే కాకుండా గెలీలియోకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. క్రీ.శ. 1637 లో పాపం గెలీలియో గుడ్డి వాడయ్యాడు. అంతటి మహానుభావుడు శిక్షను అనుభవిస్తూనే 1642, జనవరి 8 తేదీన తన 78వ ఏట మరణించారు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర్ఖత్వం బలిగొంది.

# రాజకీయ మేధావి మధు లిమాయె

మధు లిమాయె పూణే పట్టణంలో 1922 మే 1వ తేదీన జన్మించారు. ఆయన పూర్తి పేరు మధుకర్ రామచంద్ర లిమాయే. మధులి మాయె స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న, కాంగ్రెస్ ను ముఖ్యంగా ఇందిరా గాంధీని వ్యతిరేకించిన ప్రముఖ వ్యక్తులలో ఒకరు. ఆయన సోషలిస్ట్ వ్యాసకర్త, సామాజిక కార్యకర్త. పూణే లోని ఫెర్గుసన్ కళాశాల నుండి విద్యను పూర్తి చేసారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడం వల్ల చదువుకు అంత రాయం ఏర్పడింది. 1940 నుండి 1945 మధ్య కాలంలో నాలుగు సంవత్సరాల జైలు జీవితం కూడా గడిపారు. గోవా విముక్తి ఉద్యమం లో పాల్గొని చాలాకాలం జైలు జీవితం అనుభవించారు. కాంగ్రెస్ పార్టీలో 1938–1939 లలో సభ్యునిగా ఉన్నారు. తర్వాత రాం మనోహర్ లోహియా సోషలిస్ట్ పార్టీలో ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. సోషలిస్టు నేత రామ్ మనోహర్ లోహియా అనుయాయు లైన జార్జ్ ఫెర్నాండెజ్, మధు లిమాయే, రాజ్ నారాయణ్‌లు ఎప్పుడూ కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ వచ్చారు. సోషలిస్టు ఉద్యమంలో అంబేద్కర్ ఆవశ్యకతని గుర్తించిన మొదటి వ్యక్తి బహుశ మధు లిమాయే నేమో. 'కమ్యూనిస్టు మానిఫెస్టో' ఎంత ముఖ్యమో అంబేద్కర్ 'కుల నిర్మూలన' కూడా అంతే ముఖ్యమని లిమాయే ప్రకటించారు. అంబేద్కర్ కుల నిర్మూలన కోరుకున్నారు. ఎందుకంటే కుల నిర్మూలన జరగకుండా దేశంలో వర్గాలు ఏర్పడవని, వర్గ పోరాటమూ సంభవించదని భావించారు. గోవా విముక్తి ఉద్యమంలో పాల్గొని చాలాకాలం జైలు జీవితం అనుభవించారు. మధు లిమాయే బీహార్ లోని బంక లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. మధులిమాయే 1964–1979 తన లోక్ సభ పదవి కాలంలో ఉత్తమమైన వక్తగా ప్రజా సమస్యలు తెలుపడంలో చురుకైన పార్లమెంటేరియేన్ గా పేరు గడించారు. అత్యవసర పరిస్థితి సమయంలో 1975 నుంచి 1977 వరకు జైలులో వున్నారు. తర్వాత జయప్రకాశ్ నారాయణ నాయ కత్వంలో ప్రతిపక్ష పార్టీలను సమైక్య పరిచే ప్రయత్నంలో ప్రముఖ పాత్ర పోషించారు. జార్జ్ ఫెర్నాండెజ్ తో పాటు వివిధ అంశాలపై పని చేసేవారు. అత్యవసర పరిస్థితి తర్వాత కేంద్రంలో అధికారం చేజిక్కించుకున్న జనతా ప్రభుత్వంలో ముఖ్య పాత్రలు పోషించాడు. మొరార్జీ దేశాయ్ నేతృత్వంలో ఏర్పడిన జనతా ప్రభుత్వం 1979 సంవత్సరంలో కూలి పోవడానికి, జనతా పార్టీలో చీలిక రావటంలో ...జనసంఘ్ – రాష్ట్రీయ స్వయం సేవక్ పార్టీ ద్వంద సభ్యత్వాల కారణాలలో మధులిమాయే పాత్ర ప్రధానమైనది.. జనతా పార్టీలో భాగమైన వారు ఇతర పార్టీలలో గాని, రాజకీయ సంస్థలతో గాని భాగస్వామ్యంలో ఉండరాదని, మురార్జీ దేశాయ్ నేతృత్వంలో ఏర్పడిన జనతా సంకీర్ణ ప్రభుత్వం అధికారం నుండి దింపడంలో రాజ నారాయణ్ కృష్ణ కాంత్ తదితర సహచరులతో కలిసి ప్రణాళికలు రూపొందించి సఫలమయ్యారు. జనతా పార్టీలో భాగస్వాములైన జనసంఘ్ నాయకులు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ((ఆరెస్సెస్) సభ్యులుగా ఉండడంతో ద్వంద్వ సభ్యత్వంపై మధులిమాయే లాంటి నేతల అభ్యంతరాలు 1979 లో జనతా ప్రభుత్వం పతనానికి, జనతా కూటమి పతనానికి దారితీసింది. ఇందిరా గాంధీని ఓడించే ఏకైక లక్ష్యంతో, భిన్న భావజాలాలు కలిగిన పార్టీల కలయికతో ఏర్పడిన జనతా పార్టీ కిచిడీలాంటిదేనని ఆయన నొక్కి చెప్పారు. ఇందిర ఓడి పోవడంతో జనతా పార్టీ చీలిపోవడం ప్రారంభమయింది. వాస్తవానికి లోక్‌సభలో మొరార్జీ దేశాయి ప్రభుత్వానికి మద్దతు నివ్వమని జార్జి ఫెర్నాండెజ్‌కు సలహా ఇచ్చింది మధు లిమాయే. అయితే ఇది జరిగిన కొద్ది గంటలకే సోషలిస్టు నాయకులు మొరార్జీ ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించు కున్నారు. మధు లిమాయే రాజకీయ సిద్ధాంతం, లౌకిక జాతీయవాదం, భారత దేశం యొక్క లౌకిక ఆధారాలపై ఆయనది రాజీలేని వైఖరి. ఆయన రాజ్యాంగంలోని లౌకిక పునాదుల పరిరక్షణకు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. కుల వ్యవస్థకు తన లాంటి సోషలిస్టు ప్రధాన శత్రువని ప్రకటించారు. కుల వ్యవస్థ, దాని ఆధారంగా ఉన్న అసమానతలను కూల్చివేసే వరకు భారత దేశంలో ఆర్థిక మరియు సామాజిక సమానత్వం ఉండదని దృఢమైన అభిప్రాయమని నొక్కి చెప్పారు. మధు లిమాయే తన జీవితమంతా పౌర స్వేచ్ఛ కోసం పోరాడేవారు. పౌరుల స్వేచ్ఛ కోసం దిగువ కోర్టుల నుండి హై కోర్టులలో, సుప్రీం కోర్టులో తన కేసులను వాదించారు. విజయం సాధించారు. మధు లిమాయే విదేశీ విధానంలో... అలీన దేశాల సూత్రములపై ఆధారం, వలసవాద వ్యతిరేకత, ప్రజలందరికీ స్వేచ్ఛ, నిరాయుధీకరణ, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక ప్రయోజనాల రక్షణ, ప్రపంచ శాంతి మున్నగు వాటిలో గట్టి నమ్మకం ఉండేది. రాజకీయ – ఆర్థిక సామ్రా జ్య వాదానికి వ్యతిరేకంగా వలస రాజ్యాల ప్రజల పోరాటం యొక్క పొడిగింపు అయినందున, భారత దేశం తమ విదేశాంగ విధానములో దృఢ వైఖరిని తీసుకోవాలి అని ఆయన పేర్కొనే వారు. మధులిమాయె రాజకీయ నాయకు నిగా కాక రచయితగా ఆంగ్లము, హిందీ, మరాఠి భాషలలో పుస్తకా లను రచించారు. 1997లో భారత ప్రభుత్వం లిమాయే జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంపు విడుదల చేసింది. మధు లిమాయే 1995 జనవరి 8 న్యూఢిల్లీలో మరణించారు.

# మొదలైన మోడీ గేమ్...



విజయవాడ, జనవరి 7,ఆంధ్రప్రదేశ్ లో నరేంద్ర మోదీ గేమ్ మొదలయినట్లే కనిపిస్తుంది. నరేంద్ర మోదీని ఆషామాషీగా అనుకోవడానికి వీలులేదు. ఆయన దూర దృష్టితో ఆలోచించి ఏ రాజకీయ నిర్ణయమైనా ఉంటుంది. అంతే తప్ప తాత్కాలికంగా ఎటువంటి డెసిషన్లు ఉండవు. అదే సమయంలో మనతో మోదీ అనుకూలంగా ఉన్నారనుకోవడం కూడా అంతే తప్పు అవుతుంది. ఎందుకంటే తనకు ఇబ్బందిగా మారతారనుకున్న వారిని మోదీ కట్టడి చేయడానికే ఎక్కువ ప్రయత్నం చేస్తారన్నది దాదాపు దశాబ్దన్నర జాతీయ రాజకీయాలు చూసిన వారికి ఎవరికైనా ఇలాగే తెలుస్తుంది. మొన్న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆధారపడాల్సి వచ్చింది. ఆయన పైకి ఇద్దరితో నవ్వుతూ కనిపించినప్పటికీ లోలోపల మాత్రం ఇద్దరినీ రాజకీయంగా కొంత అణిచివేసే ప్రయత్నం చేస్తారన్నది రాజకీయ వర్గాల్లో సాగుతున్న విశ్లే?షణలు బట్టి అర్థమవుతుంది. అందులోనూ చంద్రబాబు లాంటి సీనియర్ నేతను కంట్రోల్ చేయడం మోదీకి అవసరం అని మోదీ ఖచ్చితంగా భావిస్తారు. చంద్రబాబు నిజానికి మోదీ కంటే సీనియర్ నేత. రాజకీయాల్లో మోదీతో పా?టు ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. అయితే అనేకసార్లు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం తెగదెంపులు చేసుకోవడం ఆయనకు అలవాటు. నితీష్ కుమార్ కూడా అంతే. అందుకే ఇద్దరు సీనియర్ నేతలను మోదీ నమ్మే అవకాశమే లేదు. అందుకే జమిలి ఎన్నికలకు వెళ్లినా వీరిద్దరి విషయంలో ఒకింత జాగ్రత్త పడతారంటున్నారు. బీహార్, ఆంధ్రప్రదేశ్ లలో ఒకింత ఇద్దరు నేతల గ్రిప్ ను తగ్గించేందుకు మోదీ ప్రయత్నిస్తారన్నది తెలుగుదేశం పార్టీ నేతలు సయితం అనుమానిస్తున్నారు. తనను శాసించే పరిస్థితిని మోదీ తెచ్చుకోరు. తన చేయి పైన ఉండాలని, తనను ఒకరు యాచించాలి తప్ప డిమాండ్ చేయడం మాత్రం ఆయన సహించలేరన్నది మోదీ నైజం తెలిసిన వారు ఎవరైనా ఒప్పుకునే విషయం. అందుకే ఈ ఇద్దరు సీనియర్ నేతలైన నితీష్ కుమార్, చంద్రబాబుల విషయంలో మోదీ ఇప్పటికే స్కెచ్ వేసి ఉంటారన్నది భావిస్తున్నారు. వారిని రాజకీయంగా కొంత బలహీనం చేయగలిగితేనే పది కాలాల పాటు పాలన సాగించవచ్చన్న ఆలోచన సహజంగానే మోదీలో ఉంటుందని చెబుతున్నారు.అందులో భాగంగానే పవన్ కల్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ లో హైలెట్ చేయాలని మోదీ భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కొంతకాలం ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే కాకినాడ పోర్టు పైన పడటం కూడా ఒకింత ఢిల్లీ వ్యూహమేనన్న వారు కూడా లేకపోలేదు. అయితే అందులో నిజమెంత? అన్నది పక్కన పెడితే.. చంద్రబాబు గతంలో మాదిరిగా మోదీని డిమాండ్ చేయలేరు. ఎందుకంటే ఏపీలో పవన్ అవసరం చంద్రబాబుకు ఉంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మరోసారి పవన్ తో కలసి ప్రయాణం చేస్తేనే అధికారం దక్కుతుంది. ఆ వీక్ నెస్ తోనే పవన్ ను మోదీ మంచి చేసుకుంటున్నారు. వీలయినప్పుడల్లా పవన్ ను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. పవన్ కల్యాణ్ కు ఢిల్లీ స్థాయిలో ఒక రోడ్ మ్యాప్ ను కూడా రూపొందించే అవకాశాలున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి పవన్ కల్యాణ్ అత్యధిక స్థానాలను కోరే ఛాన్స్ తో పాటు సీఎం సీటు షేరింగ్ విషయంపై కూడా ఒప్పందం చేసుకోవాలన్న ప్రతిపాదన తీసుకు వచ్చినా ఆశ్చర్యం లేదన్నది రాజకీయవర్గాల అంచనాగా వినిపిస్తుంది. చంద్రబాబు రాజకీయ చాణక్యుడు అయితే.. మోదీ అంతకు మించి. చంద్రబాబు భయం కూడా అదే. మోదీని వదిలి పవన్ బయటకు రారు. అలా ఫిక్స్ చేయడంలో నరేంద్ర మోదీ ఇప్పటికే సక్సెస్ అయినట్లు ఏపీ రాజకీయాలు పరిశీలించిన వారికి ఎవరికైనా అర్థమవుతుంది. మొత్తం మీద దక్షిణాదిలో పట్టు పెంచుకోవాలంటే ఏపీలో గ్రిప్ సంపాదించాలన్న మోదీ ఆలోచనతో పవన్ కు రానున్న కాలంలో మరింత ప్రయారిటీ ఇస్తారన్న అంచనాలు వినపడుతున్నాయి. రేపు ఎనిమిదోతేదీన విశాఖ పర్యటనలో కూడా మోదీ పవన్ కు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలున్నాయిఅందుకేచంద్రబాబు నాయుడు పెద్దగా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో డిమాండ్ చేయలేని పరిస్థితి ఉంది. కూటమితోనే వచ్చే ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో ఉన్న చంద్రబాబు ఈసారి మాత్రం పవన్, మోదీలను దూరం చేసుకునే ఆలోచన చేయరు. రాజధాని అమరావతి నిధుల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వలేదు. కేవలం ప్రపంచ బ్యాంకు రుణం ఇచ్చేందుకు మాత్రమే సహకారం అందించింది. అదే సమయంలో జగన్ విషయంలోనూ ఒకింత మోదీ సాఫ్ట్ కార్నర్ లో ఉన్నారని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబును కొంత కట్టడి చేయాలంటే జగన్ ను ఇబ్బంది పెట్టకూడదన్న ఆలోచనలో ఢిల్లీ పెద్దలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. అదే జగన్ ధైర్యం అని కూడా అంటున్నారు. ఇటీవల అమిత్ షాతో విజయసాయిరెడ్డి సమావేశం కూడా అందులో భాగమేనంటున్నారు. అలాగే జగన్ కేసుల విషయంలో కూడా ఎటూ తేల్చుకుండా చూసి చంద్రబాబుకు చెక్ పెట్టడమే కమలం పెద్దల ఆలోచనగా ఉందన్న టాక్ కూడా బలంగా వినిపిస్తుంది. మొత్తం మీద కూటమి కలిసి ఉన్నప్పటికీ బలమైన నేతలను బలహీన పర్చే యత్నాలు మాత్రం ప్రారంభమయ్యాయనే అంటున్నారు. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# కొల్చారం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమం




ప్రజాబలం కొల్చారం మండలం డిసెంబర్ :07-01-2025 కూల్చారం మండల కేంద్రం లో ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశా డే కార్యక్రమంలో భాగంగా. మహిళలకు చట్టాల గురించి అవగాహన కార్యక్రమం.హమహిళా శిశు సంక్షేమ శాఖ మెదక్ ఆధ్వరాయంలో మహిళా సాధికారిక కేంద్రం మరియు మిషన్ శక్తి, జెండర్ స్పెషలిస్ట్ నాగమణి, మాట్లాడుతూ వర్క్ ప్లస్ అరేంజ్మెంట్, వరకట్న వేధింపులు లైంగిక వేధింపులు చైల్డ్ మ్యారేజ్ గురించి ఆశ మహిళలకు వివరించారు. మరియు పోక్స్ యాక్ట్ గురించి. వివరిచ్చారు అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నెంబర్స్181,1098,100 అత్యవసరంలో ఉపయోగించుకోవాలని, సేఫ్ టచ్ -ఉనసేఫ్టచ్ గురించి, అలాగే రమేష్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ గురించి, సుకన్య సమృద్ధి యోజన స్కీమ్ , వివరించారు.

ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు మహిళా సాధికారత టీమ్ జెండర్ స్పెషలిస్ట్ నాగమణి, %డ% ఫైనాన్షియల్ లెటర్స్ (ఎస్ఎఫ్ఎల్ ) రమేష్ మరియు డా. రమేశ్ , డా సారిక ఎం ఎల్హెచ్పి , మదన్మోహన్ ఎం పి హెచ్ ఈ ఓ, ఏసు మని పిహెచ్ఎన్ , మార్త సూపర్వైజర్,, ప్రియాంక గ్లోరీ ఎంఎల్ హెచ్పి ఆరోగ్య సిబ్బంది మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం

విశాఖపట్టణం, జనవరి 7, ఏపీలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారు. గంజాయి తోట కనిపిస్తే కొట్టేయండి లేదా కాల్చేయండి అని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాసాగు చేస్తున్న 8 ఎకరాల గంజాయి తోటల్ని అధికారులు ధ్వంసం చేశారు. అల్లూరి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చుతామని పోలీసులు చెబుతున్నారు. ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు కనిపించినా, గంజాయి అక్రమ రవాణా గురించి తెలిసినా, డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించినా వెంటనే 1972 నెంబర్కు కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణకు డ్రోన్లు, టెక్నాలజీ వినియోగించాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ క్రమంలో పెదబయలు మండలంలోని కంతుర్లకు చేరుకున్న అధికారులు డ్రోన్ల సాయంతో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. గంజాయి సాగు నివారించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ అమిత్ బర్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులు పాతపాడు గ్రామంలో 8 ఎకరాల్లో సాగవుతున్న గంజాయి (కానబిస్) తోటను ధ్వంసం చేశారు. జిల్లాలో కొన్ని రోజుల కిందట సైతం డ్రోన్ల ద్వారా పలుచోట్ల గంజాయి సాగు గుర్తించిన అధికారులు తోటల్ని ధ్వంసం చేశారు.ఇది అక్రమ సాగు నియంత్రణ కోసం చేపట్టిన ఆపరేషన్. ఈ ఆపరేషన్లో డ్రోన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సేవలు, ం1 టూల్స్ ను ఉపయోగించి ఈ గంజా సాగులను గుర్తించి, వాటిని నాశనం చేయడంలో సహకరించాయని రవికృష్ణ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకూ మొత్తం 2,000 ఎకరాలను డ్రోన్ సర్వే బృందం పర్యవేక్షించింది. డ్రోన్ల ద్వారా గంజాయి సాగును గుర్తించి, గంజాయి తోటల్ని నాశనం చేయడం తమ లక్ష్యమన్నారు. అనంతరం వ్యక్తిగతంగా పాతపాడు గ్రామ ప్రజలతో సమావేశమై గంజాయి సాగువల్ల కలిగే దుష్పరిణామాలు వివరించారు. వీటి కేసులలో ఇరుక్కుని జైలుకు వెళితే జీవితం నాశనం అవుతుందని వారికి నష్టాలపై అవగాహన కల్పించారు.గిరిజనులు చేసే గంజా సాగు వల్ల గ్రామంతో పాటు సమాజం భవిష్యత్తుకు ఏర్పడే హానిని ప్రస్తావించారు. గిరిజనులు, గ్రామస్తులు ఇక నుంచి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనకుండా ప్రతిజ్ఞ చేయించారు. వారికి ప్రత్యామ్నాయ పంటలను అందించడానికి పోలీసులు, రెవెన్యూ, అటవీశాఖలు సాయం చేస్తాయని హామీ ఇచ్చారు. ఈ ఏడాది పాతపాడులో కింగ్ బీన్స్, రాజ్మ, మిల్లెట్ వంటి ప్రత్యామ్నాయ పంటలను అందజేసినట్లు తెలిపారు.అల్లూరి సీతారామరాజు పోలీస్ విభాగం, స్థానిక గ్రామాలతో కలిసి మరింత శాశ్వతమైన, చట్టబద్ధమైన వ్యవసాయ పద్ధతుల వైపు మారేందుకు సహాయం చేస్తామన్నారు. మెరుగైన భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలని వారికి సూచించారు. ఈ ఆపరేషన్ లో భాగంగా ఈగల్ ఐజీ రవి కృష్ణ, ఈగల్ ఎస్పీ నాగేశ్ బాబు, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, డీఎస్పీ ప్రమోద్, డీఈవో బ్రహ్మాజీరావు, ఫారెస్ట్ అధికారులు, జల్లా పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి జిల్లాల్లోబరులు సిద్ధం

రాజమండ్రి, జనవరి 7, రాష్ట్రంలో సంక్రాంతి పండగ అంటే ఫస్ట్ గుర్తొచ్చేది కోడి పందేలు. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితం అయిన ఈ పందేల కల్చర్.. ఇప్పుడు చాలా జిల్లాలకు పాకింది. ఒకప్పుడు సరదాగా సాగిన కోడి పందేలు.. ఇప్పుడు మంచి బిజినెస్ అయ్యిందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అందుకే చాలామంది కోళ్లను పెంచడం, వాటిని విక్రయించడం, బరులు నిర్వహించడం ద్వారా కోట్లాది రూపాయలు కూడబెడుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.నిర్వాహకులు కోళ్ల పందెం కట్టినందుకు కొంత, గెలిచిన వారి నుంచి కొంత వాటా తీసుకుంటారు. అంతేకాకుండా బరుల వద్ద సైకిల్, టూవీలర్ పార్కింగ్ నుంచి మద్యం, ఇతర దుకాణదారుల వరకు పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. దీంతో పందేల పేరుతో సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అతి తక్కువ రోజుల్లో కోట్లు రూపాయలు కూడబెట్టుకునే అవకాశం ఉండటంతో.. వివిధ జిల్లాల్లో ఈ సంస్కృతి పెరుగుతోంది. పండగ సంప్రదాయం పేరుతో పందేలు నిర్వహిస్తుండటంతో.. ఆపేవారు ఉండరని నిర్వాహకులు భావిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటి నుంచే బరుల ఏర్పాట్లు ప్రారంభించారు. మరోవైపు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.కోడి పందేలను చూడటానికి, పందేలు కాయడానికి ఏపీలోని ఇతర జిల్లాలతో పాటు.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి సినీ నటులు, బడా వ్యాపారులు వస్తారు. కేవలం పండగ రోజుల్లోనే కోట్ల రూపాయలు చేతులు మారనున్నాయనే టాక్ ఉంది. ఈ ఏడాది.. 12 నుంచి 15 వరకు నాలుగు రోజులు కోడి పందేల నిర్వహించడానికి ఏర్పాట్లు చకాచకా చేస్తున్నారు.పంట పొలాలను చదును చేసి.. చుట్టూ కంచె వేస్తున్నారు. అక్కడే టెంట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల కోసం మట్టి రోడ్లు వేస్తున్నారు. కోడి పందేలకు వచ్చే వారి కోసం ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. బిర్యానీ, భోజన హోటళ్లు, బెల్ట్ షాపులు ఉండేలా చూసుకుంటున్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవాలనుకునే వారి నుంచి కూడా నిర్వాహకులు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు.గతంలో ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పందేలు ఉండేవి. ఇప్పుడు ఇతర జిల్లాల్లోనూ పందేల నిర్వహణకు బరులు సిద్ధం చేస్తున్నారు. దీంతో పందెం కోళ్లకు బాగా డిమాండ్ పెరిగింది. కేవలం సంక్రాంతి కోసమే ప్రత్యేకంగా కోడి పుంజులను పెంచేవారు పెరిగారు. ఒక్కో పుంజు ధర రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉందని పెంపకందారులు చెబుతున్నారు.కోడి పందేలపై గతంలో పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకునేవారు. భోగి పండగకు ముందు వరకు కోడి పందేల నిర్వహణకు వీలు లేదని పోలీసులు స్పష్టం చేశారు. కోళ్లకు కత్తులు కట్టేవారిని బైండోవర్లు చేశారు. కానీ.. కొందరు నేతలు, పెద్దల నుంచి ఒత్తిడి రావడంతో.. పోలీసులు సైలెంట్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఈసారి ఏపీలో సంక్రాంతి వేరే లెవల్ ఉంటుందనే టాక్ నడుస్తోంది.

# జెండా మోసేదెవరు...

ఒంగోలు, జనవరి 7, బాపట్ల జిల్లాలోని పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన ఎన్ఆర్ఐ యడం బాలాజీ నియోజకవర్గంలో లేకుండా అడ్రస్ లేకుండా పొయ్యారు. ఎన్నకల ఫలితాలు వెలువడగానే ఫ్లైట్ ఎక్కేసిన ఆయన అమెరికాలో సొంత వ్యాపారాలు చూసుకుంటూ పార్టీ వ్యవహారాలను పట్టించుకోవడమే మానేశారంట. దాంతోపర్చూరు నియోజకవర్గంలో వైసిపి జెండా మోసే నాయకుడు కరువయ్యాడు.పర్చూరుకు కొత్త ఇన్జార్జిని నియమించాలనీ వైసిపి అధిష్టానం చూస్తుందట. ఇప్పటికే పార్టీ ఆవిర్భావం నుంచి నలుగురు ఇన్ఛార్జులను మార్చిన వైసీపీ ఈ సారి లోకల్ వ్యక్తులనే నియమించాలని చూస్తుందట. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు గాదె మధుసూదన్ రెడ్డిని నియమించాలన్న ఆలోచనలో వైసీసీ అధ్యక్షుడు జగన్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇటీవల పులివెందులకు వచ్చిన జగన్ ప్రస్తుత ఇన్చార్జ్గా ఉన్న యడం బాలాజీకి కొత్త వారికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సమాచారం ఇచ్చారట.గాదే మధుసూదన్ రెడ్డి సొంత ఊరు పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లు మండల పరిధిలోకి వస్తుంది .. ఇటు మాజి మంత్రి గాదే వెంకటరెడ్డి పలు సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన అనుభవంతో పాటు ఆ కుటుంబానికి నియోజకవర్గంలో సొంత క్యాడర్ కూడా ఉంది.. దాంతో పర్చూరు వైసీపీ బాధ్యతలను గాదే కుటుంబానికి అప్పగించాలని జగన్ ఆలోచిస్తున్నారంట. వైసిపి పార్టీ ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు పర్చూరు నియోజకవర్గంలో బోణి కొట్టలేదు. వరుస ఓటములతో నియోజకవర్గంలో వైసీసీ బలహీనంగా మారిపోయింది.పర్చూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలో టీడీపీ ఏడు సార్లు విజయం సాధించగా కాంగ్రెస్ నాలుగు సార్లు విజయం సాధించింది. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు నియోజకవర్గంలో టీడీపీ జెండానే ఎగురుతుంది. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో విజయం సాధించేందుకు అభ్యర్థులను మార్చి మార్చి ప్రయోగించినా వైసీపీ విజయం సాధించలేకపోయింది. నియోజకవర్గంలో వరుసగా మూడుసార్లు పోటీ చేసిన వైసీపీ ప్రతిసారి ప్రయోగాలతో కొత్తవారిని బరిలోకి దింపినా విజయం సాధించలేకపోయింది. ఎన్నికల సమయంలో వచ్చిన కొత్త నేతను స్థానిక క్యాడర్ వ్యతిరేకించడంతో పాటు సదరు అభ్యర్థికి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకునేందుకు సమయం సరిపోయేది. అందుకే నియోజకవర్గంలో ఒక్కసారి కూడా వైసీపీ విజయం సాధించలేకపోయిందన్న అభిప్రాయం ఉంది.ప్రధానంగా నియోజకవర్గంలో బలమైన నేతగా ముద్రపడ్డ టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును వైసీపీ ఎదుర్కోలేకపోయింది. 2014 ఎన్నికల నుంచి మొన్నటి ఎన్నికల దాకా హ్యాట్రిక్ విజయాలతో పర్చూరులో తిరుగులేని నేతగా ఎదిగారు ఏలూరి సాంబశివరావు. 2014 ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన ఏలూరి సాంబశివరావు ఆ తరువాత సొంత ఇమేజ్ ను పెంచుకుంటూ వచ్చారు. 2019 ఎన్నికల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రమంతా ఫ్యాన్ పార్టీ హవా నడిచిన నియోజకవర్గంలో ఏలూరు సాంబశివరావు గెలుపును అడ్డుకోలేకపోయింది. ఆ ఎన్నికల్లో నియోజకవర్గంలో సీనియర్ రాజకీయ నేత దగ్గుబాటి వెంకటేశ్వరరావు పై సాంబశివరావు గెలుపొందారు. 2024 ఎన్నికల్లో మూడోసారి కూటమి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సాంబశివరావు వైసీపీ అభ్యర్థి ఎన్నారై యడం బాలాజీ పై 24 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు.మెత్తానికి వైసిపి రా?ష్ట్రంలో భారి ఓటమి అనంతరం పార్టీకి రిపేర్లు చేసుకునే పనిలో పడింది. పర్చూరు బాధ్యతాలు గాదే మధుసూధన్రెడ్డికి పగ్గాలు అప్పగించాలని.. అప్పుడే పార్టీ కాస్త అయినా గాడిలో పడే అవకాశముందని నియోజకవర్గ వైసీపీ శ్రేణులు. ఎన్నికల ముందు ఎవరో ఒకరు రావడం.. ఓడిపోగానే కనపడకుండా పోతుండటంతో కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంటోంది. ఇప్పటికే పర్చూరు వైసిపి ఇన్చార్జులను నలుగురిని మార్చింది.

ఇప్పుడు మళ్లీ మారిస్తే గాదే మధుసూదన్ రెడ్డి అయిదో కృష్ణుడవుతారు. మరి చూడాలి లోకల్ అయిన మధు సూదన్ పర్చూరు బాధ్యతలు చెపడితే నియోజకవర్గంలో ఏ మాత్రం ప్రభావం చూపిస్తారో.

# అన్నదాత సుఖీభవ పంపిణీకి ఏర్పాట్లు



గుంటూరు, జనవరి 7, రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో కలిపి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ స్కీమ్ అమలుకు సర్కార్ ప్రయత్నాలు మొదలుపెట్టింది.ఏపీలో కూటమి ప్రభుత్వం...ఎన్నికల హామీల్లో ఒక్కొక్కటి అమలు చేసేందుకు ప్రయత్నిస్తుంది. తాజాగా అన్నదాత సుఖీభవ పథకంపై ప్రభుత్వం అప్డేట్ ఇచ్చింది. కొత్త సంవత్సరంలో రైతులకు శుభవార్త చెప్పింది. రైతుల సంక్షేమానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ఇటీవల కేబినెట్ లో చర్చించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేలు ఇస్తుంది. పీఎం కిసాన్ నిధులతో కలిపి రూ.20 వేలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.పీఎం కిసాన్ నిధులు తరహాలో మూడు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలని భావిస్తుంది. ఈ మేరకు కేంద్రం ఒక్కో విడతలో ఎంత మొత్తం నిధులు విడుదల చేస్తుంది, రాష్ట్ర ప్రభుత్వం ఎంత విడుదల చేయాలని విషయాలపై చర్చిస్తుంది. త్వరలోనే అన్నదాత సుఖీభవ విధి విధానాలను ఖరారు చేసి పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అర్హత ఉన్న ప్రతిరైతుకు ఏడాదికి రూ. 20వేలు అందిస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. ఈ మేరకు ఇటీవల బడ్జెట్ లో అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 4,500 కోట్లను కేటాయించారు.అన్నదాత సుఖీభవ నిధులను ఈ ఏడాది మే నెలలో విడుదల చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇటీవల నరసాపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ...అన్నదాత సుఖీభవ పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు మే నెలలోనే రూ.20 వేలు అందిస్తుందన్నారు.వైసీపీ హయాంలో రైతుభరోసా పేరిట రైతులకు పెట్టుబడి సాయం అందించేవారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట కేంద్రం ఏటా అందించే రూ.6 వేలకు మరో రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 అందించేవారు. ఎన్నికల హామీల్లో ఈ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని కూటమి పార్టీలు ప్రకటించాయి. కూటమి ప్రభుత్వం ఈ హామీ అమలుపై దృష్టి సారించింది. మూడు విడతల్లో రూ. 20 వేలు సాయం అందించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పేరిట పోర్టల్ ప్రారంభించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్ నిధులు రూ.6 వేలకు మరో 14 వేలు కలిపి రూ.20 వేలు అందించనున్నారు

# టీడీఆర్ లెక్క 150 కోట్లపైనే

తిరుపతి, జనవరి 7, తిరుపతి నగర పాలక సంస్థకు ఏకంగా 150కోట్లు రూపాయలు నష్టం చేకూర్చారని విజిలెన్స్ నివేదికలో తేల్చింది. మాస్టర్ ప్లాన్ రహదారుల కోసం సేకరించిన అస్తులను కమర్షియల్ గా మార్చి వాటి విలువ పెంచి అయిన వారికి ఇష్టానుసారం టీడీఅర్ బాండ్స్ ఇచ్చారని దీంతో నగర పాలక సంస్థ నష్ట పోయిందని నివేదిక తేల్చి చెప్పింది. మాస్టర్ ప్లాన్ రహదారుల పేరుతో భూమన గ్యాంగ్ చేసిన దందా బయటపడిందని అంటున్నారు. ఈ స్కాంలో భూమనతో పాటు పలువురు వైసీపీ నేతలు, ప్రభుత్వం యంత్రాంగం మెడకు ఈ ఉచ్చు బిగుసుకోవడం ఖాయమంట.వైసీపీ పాలకులు అయిన వారికి ఇష్టానుసారం ప్రభుత్వ ధనాన్ని దోచి పెట్టారు. వివిధ పథకాల పేరుతో తమ వారికి అయాచిత లబ్ధి చేకూర్చారు. దీంతో పాటు తాము లబ్ధిపొందారు..

ఈ విధంగా జరిగింది తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం.. మొత్తం మాస్టర్ ప్లాన్ రహదారుల్లో ఏకంగా 104 రహదారుల నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేశారు. 2003 సంవత్సరం చివర్లో హడావుడిగా నిర్మాణం పనులు నెత్తికెత్తుకున్నారు.. ఇందులో బాగంగా 23 రహదారుల నిర్మాణం పూర్తి చేసారు.అయితే వాటి కోసం 1,389 అస్తులను సేకరించారు. వారికి పరిహారం ఇవ్వడానికి నిధులు లేక పోవడంతో టీడీఅర్ బాండ్ల ఇవ్వడం మొదలు పెట్టారు. అక్కడే అసలు మతలబు జరిగింది. . ఆ రహదారులు వేస్తుంది తమ అస్తుల విలువ పెంచుకోవడానికే అని అప్పట్లో విమర్శలు వచ్చాయి.. దానికి తగ్గట్లు గానే వైసీపీ హయాంలో రహదారులు వేసిన ప్రాంతాలలో ఆ పార్టీ కీలక నేతలు అయిన సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డితో పాటు స్థానిక నేతలు, కార్పొరేటర్ల , చివరికి గల్లీ నేతల అస్తులు కూడా ఉన్నాయి. కొత్త రహదారులు వేయడం పుణ్యమాని వాటి ధరలు పెరిగి పోయాయి.ఇక అదే సమయంలో సదరు నాయకులు తమ అస్మదీయులకు న్యాయం చేయాలని భావించారు. అందులో భాగంగా రెసిడెన్షియల్ ఏరియాలను సైతం కమర్షియల్గా మార్చి వేశారు..

అందుకు గాను తమ వారితో అప్పటి కప్పుడు రహదారి వేస్తున్న ప్రాంతాలలో కమర్షియల్ షెడ్స్ వేయించడం లాంటి కార్యకలాపాలు చేయించారు. చిన్న పాటి హోటల్స్ పెట్టించారు. వాటిని చూపిస్తూ అ ఏరియా మొత్తం కమర్షియల్ లెక్కలతో రికార్డులు తయారు చేయించారు. ఆ విధంగా వారు చేయడంతో పెద్ద ఎత్తున నగర పాలక సంస్థ కు ఖజానాకు నష్టం వాటిల్లింది. దానికి తోడు రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులతో మార్కెట్ వాల్యు పెంచి అంచనాలు వేయించారు.మాస్టర్ ప్లాన్ రహదారుల కోసం మొత్తం 1,389 అస్తులను సేకరించగా అందులో టీడీఅర్ బాండ్ల జారీకి అర్హమైనవని 1,149గా తేల్చారు. ఎన్నికల లోపే హడావుడిగా 442 బాండ్ల ను జారీ చేశారు. ఇంకా 707 ఆస్తులకు సంబంధించి బాండ్ల ను జారీ చేయాల్సి ఉంది. అప్పట్లోనే వీటి పైన టీడీపీ పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడంతో వాటిపై అప్పటి మున్సిపల్ ప్రధాన కార్యదర్శి అయిన లక్ష్మి విచారణకు అదేశించారు. దాంతో మిగతా స్థలాలకు టీడీఆర్ బాండ్లు జారీ చేయలేక పోయారు. జారీ చేసిన టీడీఆర్ బాండ్ల విలువ 850 కోట్లు కాగా అందులో అనవసరంగా 150 కోట్లు పెంచారని .. వాస్తవ విలువ 700 కోట్లుగా విజిలెన్స్ తేల్చి చెప్పింది.మొత్తం వ్యవహారంలో కీలక పాత్ర పోషించింది మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్రెడ్డేనంట.. భూమనతో పాటు ఆయన కూమారుడు మాజీ డిప్యూటీ మేయర్, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన భూమన అభినయ్రెడ్డితో పాటు అప్పట్లో పనిచేసిన నగర పాలక సంస్థ కమిషనర్ హారిత, టౌన్ ప్లానింగ్ , నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారులు దందా మొత్తం నడిపించారని అంటున్నారు. భూమన కరుణాకరరెడ్డి పర్సనల్గా తీసుకుని నడిపించిన ఈ తతంగంలో ఎవరి వాటాలు వారికి ముట్టాయంటున్నారు.మొత్తం వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరుగుతుండటంతో మరింత మంది పాత్ర బయటపడే అవకాశముందంట. దీనికి సంబంధించి తమ కంటే రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది ప్రధానంగా ఇరుక్కు పోతారని? తమకేమి నష్టం లేదని తిరుపతి టౌన్ ప్లానింగ్ అధికారులు అంతర్గత సంభాషణల్లో అంటున్నారంట.. మొత్తం మీద మున్సిపల్ శాఖ సైతం దీనిపై అనంతపురం అర్జేడీ విశ్వనాథ్ అధ్వర్యంలో ఎంక్వయిరీ చేయించింది. ఆ నివేదిక కూడా బయట పడితే ఈ కుంభకోణంలో తిమింగలాలతో పాటు చిన్నా చితకా చేపల భాగోతం కూడా బయటపడుతుందంటున్నారు.

# చిన్న కొలువై ఇసుక రిచ్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల బీర్పూర్ మండలంలోని చిన్న కొలువై గ్రామంలో ఉన్న ఇసుక రిచ్ ను జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్ మంగళవారం స్థానిక ఎమ్మార్వో తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక డంపులను రెవెన్యూ మరియు ఏడి మైనింగ్ అధికారులు 118 ట్రాక్టర్ ట్రిప్పులను సేజ్ చేశారు. అక్రమ ఇసుక రవాణా జరగకుండా పక్కాగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి భద్రత ఏర్పాటు చేయాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఏర్పాటు చేసిన ఇసుక రిచ్ ల ద్వారా మాత్రమే ఇసుక రవాణా చేయాలని తెలిపారు. అలాగే తహసీల్దార్ ల సిబ్బంది అక్రమ ఇసుక రవాణా జరగకుండా ఎప్పటికపుడు నిఘా ఉంచాలని తెలిపారు.అలాగే అధికారుల సమన్వయం చేసుకుంటూ అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వాహనాలు పట్టుకుని సీజ్ చేయాలని అధికారులకు సూచించారు.కలెక్టర్ వెంట, జిల్లా మైనింగ్ అధికారి జై సింగ్ తహసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ద్రవ్యోల్బణం, బలహీన రూపాయే అంశాలు

కరోనా తర్వాత ప్రపంచమంతా ఎదుర్కొంటున్న అత్యంత ప్రధాన సమస్య ద్రవ్యోల్బణం. భారతదేశం ఆర్థికంగా ముందడుగు వేస్తుందని చెబుతున్నప్పటికీ.. దేశంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి అవసరం చాలా ఉంది. ఎందుకంటో, 2024 అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 14-నెలల గరిష్ఠ స్థాయి 6.21%కి చేరుకుంది. ఆహార ద్రవ్యోల్బణం 15-నెలల గరిష్ఠ స్థాయి 10.87%కి చేరుకుంది. 2023లో, గృహస్తుల ద్వారా వచ్చే పొదుపులు 50 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. నగరాల్లో నివశిస్తున్న సగానికి పైగా జనం అప్పులతోనే జీవితాన్ని గడుపుతున్నారుపేదరికం తగ్గిందని చెబుతున్నప్పటికీ.. అప్పుల భారం సామాన్యుణ్ని ఊపిరి తీసుకోనివ్వడం లేదు. ఇలాంటి నేపథ్యంలో.. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి ఉంది. అది ఎంత త్వరగా జరిగితే.. దేశంతో పాటు రాష్ట్రాలు కూడా బాగుపడే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే.. ఉఆఖ వృద్ధి చెందేలా చేయాలి. 2024 డిసెంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉఆఖ వృద్ధి అంచనాలను 7.2% నుండి 6.6%కి తగ్గించింది. రెపో రేటును వరుసగా పదకొండు పర్యాయాలు తగ్గించలేదు. ప్రపంచంలోనే మూడో అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఈ టార్గెట్ సరిపోదన్నది ప్రధానికి తెలియని విషయం కాదు.దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటానికి విదేశీ పెట్టుబడులను ఆకర్షించండం ప్రధాన సవాలుగా ఉంది. అయితే 2022-23, 2023-24 మధ్య 13 వేల కోట్ల రూపాయల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గాయని లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు, ఎలన్ మస్క్ లాంటి కుబేరుడు భారత్‌లో పెట్టుబడి పెడతామని చెప్పి, తర్వాత తత్సారం చేయడం ప్రారంభించారు. భారత్ పర్యటనను రద్దు చేసుకోని, చైనా వైపు చూపు తిప్పారు. ఇంకోవైపు, అదానీ, అంబానీల ఆస్తి గ్రాఫ్ కూడా ఇటీవల తగ్గు మొహం పట్టింది.భారత ప్రధాని మోదీ తీరిక లేకుండా విదేశీ పర్యటనలు చేస్తున్నప్పటికీ.. అనుకున్నంతగా విదేశీ పెట్టుబడులను భారత్ ఆకర్షించలేకపోతోంది.

అమెరికాలో అధికార పీఠం ఎక్కబోతున్న డొనాల్డ్ ట్రంప్ చూస్తే.. టారిఫ్‌లతో అటాక్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మోడీ బాధ్యత మరింత పెరిగింది. అంతర్జాతీయంగా భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగాలంటే.. రూపాయిని కూడా బలోపేతం చేయాల్సి ఉంది. 2024 డిసెంబర్‌లో.. రూపాయి మూడవ వరుస సెషన్‌లో బలహీనంగా మారింది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే 85.27 వద్ద ఆల్ టైమ్ కనిష్ట స్థాయి వద్ద స్థిరపడింది.

ఈ నేపథ్యంలో.. మోదీ ముందున్న పెద్ద సవాలు రూపాయిని బలోపేతం చేయడమే!ఇక, దేశంలో పేదరికం తగ్గుతుందని నివేదికలు వస్తున్నప్పటికీ.. నిరుద్యోగం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అందుకే, మోదీ ప్రభుత్వం అర్జెంట్‌గా ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాల్సి ఉంది. గత రెండేళ్లుగా 10% వద్దే చతికిలపడిన యువత నిరుద్యోగం రేటును ఈ ఏడాది అయినా మెరుగుపర్చాల్సి ఉంది. ఎకనామిక్ సర్వే ప్రకారం, దేశంలోని మొత్తం యువతలో సగం మంది కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత కూడా ఉద్యోగాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. పోస్ట్‌మ్యాన్ ఉద్యోగాలకు కూడా పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ హోల్డర్లు దరకాస్తు చేసుకుంటున్న పరిస్థితి ఉంది. ఒక విధంగా, దేశంలో చాలా మంది చదువుకు సంబంధించిన ఉద్యోగాలు చేయలేకపోతున్నారు.

స్వయం ఉపాధిని ఆశ్రయిద్దామనుకున్నా.. కార్పొరేట్ సంస్థలు వచ్చి చిన్నపాటి వ్యాపారాలను కూడా నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ సమస్యను అధిగమించాలంటే.. ప్రభుత్వం సామాన్యులకు మేలు చేసే విధంగా విధివిధానాలను రూపొందించాల్సి ఉంది. గత నాలుగేళ్లలో పారిశ్రామిక రంగానికి రూ.5.65 లక్షల కోట్లు రుణమాఫీ చేశారు. దేశంలోని అతిపెద్ద ఉపాధి సంస్థ వ్యవసాయం, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్‌ల నుండి అన్ని రంగాల్లో రుణాల రద్దు విషయంలో అతి తక్కువ శ్రద్ధ కనబరుస్తున్నారు. కాబట్టి, ఈ సంవత్సరమైనా కేంద్రం ఉద్యోగ కల్పన నుండి స్వయం ఉపాధిలో సామాన్యుడికి సహకరించాల్సి ఉంది.

ఈ ఏడాది, ఏటా 17 లక్షల మంది భారతీయులకు ఆహార కొరత మోదీ ప్రభుత్వం ముందున్న అత్యంత ముఖ్యమైన సవాలు అందరికీ ఆహారాన్ని అందించండం. ఏటా 17 లక్షల మంది భారతీయులు తగినంత ఆహారం తీసుకోకపోవడం వల్ల వచ్చే వ్యాధులతో మరణిస్తున్నట్లు నివేదికలు ఉన్నాయి. 2013 నుండి భారతదేశం ఉఆఖలో 50% పెరిగినప్పటికీ.. ప్రపంచంలోని పోషకాహార లోపం ఉన్న పిల్లలలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది భారతదేశంలో నివసిస్తున్నారు. వీరిలో మూడేళ్లలోపు పిల్లల్లో సగం మంది తక్కువ బరువుతో ఉన్నారు.భారతదేశంలో పోషకాహార లోపానికి ప్రధాన కారణాలలో ఆర్థిక అసమానత ఒకటి. జనాభాలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఆర్థిక స్థితి కారణంగా, వారి ఆహారంలో తరచుగా నాణ్యత లోపం, పరిమాణంలోనూ తక్కువ ఉంటోంది. ఇలా పోషకాహార లోపం ఉన్న స్త్రీలకు ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టే అవకాశం తక్కువ. అధిక పోషకాహారం తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. భారతదేశంలో జాతీయ స్థూలకాయం రేట్లు 2010లో స్త్రీలకు 14%, పురుషులకు 18%గా ఉంది. కొన్ని పట్టణ ప్రాంతాలలో 40% కంటే ఎక్కువగా ఉంది. ఊబకాయం వల్ల హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్లు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక నాన్-కమ్యూనికేబుల్ వ్యాధులకు కారణమవుతుంది.మరోవైపు, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులతో.. సమాజానికి దీర్ఘకాలిక నష్టం ఉంది.

మంచి ఆహారం తీసుకునే వారితో పోలిస్తే, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు న్యుమోనియా, క్షయ వంటి అంటు వ్యాధులకు లోనవుతారు. ఇది అధిక మరణాల రేటుకు దారితీస్తుంది. అంతేకాకుండా, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు పనిలో తక్కువ ఉత్పాదకతను కలిగి ఉంటారు. తక్కువ ఉత్పాదకత వారికి తక్కువ వేతనాన్ని అందించడమే కాకుండా వారిని పోషకాహార లోపం అనే విష వలయంలోకి నెడుతుంది.అందరికీ సమాన వేతనాలు ఉండేలా చూసుకోవడం వల్ల అందరూ మంచి ఆహారాన్ని పొందడానికి అవకాశం ఉంటుంది. గత దశాబ్దంలో వాస్తవ వేతనాల వార్షిక వృద్ధి రేటు అఖిల భారత స్థాయిలో సున్నాకి దగ్గరగా ఉంది. గత ఐదు సంవత్సరాలుగా గ్రామీణ వాస్తవ వేతనాలు 0.4% తగ్గాయి. అలాగే, వ్యవసాయ వేతనాలు 0.2% వద్ద నిలిచిపోయాయి. ఐదుగురిలో నలుగురు వ్యక్తులు 2021 నాటికి రూ.515 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. అయితే, సామాజిక-ఆర్థిక సంక్షేమంలో మెరుగుదల ఉంటే.. పిల్లల పోషకాహారం కూడా మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు కూడా భావిస్తున్నారు.

కాబట్టి, దేశంలో ప్రజల ఆరోగ్యంతో పాటు దేశ ఆర్థిక స్థితి మెరుగుపడాలన్నా మోడీ ప్రభుత్వం ఈ సవాళ్లను పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.ఇక, దేశంలో అట్టడుగున ఉన్నవారికి గౌరవం కల్పించాలనే డిమాండ్ కూడా ఉంది.

ఇందులో భాగంగా.. ముఖ్యంగా, మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధాన్ని సరిగ్గా అమలు చేయాల్సి ఉంది. మాన్యువల్ స్కావెంజింగ్ 2013లో నిషేధించబడినప్పటికీ.. 2018-2020 మధ్య, మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం వల్ల 443 మంది మరణించారు. ఇక, మోడీ పాలనలో నిజానిజాలను బయటకు తీసుకొచ్చే జర్నలిస్టుల మీద దాడులు మరింత పెరిగాయన్నది స్పష్టంగా లెక్కలు చెబుతున్న వాస్తవాలు.2019 నుండి.. 100 బిల్లులు, రెండు గంటలలోపే ఆమోదించబడ్డాయి. 17వ లోక్‌సభలో, పార్లమెంటులో ప్రవేశపెట్టిన 10 బిల్లుల్లో 9 బిల్లులపై ఎవర్నీ సంప్రదించలేదు.. ఒక వేళ ఏదైనా చర్చ సాగినా అది అసంపూర్తిగానే మిగిలింది. ఇలా, ఏకపక్షంగా బిల్లులు ఆమోదించిన ఘనత మోడీకి దక్కిందని విపక్షాలతో పాటు ప్రజా సంఘాలు కూడా దుమ్మెత్తి పోశాయి. అయినా, పరిస్థితుల్లో మార్పు రాలేదు. ఈ ఏడాది జరిగే లోక్ సభ సమావేశాల్లో అయినా సక్రమంగా జరుగుతుందోమో చూడాలి.

ఇక, సురక్షితమైన ప్రజా మౌలిక సదుపాయాలపై కూడా విమర్శలు లేకపోలేదు. 2017-2022 మధ్య 244 రైలు ప్రమాదాలు జరిగాయి. మోర్బిలో వేలాడే వంతెన కూలిపోవడంతో 135 మంది మరణించారు. ఉత్తరకాశీ టన్నెల్‌లోకి ప్రవేశించిన తర్వాత 41 మంది కార్మికులు 17 రోజుల పాటు చిక్కుకుపోయారు. దీనికి తోడు.. దేశంలో సురక్షితమైన ఇంటర్నెట్ లోపం కారణంగా.. 2024 మొదటి తొమ్మిది నెలల్లో "డిజిటల్ అరెస్టులకు" సంబంధించిన మోసాలు రూ.1616 కోట్ల విలువైన నష్టాలను చూశాయి.ఏడాది క్రితం చట్టం ఆమోదించబడినప్పటికీ డిజిటల్ డేటా రక్షణ నియమాలు నోటిఫై చేయలేదు. ఇవన్నీ మోదీ ప్రభుత్వంపై కేవలం విమర్శలు మాత్రమే కాదు. ఇది మోదీ ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా. మూడో టర్మ్‌లో ఆరు మాసాలు దాటిపోయిన కేంద్ర ఎన్డీయే ప్రభుత్వం, వీటన్నింటిపై ఇప్పుడు ధ్యాస పెట్టాల్సి ఉంది. మరి, ఈ కొత్త సంవత్సరంలో మోదీ ఈ సమస్యలను పరిష్కరిస్తారో లేదో చూడాలి.

# ముందే ముంగిట్లోకి ముంజులు, మామిడిపండ్లు

విజయవాడ, జనవరి 7, ఏపీలో ఓ ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది.ఎప్పుడో వేసవి కాలం అంటే ఏప్రిల్ , మే నెలలో కనిపించే తాటి ముంజలు, మామిడి పండ్లు.. మూడు నెలలు ముందుగానే దర్శనమిచ్చాయి. విచిత్రంగా డిసెంబర్‌లోనే తాటి ముంజలు, మామిడి పండ్లు అందుబాటులోకి రావడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. విజయవాడలో తాటి ముంజలు, మామిడి పండ్లను రోడ్లు పక్కన ఉంచి విక్రయిస్తున్నారు. . ఇదంతా చూసి కొందరు ఆశ్చర్యపోతున్నారు. మరికొందరు వీటిని కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్తున్నారు.వాస్తవానికి ఏటా వేసవికాలంలో, ఏప్రిల్ నెలలో తాటిముంజలు సీజన్ ఉంటుంది. జనాలు ఎండ తీవ్రతను నుంచి ఉపశమనం పొందేందుకు కొంటుంటారు. కానీ ఇప్పుడు రోడ్ల పక్కన డిసెంబర్‌లోనే తాటి ముంజలు కనిపిస్తున్నాయి. విజయవాడలోని బందరు రోడ్డులో గంగూరు సమీపంలో తాటిముంజలను డజను రూ.100 నుంచి రూ.120కి విక్రయిస్తున్నారు. జనాలు కూడా తాటి ముంజల్ని కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది మాత్రం డిసెంబర్‌లో తాటి ముంజలు ఏంటని చర్చించుకుంటున్నారు.మరోవైపు విజయవాడలోనే మామడి పండ్లు కూడా రోడ్ల పక్కన కనిపిస్తున్నాయి. నెల్లూరు జిల్లా ఉలవపాడు ప్రాంతంలో తోటల్లోని రెండు వేల చెట్లలో మామిడి పంట దిగుబడికి వచ్చిందట. మొత్తం నాలుగు టన్నుల మామిడి పండ్లను విజయవాడ కృష్ణలంక సమీపంలో రోడ్డుపై వీటిని అమ్ముతున్నారు. వీటిని కిలో రూ.250 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. జనాలు కూడా మామిడి పండ్లను కొనుగోలు చేస్తున్నారు. అయితే తాటి ముంజలు, మామిడి పండ్లు ఎలా వచ్చాయని ఆరా తీస్తే.. అవి పైరు కాపు ఉత్పత్తులని.. వందల చెట్లలో కొన్ని ఇలా ముందే కాపునకు వస్తాయని రైతులు చెబుతున్నారు.అందుకే ముందే ఇలా పంట దిగుబడి వచ్చిందంటున్నారు.వాస్తవానికి మామడి పండ్లు, తాటి ముంజలు ఏప్రిల్ నెలలో అమ్మకాలు చేస్తారు. వేసవి కాలంలో ఎక్కువగా పంట దిగుబడి ఉంటుంది. మామిడి పండ్లు ఆగస్టు నెల వరకు దొరకుతాయి.. ఆ తర్వాత పునాస మామిడిపండ్లు ఉండేవి. కానీ విచిత్రంగా తాటి ముంజలు మాత్రం డిసెంబర్‌లో రావడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# పార్టీకి, పదవికి ట్రూడో రాజీనామా

న్యూఢిల్లీ, జనవరి 7, (న్యూస్ పల్స్) కొద్ది గంటల ఊహాగానాల తర్వాత కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో లిబరల్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన పదవికి, లిబరల్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయనున్నట్లు సంచలన ప్రకటన చేశారు. కొత్త నాయకుడిని ఎన్నుకునే వరకూ ఆయన ప్రధానిగా కొనసాగనున్నారు. ఈ క్రమంలో ఆ దేశ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కొత్త నాయకత్వాన్ని ఎన్నుకున్న తర్వాత బాధ్యతల నుంచి వైదొలుగుతానని ట్రూడో చెప్పారు. ఆయన రాజీనామాతో దాదాపు 10 ఏళ్ల అధికారానికి ముగింపు పలికినట్లవుతుంది. కాగా.. దేశవ్యాప్తంగా ట్రూడోపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోవడంతో.. లిబరల్ పార్టీ ఎన్నికల్లో గెలిచే అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఈ క్రమంలో సొంత పార్టీ నేతల నుంచి కొంతకాలంగా డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు.

## విద్యుత్ షాక్ తో ఇల్లు దగ్ధం..ఇద్దరు సజీవ దహనం

బాపట్ల జిల్లాలోని పర్చూరులో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో ఓ ఇంట్లో మంటలు చెలరేగి అక్కా చెల్లెళ్ళు సజీవ దహనం అయ్యారు. గ్రామంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పర్చూరు రామాలయం వీధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దాసరి వెంకటేశ్వర్లుకు చెందిన ఇంట్లో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే తేరుకున్న తల్లి లక్ష్మీరాజ్యం కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఇంట్లో మంటల్లో చిక్కుకున్న తన ఇద్దరు కుమార్తెలను కాపాడటానికి తల్లి చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో అగ్నిప్రమాదంలో చిక్కుకుని కదలలేని స్థితిలో వికలాంగురాలిగా ఉన్న అక్క దాసరి నాగమణి (34), చెల్లెలు దాసరి మాధవి లత (30) సజీవ దహనమయ్యారు. కళ్ళ ముందే ఇద్దరు కూతుళ్ళు సజీవ దహనం అవుతుండటంతో తల్లి తల్లడిల్లిపోయింది. గుండెలవిసేలా రోదించింది.

సమాచారం అందుకున్న చీరాల ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే మృతి చెందిన అక్కాచెల్లెళ్ళ మృతదేహాలను బయటకు తీసి.. పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుమార్తెలను కాపాడుకోబోయి తీవ్ర గాయాలపాలైన తల్లి లక్ష్మీరాజ్యంను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అనారోగ్యశ్రీగా మార్చిన కూటమి సర్కార్

## వైఎస్ షర్మిలా రెడ్డి



విజయవాడ పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఆరోగ్య శ్రీ. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర మానస పుత్రిక ఈ పథకం. ప్రాణాలు తీసే జబ్బొచ్చినా సంజీవని లాంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని.. కూటమి సర్కార్ అనారోగ్యశ్రీగా మార్చిందని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి విమర్శించారు. రూ.3వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా, వైద్యసేవలు నిలిచే దాకా చూడటం అంటే.. పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రనే ఇదంతా. ఆరోగ్య శ్రీ పథకానికి మంగళం పాడి.. ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుంది. ఆరోగ్యానికి పెద్దపీట అంటూనే కత్తిపీట వేస్తున్నారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ.. వదిలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ పథకానికి బకాయిలు గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టినవి అయినా. వాటిని చెల్లించే బాధ్యత మీ ప్రభుత్వంపైనే ఉందని అన్నారు.

వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలవండి. పెండింగ్ బకాయిలు రూ.3వేల కోట్లు తక్షణం విడుదల చేయండి. ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించి, పథకానికి ఏ లోటూ రాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# దిల్ రాజు... సయోధ్య యత్నాలు...

హైదరాబాద్, జనవరి 7, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు భారీ బడ్జెట్ వెచ్చించిన గేమ్ ఛేంజర్ సినిమా రిలీజ్‌కు రెడీ అయింది. సంక్రాంతి సందర్భంగా జనవరి 10వ తేదీన ఈ మూవీ విడుదల కానుంది. మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అయితే, తెలంగాణలో పరిస్థితి వేరుగా ఉంది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన తర్వాత.. సినిమాల బెనిఫిట్ షోలకు, టికెట్ల ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని తెలంగాణ ప్రభుత్వం చెప్పేసింది. అయితే, తనకు ఇంకా ఆశ ఉందని దిల్‌రాజు తాజాగా అన్నారు. దీనిపై టాలీవుడ్ మొత్తం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. వివరాలివే..తెలంగాణలో టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు కదా అని మీడియా సమావేశంలో దిల్‌రాజుకు ప్రశ్న ఎదురైంది. అయితే, సినిమా రంగానికి ఏం కావాలంటే అది ఇస్తానని స్పీచ్‌లో రేవంత్ రెడ్డి అన్నారని దిల్‌రాజు గుర్తు చేశారు. అన్ని ఇస్తామన్నారని, ఇలాంటి ఘటనలు జరగకూడదని అన్నారని తెలిపారు. "అన్నీ ఇస్తానని రేవంత్ రెడ్డి చెప్పారు. నేను ఆ ఆశతో ఉన్నా. మళ్లీ అసెంబ్లీ స్పీచ్ చూడండి. అన్నీ ఇస్తాను అంటున్నారు. అడగలేదంటే.. ఆకలైనా అమ్మ కూడా అన్నం పెట్టదుగా" అని చెప్పారు. ఏపీలో టికెట్ ధరలు పెంచారని.. మీరు కూడా పెంచాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని అడుగుతానని, తుది నిర్ణయం ఆయనదే అని అన్నారు.ఇక సినిమాలకు టికెట్ ధరలు పెంచేదే లేదని తెలంగాణ ప్రభుత్వం ఇటీవల స్పష్టంగా చెప్పేసింది. ఇదేం ముఖ్యమైన విషయం కాదని, పెద్ద అంశాలపై చర్చించామని సీఎంను కలిసి సమయంలో దిల్‌రాజు చెప్పారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న ఆయన అలా అనడంతో.. ఇక టికెట్ ధరల పెంపు ఉండదేమో అని దాదాపు టాలీవుడ్ వర్గాలు ఫిక్స్ అయ్యాయి. అయితే, తాను మళ్లీ సీఎంను అడుగుతానని, గేమ్ ఛేంజర్ మూవీకి టికెట్ ధరల పెంపు ఉంటుందనే ఆశ ఉందని దిల్‌రాజు తాజాగా చెప్పారు.టికెట్ ధరల పెంపుపై దిల్‌రాజు నమ్మకంగా ఉండడంపై టాలీవుడ్ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఒకవేళ గేమ్ ఛేంజర్ మూవీకి టికెట్ ధరలను తెలంగాణ ప్రభుత్వం పెంచితే.. ఇతర సినిమాకు కూడా అవకాశం ఉంటుందని ఇతర నిర్మాతలు ఆలోచిస్తున్నారు. భవిష్యత్తులోనూ టికెట్ రేట్ల పెంపు ఉంటుందని అనుకుంటున్నారు. ఇది తెలుగు ఇండస్ట్రీకి ఊపిరి పీల్చుకున్నట్టుగా ఉంటుందని భావిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని దిల్‌రాజు ఎప్పుడు కలుస్తారో.. టికెట్ ధరల పెంపునకు గ్రీన్ సిగ్నల్ వస్తుందా లేదా అనే ఉత్కంఠ ప్రస్తుతం నెలకొని ఉంది. మరి ఈ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.సంక్రాంతికి విడుదల కానున్న గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాల టికెట్ ధరలు పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే జీవోలు కూడా జారీ చేసింది. గేమ్ ఛేంజర్ మూవీకి మిడ్‌నైట్ బెనిఫిట్ షోకు కూడా అనుమతి జారీ చేసింది. డాకు మహారాజ్‌కు జనవరి 12 తెల్లవారు జామున బెనిఫిట్ షోకు ఓకే చెప్పింది. తెలంగాణ ప్రభుత్వంతో దిల్‌రాజు నెక్స్ట్ మీటింగ్, ఫైనల్ నిర్ణయం కోసం టాలీవుడ్ అంతా నిరీక్షిస్తోంది.

# ఫ్రీ వద్దు... రేట్లు పెంచొద్దు

హైదరాబాద్, జనవరి 7,ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఇప్పుడు ఎన్నికల్లో పార్టీలను అధికారంలోకి తెస్తుంది. మొదట ఢిల్లీలో ఆమ్ ఆద్మీపార్టీ ప్రవేశపెట్టి అధికారంలోకి వచ్చింది. తర్వాత తమిళనాడులో డీఎంకే, ఆ తర్వాత కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్, ఈ ఏడాది ఏపీలో టీడీపీ కూటమి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాయి.ఎన్నికల్లో గెలవడానికి, అధికారంలోకి రావడానికి పార్టీలు, నాయకులు అనేక హామీలు ఇస్తుంటారు. ఇందులో ఇప్పుడు ప్రధాన హామీగా మారింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం. ఐదేళ్ల క్రితం ఢిల్లీలోని కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీపార్టీ ఈ హామీని తెరపైకి తెచ్చింది. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత.. మూడేళ్ల క్రితం తమిళనాడు ఎన్నికల్లోనూ ఇదే హామీతో డీఎంకే కూడా అధికారంలోకి వచ్చింది. దీంతో జాతీయ పార్టీ కాంగ్రెస్ కూడా ఈ హామీని అందుకుంది కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో మేనిఫెస్టోలో చేర్చింది. ఇక ఈ ఏడాది ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి కూడా ఇదే హామీతో అధికారంలోకి వచ్చింది. తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోంది. అయితే ఇప్పుడు కర్ణాటక మహిళలు ఈ ఫ్రీ బస్సు మాకొద్దని కోరుతున్నారు. ఫ్రీ బస్సు కారణంగా కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ నష్టాల్లో కూరుకుపోతోంది. దీంతో ఆర్టీసీ చార్జీలు 15 శాతం పెంచాలని సంస్థ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన సార్వత్రిక ఎన్నికలకు ముందు చేసినా.. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. నాలుగు రోజుల క్రితమే 15 శాతం చార్జీలు పెంచేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో బస్సు చార్జీలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు కన్నడ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మహిళల ఉచిత బస్సు ప్రభావంతోనే చార్జీలు పెరిగాయన్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది.ఫ్రీ బస్ పథకం కర్ణాటక ప్రభుత్వానికి భారంగా మారింది. దీంతో ఆర్టీసీ చార్జీలు పెంచాలని నిర్ణయించింది. నెలకు రూ.400 కోట్లు ఖర్చవుతుండడంతో ఆ భారం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఏడాదిన్నరపాటు భరించిన ప్రభుత్వం ఇప్పుడు చార్జీలు పెంచాలని నిర్ణయించింది. ఆ భారం పురుషులపై వేయడానికి సిద్ధమైంది. నాలుగు రోజుల క్రితం ప్రయాణ చార్జీలు 15 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రోజుకు రూ.8 కోట్ల ఆదాయం వస్తుందని ఆర్టీసీ అంచనా వేసింది. ఈమేరకు అమలు ప్రారంభించింది.చార్జీలు పెంచిన నేపథ్యంలో కర్ణాటక మహిళలు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. పురుషులు తమ కుటుంబ సభ్యులే అని పెంచిన చార్జీలతో తమ కుటుంబాలపై భారం పడుతుందని మహిళలు పేర్కొంటున్నారు. చార్జీలు పెంచవద్దని, అవసరమైతే తమ ఉచిత బస్సు ప్రయాణం కూడా రద్దు చేసుకోవాలని కోరుతున్నారు. ఇక ఫ్రీ బస్సు కారణంగా బస్సులు కూడా ఓవర్‌లోడ్ కారణంగా తరచూ మరమ్మతులకు వస్తున్నాయి. ఇది కూడా ప్రభుత్వానికి భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే చార్జీలు పెంచింది. అయితే చార్జీలు తగ్గించాలంటే.. మహిళల ఫ్రీబస్సు రద్దు చేయాలన్న డిమాండ్ కన్నడ ప్రజల నుంచి వస్తోంది.కర్ణాటకలో ఆర్టీసీ చార్జీల పెంపుపై ఆందోళన వ్యక్తమవుతోంది. నిరసనలకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్న ఆసక్తి నెలకొంది. ఉచిత బస్సు రద్దు చేస్తుందా.. లేక ఏవైనా సరవణలు చేస్తుందా.. చార్జీలు మినిమంగా వసూలు చేస్తుందా అన్న చర్చ జరుగుతోంది.

# తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. మెదక్లో 7.8 డిగ్రీలు, పటాన్చెరులో 11, రాజేంద్రనగర్లో 11, ఆదిలాబాద్లో 11.2, హకీంపేట్లో 14.3 డిగ్రీలు, నిజామాబాద్లో 15.2, దుండిగల్లో 15.3 డిగ్రీలు,హైదరాబాద్లో 15.9, హనుమకొండలో 16 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులది.

తహసిల్దార్ లు, ఆర్డీవోలు, ప్రత్యేక అధికారులులతో కలెక్టర్ సమీక్ష.
గ్రామాలలో రెవెన్యూ అధికారులు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగేట్లు చూడాలి.
అర్హులైన నిరుపేదలు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు .
ఫిర్యాదులు రాకుండా గ్రామ సభల్లో చర్చించి లబ్ధిదారుల ఎంపిక చేయాలి.
కొల్లూరు తెల్లాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో బస్తీ దావఖానా, అంగన్వాడి కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల ఏర్పాటు చేయాలి.
.... జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.




**సంగారెడ్డి, జనవరి 07 ప్రజ బలం ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వచ్చిన దరఖాస్తులను వ్యక్తిగత విచారణ జరిపి, గ్రామసభలలో చర్చించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో , జిల్లాలో ఎక్కడ కూడా ఇండ్లు ఉన్న లబ్ధిదారులు ఇచ్చారు, లేని వారికి ఇవ్వలేదు, అన్న ఫిర్యాదు రాకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు ఇందిర మహిళలకు లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే లో పెండింగ్ ఉన్న వాటిని, గ్రామాల్లో లేని వారిని గ్రామాలకు పిలిపించి వారి వివరాలు సేకరించి సర్వే పూర్తయి ఎలా అధికారులు చూడాలన్నారు. జిల్లాలోని కొల్లూరు ,తెల్లాపూర్ లలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అంగన్వాడి కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసేలా జిల్లా వైద్యాధికారి, జిల్లా విద్యాధికారి, డిడబ్ల్యువోలు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణాలు లబ్ధిదారులతో చర్చించి ఇందిరమ్మ ఇండ్ల కింద బదిలీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కొల్లూరు తెల్లాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో సొసైటీల ఏర్పాటు కోసం సహకార శాఖ అధికారులతో చర్యలు చేపట్టాలని అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ఇండ్లు లబ్ధిదారులకు అందజేసేలా అధికారులు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు . డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, హౌసింగ్ పీడీ చలపతి, మండల ప్రత్యేక అధికారులు, తాసిలా ్దరులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, కాంట్రాక్టులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లొ సంబురాలు




**ఖమ్మం ప్రతినిధి జనవరి 07 (ప్రజాబలం)** ఖమ్మం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26వ తేదీ నుంచి రాష్ట్రంలో అమలు చేయబోతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నందు జిల్లా పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి మంత్రుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు అనంతరం అక్కడకు విచ్చేసిన రైతు సోదరులతో కలిసి భాణా సంచా కాల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, ఖమ్మం నగర మేయర్ పునుకొళ్ళు నీరజ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్ కార్పొరేటర్ లు మలీదు వెంకటేశ్వర్లు,లకవత్ సైదులు, కామేపల్లీ సొసైటీ ఛైర్మన్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయలు వీరభద్రమ్ ఖమ్మం కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముక్క శేఖర్ గౌడ్ ఖమ్మం జిల్లా ఐ ఎన్ టి యు సి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి వై పాషా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొడ్డు బోందయ్య, పార్టీ ఆఫీస్ ఇన్చార్జి హుస్సేన్ బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు గజ్జి సూర్య నారాయణ,జనరల్ సెక్రటరీ బమ్మిడి శ్రీనివాస్,నగర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్, వైస్ చైర్మన్ సంపటం నరసింహారావు, సేవాదళ్ అధ్యక్షులు గౌస్, నగర మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు అల్లె సాయి కిరణ్ , బోజెడ్ల సత్య నారాయణ, షేక్ రజి,తుపాకుల మధు,కాంగ్రెస్ మహిళ నాయకురాలు చల్లా ప్రతిభా రెడ్డి జ్యోతి,భవాని తదితర కాంగ్రెస్ ,కార్యకర్తలు కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు

# గ్రీన్ స్కిల్లింగ్‌పై స్వనీతి ఇనిషియేటివ్ తో ఒప్పందం

గ్రీన్ ఎనర్జీ రంగంలో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం
మంత్రి లోకేష్ సమక్షంలో స్వనీతి, ఎపిఎస్ఎస్ డిసి ఎంఓయు



అమరావతి:రాష్ట్రంలో గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధి కోసం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ంఖూూఆఅ) కీలక ఒప్పందం చేసుకుంది. ఉండవల్లి నివాసంలో రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఈ మేరకు ఎంఓయు కుదిరింది. ప్రముఖ సామాజిక సంస్థ అయిన స్వనీతి ఇనిషియేటివ్ రాష్ట్రంలో పౌరసేవలను మెరుగుపర్చి, అట్టడుగువర్గాల అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పన చేస్తుంది. పరిశోధన, డేటా, పబ్లిక్ సర్వీస్ డెలివరీలో అనుభవం కలిగిన స్వనీతి ఇనియేటివ్ సంస్థ సమాజంలో వెనుకబాటుకు గురైన వారి జీవితాల్లో మార్పు కోసం కృషిచేస్తుంది. స్కిల్లింగ్‌కు సంబంధించి స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌కు పూర్తిస్థాయి మద్దతు ఇస్తుంది. కీలకమైన రంగాలు, పరిశ్రమలను గుర్తించి, స్థిరమైన జాబ్ మార్కెట్‌ను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమంలో స్వనీతి ఇనిషియేటివ్ ట్రస్టీ ఉమా భట్టాచార్య, స్టేట్ కన్సల్టెంట్ శివ ప్రసాద్, అసోసియేట్ తేజ సరియం, పాఠశాల విద్య, స్కిల్ డెవెలప్మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేష్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు.గ్రీన్ స్కిల్లింగ్ కోసం ఆర్థికేతర సాంకేతిక సహకారం, సేవలను అందించేందుకు స్వనీతి ఇనిషియేటివ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ంఖూూఆఅ) నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థ వచ్చే 4నెలల్లో పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి నైపుణ్యాభివృద్ధి వ్యూహం ముసాయిదాను రూపొందించి, వ్యూహం అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేస్తుంది. ఇందుకోసం రెన్యువబుల్ ఎనర్జీ సెక్టార్ కోసం స్కిల్ ల్యాండ్ స్కేప్ అసెస్ మెంట్ చేస్తుంది. కీలకమైన వాటాదారులతో (పరిశ్రమ, పరిశ్రమ సంఘాలు, క్లస్టర్ సంఘాలు, శిక్షణా సంస్థలు – ఎిఎలు, ఒఅ, నైపుణ్య విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలలు మొదలైనవి.) సంప్రదింపులు జరిపి నివేదిక రూపొందిస్తుంది.జర్మనీ, జూ బృందాలు, సెక్టార్ నిపుణులు, విజయవంతమైన కేసులపై అవగాహనకు సమావేశాలు నిర్వహిస్తుంది. గ్రీన్ ఎనర్జీ రంగ నిపుణుల ఆలోచనలను పంచుకునేందుకు కీలకమైన భాగస్వాములతో వర్క్‌షాప్ లు నిర్వహిస్తుంది. కీలక వాటాదారులతో భాగస్వామ్యంతో వ్యూహాన్ని ఖరారు చేస్తుంది. ంఖూూఆఅ సంస్థ తమ ప్రధాన కార్యాలయం నుండి పని చేసే స్వనిధి బృందానికి ప్రత్యేకంగా నైపుణ్య గణన, ఇన్ సైట్ ఇన్ఫర్మేషన్, గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధికి సంబంధించిన ఇతర సమాచారం అందిస్తుంది. టెక్నికల్ కన్సల్టెంట్లు ంఖూూఆఅ తాడేపల్లి కార్యాలయంలో పని చేయడానికి అవసరమైన స్థలాన్ని అందిస్తుంది.

# కూలీలతో వెళుతున్న వాహనం బోల్తా





వరంగల్ ఖానాపురం మండలం చిలకమ్మ నగర్ సమీపంలోని కొత్తగూడ సరిహద్దు ప్రాంతంలో గాదే వాగు మూలమలుపు వద్ద అదుపు తప్పిన తుఫాన్ వాహనం బోల్తా పడింది. ఘటన సమయంలో వాహనం తక్కువ వేగంతో వుండడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో వాహనంలో 25 మంది ప్రయాణికులు వున్నారు. వీరంతా మధ్యప్రదేశ్ నుండి ఖమ్మం జిల్లా జులురుపాడులో మిర్చి ఏరేందుకు వలస వస్తున్న కూలీలు..

# ఢిల్లీ లో ఏఐసీసీ కార్యాలయం వద్ద రైతు భరోసా పోస్టర్ల కలకలం




న్యూఢిల్లీ రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి వరంగల్ డిక్లరేషన్ పేరుమీద తెలంగాణ రైతులకు ఎకరానికి 15000 రూపాయలు చొప్పున ఇస్తామని ప్రకటించి, కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత 2024 సంవత్సరంలో రైతులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం, ఇటీవల సీఎం రేవంత్ యూటర్న్ తీసుకుంటూ ఎకరాకు 15000 ఇవ్వమని ప్రకటించడంపై ఏకంగా ఏఐసీసీ కాంగ్రెస్ కార్యాలయం వద్ద "కాంగ్రెస్ రైతు భరోసా యూటర్న్" పేరుతో పోస్టర్లు వెలిసాయి.

# పల్నాడు జిల్లాలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

పల్నాడు జిల్లాలో గూడ్స్ రైలు మంగళవారం పట్టాలు తప్పింది. దాచేపల్లి మండలం శ్రీనివాసపురం వద్ద ఘటన జరిగింది. విష్ణుపురం రాశి సిమెంట్ ఫ్యాక్టరీకి లోడింగ్ కోసం వెళుతుండగా ప్రమాదం జరిగింది. దాంతో గుంటూరు– హైదరాబాద్ మధ్య నడవాల్సిన రైళ్ళ ను విజయవాడ మీదుగా దారి మళ్లించారు. రైల్వే పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# శ్రీతేజ్ ను పరామర్శించిన అల్లు అర్జున్

హైదరాబాద్ టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ను పరామ ర్శిం చారు.బన్నీ లేటెస్ట్ మూవీ పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసాట లో రేవతి అనే మహిళ చనిపోయిం ది. ఆమె 8ఏళ్ల కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుప త్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందు తున్నాడు. గత 35రోజులుగా వైద్యులు బాలుడికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు లాయర్ల సలహా ప్రకారం బాధిత కుటుంబాన్ని పరామర్శించని హీరో అల్లు అర్జున్ ఇప్పుడు స్వయంగా కలిసి వారిని పరామర్శించారు.

# వీడని పాప అదృశ్యం కేసు

కరీంనగర్ వేములవాడ లో గత నెల 23న అదృశ్యమైన చిన్నారి ఆచూకీ ఇంకా లభించలేదు. ఐదుగురు సభ్యులు గల మహిళలు పాపను తీసుకెళ్ళిన విజువల్స్ సిసి కెమెరా లో రికార్డు అయింది. పోలీసులు సిసి కెమెరా ఫుటేజ్ ని విడుదల చేసారు. జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం చింతలపల్లి కి చెందిన మతిస్థిమితం సరిగా లేని తల్లి లాస్య నాలుగేళ్ల కూతురు అద్విత తో 23న వేములవాడ కు వచ్చింది. మతిస్థిమితం సరిగా లేకపోవడం పాప గురించి తల్లి చెప్పలేక పోయింది. పాప కుటుంబ సభ్యులు ఆలస్యంగా పోలీసులకు డిసెంబర్ 30న పిర్యాదు చేసారు. అప్పటి నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు. సిసి ఫుటేజీల ఆధారంగా అనుమానిత మహిళల చిత్రాలను పోలీసులు విడుదల చేసారు. మూడు పోలీసు బృందాలు పాపకోసం గాలిస్తున్నాయి.

# మియాపూర్ లో మేయర్ అకస్మిక తనిఖీలు

హైదరాబాద్ జనవరి 7 చందా నగర్ సర్కిల్ మియపూర్ డివిజన్ లో మంగళ వారం ఉదయం ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ తో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేసారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, పలు సమస్యలను మేయర్ దృష్టికి తెచ్చారు. మేమేరి గార్డెన్ వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తేవాలని అధికారులను మేయర్ ఆదేశించారు. మక్త చెరువు లేక్స్ లో వ్యర్థాలు ను తొలగించక పోవడం తో రాంకి సంస్థ నిర్వాహకుల పై సిరియస్ అయ్యారు. శానిటేషన్ పై అసంతృప్తి వ్యక్తం చేసారు. శానిటేషన్ మెరుగు పరచాలని జోనల్ కమిషనర్ కు ఆదేశించారు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి.

# గులాబీ డైవర్షన్ పాలిటిక్స్...

హైదరాబాద్, జనవరి 7, ప్రస్తుతం రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య డైవర్ట్ పాలిటిక్స్. మీడియా అడిగే ప్రశ్నలకు తప్పించుకునేందుకు ఎదుటివారిపై బురద జల్లడం కామన్‌గా మారింది. ప్రస్తుతం తెలంగాణలో అదే జరుగుతోంది. ఫార్ములా ఈ కారు రేస్ కేసు నమోదుతో కేటీఆర్ ఇమేజ్ అమాంతంగా పడిపోయిందన్నది నేతల మాట. విచారణకు హాజరై మరింత దారుణంగా ఉంటుందని గమనించారాయన. ఈ క్రమంలో ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఫార్ములా కేసులో తొలిసారి ఏసీబీ ముందు విచారణకు హారవుతున్నారు కేటీఆర్. ఆయన కచ్చితంగా విచారణకు హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. విచారణకు వెళ్లకుంటే దాన్ని షాకుగా చూపించి న్యాయస్థానంలో బెయిల్ రద్దు చేసే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ వ్యవహారాన్ని డైవర్ట్ చేసేందుకు పార్టీ నుంచి కొత్త పల్లవి ఎత్తుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టాలని ప్లాన్ చేసినట్టు పార్టీ వర్గాల నుంచి ఓ ఫీలర్ బయటకు వచ్చింది.ఇదిలావుండగా మీడియా ముందుకొచ్చిన కేటీఆర్.. మనసులో ఏ ముందో చెప్పాల్సిన నాలుగు ముక్కలు చెప్పేవారు. ఆ తర్వాత వివిధ ఛానెళ్లతో మాట్లాడారు. పార్టీలో జరుగుతున్న అంతర్గత కలహాలపై మీడియా ప్రశ్నకు నేరుగా సమాధానం ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేశారు. పనికిమాలిన వారు ఇలాంటి స్లోగన్స్ చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తామంతా పని చేస్తున్నామన్నారు. చివరి వరకు ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారని చెప్పకనే చెప్పేశారు. కేసీఆర్ మీ నాయకుడు అన్నప్పుడు.. అసెంబ్లీకి ఎప్పుడు వస్తున్నారు అనే ప్రశ్నకు సరిగా సమాధానం ఇవ్వలేదు.బీఆర్ఎస్ పార్టీలో ఏదో జరుగుతుందన్నది వాదన మరింత బలపడింది. ఈ మధ్యకాలం లో కేటీఆర్ మాటలు సరిగా లేవన్నది కొందరి మాట. ఒకప్పుడు హుందాగా ప్రవర్తించే వారని, ఇప్పుడదేమీ కనిపించలేదని అంటున్నారు. గతంలో పొరుగు రాష్ట్రం ఏపీలో వైసీపీ నేతలు ఇలాగే మాట్లాడేవారని, దాన్ని ఫాలో అవుతున్నారా? అంటూ సోషల్ మీడియాలో రకరకాల కామెంట్స్ పడిపోతున్నాయి.

## సఖి కేంద్రంలో నిర్వహించే సేవలు అభినందనీయమం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల సఖి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అభినందించారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో "తేజస్ ఫౌండేషన్ ట్రస్ట్" నిర్వహిస్తున్న సఖి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సఖి సెంటర్లో రిజిస్టర్లు ను తనిఖి చేస్తూ క్లిష్టమైన కేసులను గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే మహిళలు పని చేసే చోట కలిగే ఇబ్బందులు , మహిళలపై లైంగిక దాడి చట్టాలపై కూడా అవగాహన కార్యక్రమాలను చేపపట్టాలని సూచించారు .అలాగే జిల్లా కలెక్టరేట్ సముదాయంలో పని చేస్తున్న ఉద్యోగులకు కూడా అవగాహన కలిగే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచిస్తూ సఖి సిబ్బంది పని తీరును అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అదికారి జగిత్యాల జిల్లా డాక్టర్ నరేష్, తేజస్ ఫౌండేషన్ ట్రస్ట్ సీఈవో అటుకుల శ్రీనివాస్, సఖి కేంద్రం సిఏ కట్కూరి లావణ్య, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మీయ భరోసా సర్వే షురూ...

నిజామాబాద్, జనవరి 7, రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. తాజాగా ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకాన్ని ప్రకటించింది. దీన్ని అమలు చేయడానికి వేగంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పంట పొలాల్లో ఉపగ్రహ సర్వే చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం రైతులకు వీలైనంత ఎక్కువ సాయం చేసేందుకు అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో కీలక పథకాలు ప్రకటించి అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. తాజాగా.. యాసంగి సీజన్ పంటల సాగు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అందులో 500 ఎకరాల్లో సాగు చేసిన పంటలు నమోదు చేస్తారు.ఈ ప్రక్రియ అతి వేగంగా జరగలాని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీన్ని ఈ నెల 6న ప్రారంభించి.. 8వ తేదీలోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ నుంచి జిల్లాలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సర్వే చేస్తున్న సమయంలో ఏవైనా సమస్యలు వస్తే.. ఉన్నతాధికారులను సంప్రదించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు పొలాల బాటపట్టారు. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.ముఖ్యంగా ఇందిరమ్మ ఆత్మీయ రైతుభరోసా పథకం అమలులో భాగంగా.. ఈ సర్వే చేస్తున్నట్లు అధికారుల్లో చర్చ జరుగుతోంది. సాగయ్యే భూములకే పథకాన్ని వర్తింప చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది..శాటిలైట్ సర్వే ద్వారా.. ప్రత్యేకంగా మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో మాత్రమే రైతులకు సంబంధించిన వివరాలను నమోదు చేస్తారు..రైతు పేరు, సర్వే నెంబరు, ఏ పంటలు వేశారు.. ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగుచేశారు అనే వివరాలు సేకరిస్తారని అధికారులు చెబుతున్నారు.పంటలు సాగుచేయని భూమి సర్వే నెంబరు, దాని విస్తీర్ణం వంటి వివరాలను కూడా నమోదు చేయాలని.. వ్యవసాయ శాఖ సూచించింది.ఈ సర్వేకు సంబంధించిన యాప్ అందుబాటులోకి వచ్చిన వెంటనే పంటల వివరాలు నమోదు చేసేందుకు.. క్షేత్రస్థాయి ఉద్యోగులు సిద్ధం అవుతున్నారు.రాష్ట్ర వ్యవసాయశాఖ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకే సర్వే చేస్తామని.. డివిజన్, మండల స్థాయి అధికారులు చెబుతున్నారు.

గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద ఏడాదికి రూ.10 వేలు ఇస్తే.. ఈ ప్రభుత్వం రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ ప్రకటించారు.తెలంగాణలోని తండాలు, మారుమూల గ్రామాల్లో ఉన్న భూమి లేని వ్యవసాయ రైతు కుటుంబాలకు.. ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఈ పథకానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అని నామకరణం చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారుభూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సాయం చేయడం హర్షణీయమని.. రైతు కూలీలు అంటున్నారు. ఎలాంటి ఆంక్షల్లేకుండా పథకాన్ని వర్తింపజేయాలని కోరుతున్నారు.

# గులాబీ కమలంగా మారుతుందా...

హైదరాబాద్, జనవరి 7,పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ ఇప్పుడు పార్టీ సంస్థాగత మార్పులపై దృష్టి పెట్టింది. భవిష్యత్తు కార్యక్రమాలకు ప్రణాళికలను రూపొందించడంపై ఫోకస్ చేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మిషన్ 90 అంటూ.. తొంబై స్థానాలు సాధించడమే లక్ష్యంగా, బీసీ ముఖ్యమంత్రి నినాదంతో మందుకు వెళ్లిన కాషాయ పార్టీ కేవలం ఎనిమిది స్థానాలకే పరిమితం అయ్యింది. సేమ్ సీన్ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా రిపీట్ అయ్యింది.వికసిత్ భారత్ లక్ష్యంగా, ఫిర్ ఎక్ బర్ మోడీ నినాదంతో, తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాల్లో డబుల్ డిజిట్ స్థానాలు సాధించే దిశగా ఎన్నికల బరిలో దిగిన బీజేపీ ఎనిమిది స్థానాలకు పరిమితం అయ్యింది. అదటుంచుతే ప్రస్తుతం గత ఎన్నికల లక్ష్యాలను, గెలుపోటములపై సంస్థాగతంగా అంతర్మథనం చేసుకునే పనిలో పడింది ఆ పార్టీ.. అంతేకాదు భవిష్యత్తులో బలోపేతం అయ్యే మార్గాలను అన్వేషించడంపై కూడా ఫోకస్ పెడుతోందంట.రాష్ట్రంలో ఎన్నికలు గడిచి ఏడాది పూర్తయింది. ఇక వచ్చే నాలుగేండ్లలో ఎదురయ్యే సవాళ్లను ఎదురుకునేందుకు కమలదళం వ్యూహాలను రచిస్తోంది. గత ఎన్నికల్లో అనుకున్న లక్ష్యాలను సాధించనప్పటికి ఎనిమిది పార్లమెంట్ స్థానాలను సాధించడంతో ఆ పార్టీలో కొంత ఉత్సాహం కనిపిస్తుంది. అదే జోష్ రానున్న అసెంబ్లీ ఎన్నికల వరకు నడిపించగలిగితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీని నిలబెట్టోచ్చని, కచ్చితంగా రాష్ట్రంలో బలమైన పార్టీగా ఎదుగొచ్చనే అంచనాలలో కాషాయ దళాలున్నట్టు తెలుస్తోంది.అందులో భాగంగానే జాతీయ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సంస్థాగతంగా పార్టీని మార్పులు చేసే ప్రయత్నంలో పార్టీ వర్గాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే జాతీయ స్థాయి నుంచి, బూత్ స్థాయి వరకు సంస్థాగతంగా పార్టీ ఎన్నికలు జరుపుకుంటుంది. బలమైన నేతలకు పార్టీ పగ్గాలు అప్పజెప్పేందుకు అధిష్టానం ప్రయత్నం చేస్తోంది.దేశంలో, రాష్ట్రంలో బలమైన శక్తిగా నిలబడాలంటే బలమైన నేతను అధ్యక్ష పదవిపై ఉంచాలనే యోచనలో అధిష్టానం ఉందంట. అందులో భాగాంగనే తెలంగాణలో అధ్యక్ష్య పీఠాన్ని బలమైన సామజిక వర్గానికి చెందిన నేతకు ఇవ్వాలని అధిష్టానం చూస్తున్నప్పటికి, ఆ పదవికి మాత్రం డిమాండ్ చాలా ఉంది. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం అరడజను మంది నేతలకు పైగా పోటీ పడుతూ ఎవరికి వారే తమతమ ధీమాను వ్యక్తపరుస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఆ క్రమంలో అధిష్టానం అధ్యక్ష పీఠం ఎవరికి కట్టబెడుతోందనేది సస్పెన్స్ నెలకొంది. ఈ మాసం చివరి కల్ల అధ్యక్ష ఎంపిక ప్రక్రియ పూర్తి నూతన అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. అధ్యక్ష ఎన్నిక, నియామకం అనంతరం రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడానినికి ఇతర పార్టీల నుంచి భారీగా చేరికలను ప్రోత్సహించాలని కాషాయ నేతలు భావిస్తున్నారంట.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ని ఎదుర్కోవడానికి బీఆర్ఎస్ ను గ్రౌండ్ లేవల్లో ఖాళీ చేయడానికి కాషాయ నేతలు స్కెచ్ గీస్తున్నారంట. అందుకే ప్రధానంగా బీఆర్ఎస్ ను టార్గెట్ చేసుకుని భవిషత్తుకు మార్గాలు వేసుకోవాలనే యెచనలో కాషాయ నేతలున్నట్టుగా తెలుస్తోంది. అంతేకాదు వచ్చే స్థానిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని, మంచి మేజారిటీ స్థానాలు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. మొత్తం మీద గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనుకున్న లక్ష్యాలను అందుకోనప్పటికి? ఊహించని దానికంటే ఓటింగ్ పర్సెంటేజీని పెంచుకొని జోష్ మీదున్న కాషాయ నేతలు ఆ దిశగా ఎంతవరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# నిరసనల మధ్యే రైల్వే లైన్ పనులు

ఖమ్మం. జనవరి 7, మూడో రైల్వే లైన్‌కు సంబంధించి ఖమ్మం రైల్వేస్టేషన్‌తో పాటు ఖమ్మం రైల్వేమార్గంలోని పలు ప్రాంతాల్లో పనులు ఉధృతంగా కొనసాగుతున్నాయి. పనుల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఈ మార్గంలో నడిచే దాదాపు 50కి పైగా రైళ్లను సైతం ఈనెల 9 వరకు తాత్కాలికంగా నిలిపేసి, పనులు చేపడుతున్నారు. ఖమ్మంలె చేపట్టిన మూడో రైల్వే లైన్ పనుల్లో అంతరాయం లేకుండా రైల్వే ఉన్నతాధికారులతో పాటు ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు.రైల్వే లైన్ విస్తరణ కోసం కావాల్సిన భూమిని సేకరిస్తున్నారు. ఇందుకు సంబంధించి మురుగు కాల్వల నిర్మాణం కూడా చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న మురుగు కాల్వను కూడా మరింత వెడల్పు చేస్తున్నారు. నగరంలోని స్టేషన్ నుంచి మామిళ్లగూడెం, సారథినగర్, బైపాస్‌రోడ్డు ఏరియా, శ్రీనివాసనగర్ సమీప ప్రాంతాల్లో పనులు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.వాహనాలను వేరే మార్గంలో మళ్లిం చినప్పటికీ ఇబ్బంది తప్పడం లేదు. నగరంలోని 36, 37 డివిజన్ల పరిధిలో పనులు నిర్వహిస్తున్నారు. ట్రాక్ విస్తరణ పనులతో పాటు ఇంటర్ లాకింగ్, విద్యుద్దీకరణ, మురుగు కాల్వల నిర్మాణం తదితర పనులు నిర్వహిస్తున్నారు. ట్రాక్ విస్తరణ కోసం భూసేకరణ కార్యక్రమం కూడా జరుగుతోంది. మధిర, ఎర్రుపాలెం, మోటమర్రి తదితర స్టేషన్లలోనూ పను లు జరుగుతున్నాయి. అయితే ఎర్రుపాలెం ప్రాంతంలో పనులు ఇప్పటికే పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం, మధిరలో ఇంకా భూసేకరణ పూర్తి కాలేదు.భూసేకరణ పూర్తయితే మరింత వేగంగా పనులు జరగడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. ఖమ్మం, మధిర పట్టణంలో ఇళ్ల యజమానులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో కొంత వివాదం నెలకొంది. పలువురు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఇండ్లు కోల్పోయిన వారికి స్థలాలు, పరిహారం విషయంలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మూడో లైన్ కోసం దాదాపు 126 ఎకరాల వరకు అవసరం ఉందని అధికారులు తేల్చారు.విలువైన భూము లు కోల్పోతుండడంతో రైతులు పరిహారం విషయంలో ససేమిరా అంటున్నారు. చింతకాని, నాగులవంచ,అనంతసాగర్ తదితర ప్రాంతాల్లో విలువైన భూములను రైతులు కోల్పోతున్నారు. ఖమ్మం నగరంలో నర్తకి థియేటర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి కింది ప్రాంతం, సారథినగర్, బుర్హాన్‌పురం తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున ఇళ్లు తొలగించాల్సి ఉంది. మెరుగైన పరిహారం చెల్లించి, భూసేకరణ జరపాలని బాధితులు ఇప్పటికే ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ఉగాది నుంచి రేషన్ కార్డులకు సన్నబియ్యం

నల్గొండ, జనవరి 7, తెలంగాణలో మరో ఎన్నికల హామీ అమలు దిశగా రేవంత్‌రెడ్డి సర్కార్ అడుగులు వేస్తోంది. రేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ సన్నబియ?యం అందజేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పుడు అందజేస్తున్న దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం అందజేయనున్నారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై అదనంగా మరో 1500 కోట్ల భారం పడనుంది.తెలంగాణలోని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం అందనున్నాయి. పేదలకు రూపాయికే కిలో బియ్యం అందజేస్తున్నా...ప్రజలెవ్వరూ వాటిని తినడం లేదు. కొందరు కనీసం బియ్యం తీసుకోకుండా రేషన్ దుకాణాల్లోనే ఆ మేరకు డబ్బులు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వం అందజేస్తున్న బియ్యం ఏమాత్రం తినడానికి పనికిరావని ప్రజలు చెబుతున్నారు. దీంతో ఆ బియ్యం వివిధ మార్గాల ద్వారా కాకినాడ, చెన్నై పోర్టులకు చేరి అక్కడి నుంచి విదేశాలకు తరలిపోతోంది. దీంతో పేదలకు సన్నబియ్యమే సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ముందుగానే కసరత్తు ప్రారంభించిన సర్కార్....ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పెద్దఎత్తున సన్న వడ్లు పండించేలా ప్రోత్సహించింది. క్వింటాకు 500 రూపాయలు బోనస్ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు సైతం ఈసారి సన్న వడ్లు పండించారు.రాష్ట్రంలో మొత్తం 89.60 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ బియ్యం పంపిణీ చేయాలంటే నెలకు 2 లక్షల టన్నుల బియ్యం అవసరమవుతుంది. ఏటా 24 లక్షల టన్నుల సన్న బియ్యం కావాలని అధికారులు అంచనాలు రూపొందించారు. మొత్తం 2.81 కోట్ల మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం రేషన్ బియ్యంపై రాష్ట్రప్రభుత్వం 3వేల600 కోట్ల సబ్సిడీ భరిస్తుండగా... సన్నబియ్యంతో పంపిణీతో మరో 1,500 కోట్లు భారం పెరిగే అవకాశం ఉంది. కొత్త రేషన్ కార్డుల కోసం సుమారు 20 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది నుంచే పేదలందరికీ రేషన్‌కార్డులపై ఉచితంగానే సన్న బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే కొత్త రేషన్ కార్డుల కోసం 20 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా..వారిలో కనీసం 10 లక్షల మందికి కార్డులు ఇవ్వనున్నట్లు సమాచారం. దొడ్డు బియ?యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలు ఉపయోగంతోపాటు వరి ధాన్యం పండించే రైతులనూ ఆదుకోవచ్చని సర్కార్ భావిస్తోంది. అలాగే రేషన్ బియ్యం అక్రమాలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.బియ్యం బ్లాక్ మార్కెటింగ్‌కు కళ్లెం వేయవచ్చని అంచనా వేస్తోంది. సన్నబియ్యం సేకరణకు కిలోకు 55 రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఇందులో 36 రూపాయలు కేంద్రం భరిస్తుండగా...మిగిలిన నిధులు రాష్ట్ర ప్రభుత్వమే సర్దుబాటు చేయాల్సి ఉంది. సంక్రాంతి కానుకగానే పేదలకు సన్నబియ్యం పంపిణీకి సర్కార్ ఏర్పాట్లు చేయగా....రైతుల నుంచి సేకరించిన సన్న వడ్లు కనీసం రెండు నెలలైనా నిల్వ చేస్తేనే బాగుంటాయని...ఇప్పటికిప్పుడు కొత్త బియ్యం అందజేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉందని అధికారులు సీఎంకు సూచించారు. దీంతో ఉగాది నాటికి బియ్యం సిద్ధం చేసి పంపిణీ చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యోచిస్తోంది

# రిజర్వేషన్లు మారితే ఏంటీ...

మహబూబ్ నగర్, జనవరి 7, మరో 9 రోజుల్లో మున్సిపాలిటీ పాలక వర్గం పదవి కాలం ముగియనుండడంతో వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార, ప్రతి పక్ష పార్టీలు దృష్టి పెట్టాయి. గత ఏడాది క్రితం సర్పంచ్‌ల పదవి కాలం ముగియడం తో గ్రామాల్లో ప్రత్యేక పాలనను ప్రభుత్వం కొనసాగిస్తుంది. దీంతో పాటు మండలం వ్యవస్థ ఎంపిటిసి, జెడ్పిటిసి పదవి కాలం ముగిసినప్పటికీ ఎన్నికలను నిర్వహించ డంలో ప్రభుత్వం వెనుక అడుగు వేస్తుంది

దీంతో పాటు మరో 9 రోజుల్లో మున్సిపా లిటీ పాలకవర్గం పదవి కాలం ముగియ నున్న నేపథ్యంలో మున్సిపాలిటీలో సైతం ప్రత్యేక పాలన దిశగా ప్రభుత్వం అడుగులు వేయనుంది. ఈ నేపథ్యంలో ఒక పక్కన సం క్రాతి పండుగకు ఇందిరమ్మ రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సహాయం, నిరు పేదలకు నూతన రేషన్ కార్డు ల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను సైతం వేగవంతం చేస్తూ వాటిని ప్రజలోకి తీసు కుని వెళ్లి అనుకూలత పెంచుకోవాలన్న ల క్ష్యంతో గ్రామీణ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు ప్రణాళిక రచిస్తోంది.కానీ కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గు మనే స్థాయిలో వర్గ పోరు నడుస్తుంది. వనపర్తిలో స్థానిక ఎమ్మెల్యే మే ఘారెడ్డి రాకను శాసనసభ ఎన్నికల ముందు నుండి వ్యతిరేకించిన ప్రస్తుత రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి వర్గం, గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పార్టీ మార్పు వ్యవహారాని వ్యతిరేకి స్తున్న మాజీ జెడ్పి చైర్ పర్సన్ సరిత వర్గం ల మధ్య త్రీవ స్థాయిలో వర్గ పోరు నడు స్తుంది.దీంతో పాటు అలంపూర్ నియోజ కవర్గంలో ఎంఎల్‌సి చల్లా వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు రాకను ఏఐసిసి కార్య దర్శి సంపత్ కుమార్ సైతం వారి రాకను వ్యతిరేకించగా ప్రస్తుతం వారు బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్న పరిస్థితి. కానీ రెండు వర్గాలలో మాత్రం పార్టీలో పరో క్షంగా కలిసి నట్లుగానే చర్చ నడుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వర్గ పోరును నిలువరించేందుకు పార్టీ తీసుకునే నిర్ణయాల పైనే ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో చిన్న జిల్లాల ఏర్పాటు చేయడంతో మేజర్ గ్రామ పంచా యతీలను విలీన గ్రామాలను మున్సిపాలి టీలుగా మార్చగా ఒక పర్యాయం మున్సిపా లిటీ ఎన్నికలు సైతం జరిగాయి. రాష్ట్రంలో కులగణన కార్యక్రమం సైతం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించడం జరిగింది. దీంతో మున్సిపాలిటీ పరిధిలో ఆయా వార్డులో కు ల గణన ప్రకారంగా రిజర్వేషన్లు సైతం మారె అవకాశాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది రిజర్వేషన్లు మారితే ప్రస్తుత ఉన్న వార్డులు కాకుండా ఇతర వార్డుల నుండి ఫోటి చేయాలా ఒక వేళ ఫోటి చేసిన గెలుపు దక్కుతుందా లేక మహిళల రిజర్వేషన్ అయితే తమ కుటుం బంలోని మహిళలను ఫోటీలో నిలబెట్టాలా అనే సమాధానాలు లేని పలు ప్రశ్నలుగా నాయకుల ఊహాలో మెదులుతున్నాయి. జిల్లాలో తమ పార్టీలు బలంగా ఉండా లంటే మున్సిపాలిటీలు కీలక పాత్రను పోషి స్థాయి. స్థానిక సంస్థలో తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలకు, పాలన పట్ల ప్రజలు అందరు హస్తం వైపు ఉన్నారని కాంగ్రెస్ నాయకులు ధీమాను వ్యక్తం చేస్తు న్నప్పటికి సంవత్సర కాలం నుండి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని ప్రజలంతా తిరిగి బిఆర్ఎస్ వైపు చూస్తు న్నారని స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మున్సిపాలిటీ ఎన్నికల్లో తమ పార్టీ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్, బిఆర్ఎస్ అగ్ర నాయకులు ధీమాలను వ్యక్తం చేస్తున్నారు. అందుకు సంబందించి మున్సిపాలిటీ పాలక వర్గం ముంగిపు కాకముందే గ్రౌండ్ స్థాయి లో తమ తమ ఎత్తుగడలో బిజీగా ఉన్నారు గడిచిన 10 ఏండ్ల తరువాత తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చింది. దీంతో ప్రతిపక్ష పార్టీలు అయిన బి ఆర్ ఎస్, బిజెపి పార్టీల నుండి కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలోకి చేరడంతో పాటు వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో అప్పటికే ఉన్న బి ఆర్ఎస్ పార్టీలకు చెందిన చైర్మన్, వైస్ చైర్మ న్‌ల అవిశ్వాస తీర్మానం పెట్టి ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ పై జెండాను ఎగురవేసింది.

గతంలో జరిగిన మున్సిపా లిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ చేతిలో ఓడిపోయి నాయకులుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండగా ప్రభుత్వం మారిన వెంటనే చాలా మంది కౌన్సిలర్లు బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రె స్ లోకి చేరారు ఇప్పటి వరకు బాగానే ఉన్న అసలు సమస్య ప్రారంభం అయింది.

గతంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, ఎదుగు తున్న నాయ కులు, బిఆర్ఎస్ నుండి వచ్చిన కౌన్సిలర్లు నాయకులు పెరగడంతో తమకే టికెట్ వస్తుందని ఇప్పటికే ఆయా వార్డులో చెప్పు కుంటూ చావులు, అనారోగ్యాలు పాలు అయిన వారిని పరామర్శలు సైతం చేస్తు ఉన్నంతలో ఆర్థిక సహాయాలు చేస్తూ మరొ క వైపు యువత తమ వైపు ఉండేలా ఇప్పటి నుండే వారిని మచ్చిక చేసుకుంటున్నారు . దీంతో ప్రతిపక్ష పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య మరింత పెరుగుతోంది.

# వరంగల్ రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు

వరంగల్, జనవరి 7, వరంగల్ రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెట్టనున్నాయి. కాలుష్యంతో పాటు ఖర్చును తగ్గించేందుకు టీజీఎస్ ఆర్టీసీ ఈ ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తుంది. వరంగల్ రీజియన్‌కు మొత్తంగా 112 బస్సులను కేటాయించారు. అందులో ముందస్తుగా 75 వెహికిల్స్ వరంగల్‌కు చేరుకున్నాయి. వాటిని ప్రారంభించనున్నారు.వాస్తవానికి ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ మంత్రుల బిజీ షెడ్యూల్ కారణంగా ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. సోమవారం నిర్వహించే ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు హాజరవుతారా లేదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందిఆర్టీసీ వరంగల్ రీజియన్ కు కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను మొదటగా వరంగల్-2 డిపోకు కేటాయించారు. ఇక్కడ ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్లు, సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి అయ్యింది. ఇదిలాఉంటే టీజీఎస్‌ఆర్టీసీ వరంగల్ రీజియన్ కు 112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించగా.. వాటిలో 19 సూపర్ లగ్జరీ, 18 డీలక్స్, 75 ఎక్స్ ప్రెస్ సర్వీసులు ఉన్నాయి.వరంగల్ రీజియన్ కు కేటాయించిన వాటిలో ఇప్పటివరకు 75 బస్సులు హనుమకొండలోని వరంగల్ 2 డిపోకు చేరుకున్నాయి. వీటిలో 19 సూపర్ లగ్జరీ, 16 డీలక్స్, 40 ఎక్స్ ప్రెస్ బస్సులు ఉన్నాయి. జేబీఎం సంస్థ నిర్వహణలో ఎలక్ట్రిక్ బస్సులు నడవనుండగా.. ఆ సంస్థ డ్రైవర్ల రిక్రూట్మెంట్ బాధ్యతను శ్రీ బాలజీ కన్సల్టెన్సీకి అప్పగించింది. దీంతో డ్రైవర్ల ఎంపిక ప్రక్రియను కొనసాగుతోంది. మొత్తం 112 బస్సులకు 260 మంది డ్రైవర్లు అవసరం కాగా.. ఇప్పటి వరకు 136 మందిని ఎంపిక చేశారు. మిగతా వారిని కూడా తొందర్లోనే నియమించి, ఎలక్ట్రిక్ బస్సులు నడిపించేందుకు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.వరంగల్ రీజియన్ కు కేటాయించిన 112 బస్సులకు మొత్తం 21 ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటి పనులు వేగంగా కూడా నడుస్తున్నాయి. ఇప్పటికే ఆరు ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రాగా.. వాటికి అవసరమై విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్ స్టేషన్ నిర్మాణం కూడా పూర్తయ్యింది. ఇప్పుడున్న 6 పాయింట్ల ద్వారా 30 నుంచి 35 బస్సులు ఛార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఒక్క బస్సు ఛార్జింగ్ పూర్తి చేసుకోవడానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతుందని సిబ్బంది చెబుతున్నారు. ఒక పిన్ తో ఛార్జింగ్ చేస్తే 2 గంటలు, రెండు పిన్ లతో ఛార్జింగ్ చేస్తే గంట సమయం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. మిగతా 15 ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణం కూడా కొనసాగుతోందని ఆఫీసర్లు చెబుతున్నారు.వరంగల్ రీజియన్ కు ముందుగా 86 అలాట్ చేయగా.. ఇటీవల మరో 26 బస్సులు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో వరంగల్ రీజియన్ కు కేటాయించిన సంఖ్య 112కు చేరింది. వాస్తవానికి వరంగల్ రీజియన్ లో ఇటీవల కాలం చెల్లిన బస్సులను తొలగించడం, మహాలక్ష్మి పథకం ఎఫెక్ట్, రూరల్ గ్రామాలకు బస్సు సర్వీసుల పునరుద్ధరణ వల్ల బస్సుల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 112 ఈవీ బస్సులను కేటాయించడంతో కొంతమేర కొరత తీరే అవకాశం కనిపిస్తోంది.ముందుగా 75 బస్సులను ప్రారంభించేందుకు హనుమకొండలోని కుడా గ్రౌండ్ (హయగ్రీవాచారి గ్రౌండ్)ను సిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం వీటిని ప్రారంభించాల్సి ఉండగా.. మంత్రుల షెడ్యూల్ ఖాళీ లేని కారణంగా ఈ కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేశారు. మొదట డిసెంబర్ 18న మంత్రి పొన్నం చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేయగా.. ఆ కార్యక్రమం వివిధ కారణాల వల్ల రద్దయ్యింది.ఆ తరువాత డిసెంబర్ 26 న ప్రారంభించాలని చూసినా కలిసి రాలేదు. ఇప్పుడు జనవరి 5న కూడా ఓపెనింగ్ కు అనుకూలంగా పరిస్థితులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సోమవారానికి వాయిదా వేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తయిన తరువాత ఉమ్మడి వరంగల్ జిల్లా రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు తీయనున్నాయి.

## బెట్టింగ్‌లలో డబ్బులు పోవడంతో మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య

ఆదిలాబాద్ బెట్టింగ్‌కు యువకుడి బలైన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. జైనాథ్ మండలం పిప్పర్‌వాడ గ్రామానికి చెందిన అలిశెట్టి సాయి (23) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.అభ్యుదయ హాస్టల్ కిచెన్ సహాయకుడిగా పని చేసేవాడు. బెట్టింగ్‌లకు అలవాటు పడి.. డబ్బులు పోవడం వల్ల మనస్థాపం చెందాడు. అభ్యుదయ పాఠశాల ఆఫీస్ వంతెనల వద్ద ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.కాగా.. బెట్టింగ్ యువతకు వ్యసనంగా మారింది. చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ఇంట్లో కూర్చొనే ఆడుకుంటున్నారు. మనీ వాలెట్‌ను డౌన్లోడ్ చేసుకుని అందులోకి బ్యాంకు ఖాతా, ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేసుకుంటున్నారు. ఈ బెట్టిగ్ కాయ్ రాజా కాయ్.. అంటూ తన వలలో వేసుకుంటోంది. బెట్టింగ్ భూతం జనం ప్రాణాలు తీస్తూనే ఉంది. ఈ మాయదారి రక్కసిని ఖతం చేసేందుకు ప్రభుత్వాలు, అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.. చాపకింద నీరులా తన పని కానిస్తూనే ఉంది. ఈ బెట్టింగ్ మోజులో అమాయక యువకులు.. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఇంట్లో తెలియకుండా స్నేహితుల వద్ద అప్పులు చేసి పందేలు కాస్తున్నారు. తీరా ఓడిపోవడంతోనట్టేట మునుగుతున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ.. మనస్థాపానికి గురవుతున్నారు. ఆదాయం లేక, ఇంట్లో అడగలేక, మళ్లీ అప్పులుచేయలేక.. ఏం చేయాలో అర్థంకాకపోవడంతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

## తాపీ మేస్త్రి దారుణ హత్య

రామచంద్రపురం కె. గంగవరం మండలం కూళ్ళ గ్రామం లో సత్తి సువర్ణ రత్నం( 35) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది. తాపి మేస్త్రి గా పనిచేస్తున్నసత్తి సువర్ణ రత్నం(శివ )కు అదే గ్రామానికి చెందిన వివాహిత మహిళ తో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు సమాచారం. మరో తాపి మేస్త్రి మంచాల వెంకట సూర్య చంద్ర పథకం ప్రకారం సువర్ణ రత్నం ను మద్యం సేవించేందుకు కూళ్ళ- పామర్రు రోడ్డు వద్దకు తీసుకెళ్లారు. మద్యం సేవించిన అనంతరం ఇరువురు గొడవ పడి సువర్ణ రత్న పీక ను మంచాల వెంకట సూర్య చంద్ర బ్లేడ్ తో కోసాడు. తరువాత సూర్య చంద్ర సమీపంలో ని పంట పొలంలోఉన్న బురదలో సువర్ణ రత్నం ను ఉబలో తొక్కి పడేసి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పామర్రు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి తరలించారు.. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

## సినిమా





# సోనూ సూద్ ఇంత వయొలెంటా?



బాలీవుడ్ నటుడు సోనూ సూద్ ఎక్కువగా విలన్ వేషాలతోనే తెలుగు ప్రేక్షకులకు పరిచయం. కానీ కరోనా టైంలో తనలోని హ్యూమన్ యాంగిల్ చూసి అందరూ అతణ్ని 'హీరో' అన్నారు. లాక్ డౌన్ టైంలో కరోనా బాధితులకు అతను చేసిన సాయాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఒక్కడు లక్షల మందికి సాయపడడం చూసి అంతా ఆశ్చర్యపోయారు.తన మీద జనాల్లో వచ్చిన సాఫ్ట్ కార్నర్, హీరోయిక్ ఇమేజ్ వల్ల అతణ్ని ఆ తర్వాత విలన్ పాత్రల్లో చూడడానికి జనం అంతగా ఇష్టపడలేదు. నిజజీవితంలో సోనూ చేసిన మంచి పనుల వల్ల సినిమాల పరంగా అతడికి జరిగిన డ్యామేజ్ ఇది. ఈ నేపథ్యంలో అతను హీరోగా మారడం విశేషం. అంతే కాదు.. ఆ సినిమాకు తనే దర్శకుడు కూడా.సోనూ తొలిసారి డైరెక్ట్ చేస్తున్న ఆ చిత్రమే.. ఫతే. ఇంతకుముందే ఈ సినిమా నుంచి ఒక ట్రైలర్ లాంచ్ అయింది. ఇప్పుడు రెండో ట్రైలర్ వదిలారు. అది చూసి జనాలకు దిమ్మదిరిగిపోతోంది. సోనూ సూద్ ఇంత వయొలెంటా అనిపించేలా.. ఈ సినిమాలో మామూలు వయొలెన్స్ దట్టించలేదు. యానిమల్, కిల్, మార్కో లాంటి చిత్రాలతో ఇప్పటికే ఇండియన్ స్క్రీన్ రక్తసిక్తమైంది. ఈ చిత్రాలు వయొలెన్సుని వేరే లెవెల్‌కు తీసుకెళ్లాయి. ఈ కోవలోనే 'ఫతే'లోనూ హింసను హద్దులు దాటించేశారు. కత్తులతో, గన్నులతో సోనూ సూద్ వీర విధ్వంసమే సృష్టించాడు. చంపడంలో అత్యంత హింసాత్మకమైన పద్ధతులు చూపిస్తూ చెలరేగిపోయాడు. 'యానిమల్', 'కిల్' సినిమాలను మించి.. 'మార్కో'కు దీటుగా ఇందులో వయొలెన్స్ ఉన్నట్లే కనిపిస్తోంది. ఐతే దర్శకుడిగా సోనూ ముద్ర కూడా ట్రైలర్లో బలంగానే కనిపించింది. సటిల్‌గా, డిఫరెంట్‌గా స్టోరీ నరేట్ చేసినట్లున్నాడు. మాజీ పోలీసాఫీసర్‌గా తన పాత్ర కూడా ఇంట్రెస్టింగ్‌గా కనిపిస్తోంది. ఉద్యోగం వదిలేసి ప్రశాంతంగా బతుకుతున్న అతను.. సైబర్ క్రైమ్ సిండికేట్ చేతిలో పడ్డ ఓ అమ్మాయిని రక్షించడానికి చేసే పోరాటమే ఈ సినిమా. కొంచెం జేమ్స్ బాండ్ ఛాయలూ కనిపిస్తున్న ఈ చిత్రం.. జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## అప్పన్న, పార్వతీల ప్రేమ కట్టిపడేస్తుంది



గేమ్ చేంజర్ విషయంలో ఇన్నాళ్లుగా ఆడియన్స్‌లో ఉన్న అన్ని అనుమానాలకు చెక్ పెట్టేశారు దర్శకుడు శంకర్. హైదరాబాద్‌లో జరిగిన తొలి గేమ్ చేంజర్ ఈవెంట్‌లో ట్రైలర్ లాంచ్ చేసిన మేకర్స్, మెగా అభిమానుల్లో జోష్ నింపారు. ఇదే జోష్ సినిమా రిలీజ్ తరువాత కూడా కంటిన్యూ అవుతుందన్న కాన్ఫిడెన్స్‌తో ఉంది మూవీ టీమ్. అప్పన్న, పార్వతీల ప్రేమ మిమ్మల్ని కట్టిపడేస్తుంది.. అంజలి కామెంట్స్‌గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ మూవీ జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అవుతోంది.ఈ క్రమంలో చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా అంజలి మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన విశేషాలివే..అంజలి మాట్లాడుతూ.. ఏ యాక్టర్‌కి అయినా సరే సంక్రాంతికి సినిమా వస్తుందంటే ఆనందంగా ఉంటుంది. తెలుగులో గేమ్ చేంజర్, తమిళంలో విశాల్ చిత్రం రాబోతోంది. ఈ రెండు చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తుందని ఆశిస్తున్నాను. గేమ్ చేంజర్‌లో నా పాత్ర పేరు పార్వతి. మా అమ్మ పేరు కూడా పార్వతి. శంకర్ గారు కథ చెప్పినప్పుడు.. కారెక్టర్ పేరు చెప్పినప్పుడు మా అమ్మే గుర్తుకు వచ్చారు. ఆ విషయాన్ని ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చెబుదామని అప్పటి నుంచీ వెయిట్ చేస్తూనే వచ్చాను. ఈ కారెక్టర్ నా నుంచి చాలా డిమాండ్ చేసింది. నేను కూడా అదే స్థాయిలో నటించానని అనుకుంటున్నాను. శంకర్ గారు నా పర్ఫామెన్స్‌ను చూసి చాలా చోట్ల మెచ్చుకున్నారు. ఇది నా కెరీర్‌లో ది బెస్ట్ చిత్రం, కారెక్టర్ అవుతుంది. సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది. పార్వతి పాత్ర కోసం నేనేమీ ప్రత్యేకంగా ప్రిపేర్ అవ్వలేదు. నా పాత్రలో సస్పెన్స్, ట్విస్ట్ ఉంటుందని శంకర్ గారు ఆల్రెడీ చెప్పారు. కాబట్టి ఇంకా నేను ఆ కారెక్టర్ గురించి ఎక్కువగా చెప్పకూడదు. అది థియేటర్‌లో ఆడియెన్స్ చూసినప్పుడు చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. సెట్స్ నుంచి వచ్చినా కూడా ఈ పాత్ర చాలా రోజులు నన్ను వెంటాడుతూనే వచ్చింది. నా కెరీర్‌లో ఇదే బెస్ట్ కారెక్టర్. నేను కూడా కథ విన్నప్పుడు నాకు నేషనల్ అవార్డు వస్తుందని అనుకున్నాను.

# తండేల్ నిర్ణయం ముమ్మాటికీ రైటే



గత ఏడాది పలుమార్లు వాయిదాపడి ఈ సంవత్సరం ఫిబ్రవరి 7 విడుదల తేదీ లాక్ చేసుకున్న తండేల్ ఒకవేళ సంక్రాంతికి వచ్చి ఉంటే ఎలా ఉండేదన్న చర్చ అక్కినేని అభిమానుల్లో జరుగుతోంది. గేమ్ ఛేంజర్ ఉంది కాబట్టే మేనల్లుడి మీద పోటీకి వెళ్లడం ఇష్టం లేక అల్లు అరవింద్ తప్పుకున్నారనేది ఓపెన్ సీక్రెట్. అందులోనూ డాకు మహారాజ్, సంక్రాంతి వస్తున్నాం లాంటి క్రేజీ సినిమాలు బరిలో ఉన్నప్పుడు తండేల్ కు ఖచ్చితంగా థియేటర్ల సమస్య వస్తుంది. గీత ఆర్ట్స్ బలమైన డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ ఉన్న సంస్థే అయినప్పటికీ హీరో ఇమేజ్ కోణంలో చూసుకుంటే చైతు పై ముగ్గురి తర్వాతే నిలుస్తాడు. సో తండేల్ కు సోలో రిలీజ్ అవసరం. వచ్చే నెల ఎంపిక చేసుకున్న డేట్ కి పోటీ లేదు. అప్పటికంతా పండగ మూవీస్ పూర్తిగా చల్లారిపోయి ఉంటాయి. సో తగినన్ని స్క్రీన్లను సెట్ చేసుకోవచ్చు. ఇంతకు ముందు ప్రెస్ మీట్ లో అరవింద్ చెప్పింది కూడా ఇదే. ఒంటరిగా వస్తే కలిగే ప్రయోజనాన్ని వాడుకోవడానికి వాయిదా వేస్తున్నామని స్పష్టంగా వివరించారు. గతంలో నాని ఎంసిఏ, వైష్ణవ్ తేజ్ ఉప్పెన లాంటివి ఫిబ్రవరిలో వచ్చే బ్లాక్ బస్టర్స్ అయ్యాయి. సో ఏదో డ్రై సీజనని అనుకోవడానికి లేదు. ఒకవేళ ఇప్పుడు వచ్చి ఉంటే మాత్రం ఓపెనింగ్స్ తో పాటు ఫైనల్ రన్ ఎఫెక్ట్ అయ్యేది. ప్రస్తుతం తండేల్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. చేతిలో సరిగ్గా నెల రోజుల సమయం ఉంది. దాంట్లోనే సెన్సార్, ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్, వివిధ నగరాల్లో ప్రెస్ మీట్లు, ప్యాన్ ఇండియా పబ్లిసిటీ ఇవన్నీ చూసుకోవాలి. నాగ చైతన్య, సాయిపల్లవి దానికి అనుగుణంగానే జనవరి ఇరవై తర్వాత తమ కాల్ షీట్స్ ని ఖాళీగా ఉంచుకునేలా ముందే ప్లాన్ చేశారట. చందూ మొండేటి దర్శకత్వం వహించిన తండేల్ కు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం బాగా ప్లస్ అవుతోంది. బుజ్జి తల్లి, శివుడి జాతర సాంగ్ రెండూ ఛార్ట్ బస్టర్స్ అయ్యాయి. ఇక ట్రైలర్ ఎప్పుడు వస్తుందాని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.

## ఇరువురు భామలతో 'సంక్రాంతి' వినోదం





పండగ పేరునే టైటిల్ గా పెట్టుకుని బరిలో దిగుతున్న సంక్రాంతికి వస్తున్నాం మీద ముందు ఏమో కానీ పాటలు, ప్రమోషన్లు చూశాక ఒక్కసారిగా ఫ్యామిలీ ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగిపోయాయి. ముఖ్యంగా భీమ్స్ ఇచ్చిన మూడు పాటలు ఛార్ట్ బస్టర్స్ అయిపోయి అన్ని కలిపి 100 మిలియన్ల వ్యూస్ సాధించడం చూసి వెంకీ ఫ్యాన్స్ గర్వంగా ఫీలయ్యారు. పబ్లిసిటీని కొత్త పుంతలు తొక్కించిన దర్శకుడు అనిల్ రావిపూడి ఈ విషయంలో వంద శాతం సక్సెసయ్యాడు. దాంతో అందరి కళ్ళు ట్రైలర్ మీద పడ్డాయి. ఇవాళ జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ సందర్భంగా ఎక్స్ లో మహేష్ బాబు ద్వారా ఈ లాంఛనం పూర్తి చేశారు. ఆశించినట్టే మరోసారి అనిల్ రావిపూడి ఏదో సర్ప్రైజ్ ప్యాకేజ్ ప్లాన్ చేశారు. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించే ఒక వ్యక్తి కిడ్నాప్ జరుగుతుంది. అతన్ని పట్టుకోవడానికి ఎక్కడో పెళ్లి చేసుకుని దూరంగా ఉన్న పోలీస్ ఆఫీసర్ (వెంకటేష్) ని తీసుకొచ్చేందుకు మరో లేడీ పోలీస్ (మీనాక్షి చౌదరి) వెళ్తుంది.అయితే వీళ్లిద్దరి లవ్ స్టోరీ తెలిసిన భార్య (ఐశ్వర్య రాజేష్) ఈ ఆపరేషన్ లో తాను కూడా ఉంటానని పట్టు బడుతుంది. అక్కడి నుంచి అసలు కథ షురూ. పెళ్ళానికి చెప్పలేక, మాజీ ప్రియురాలిని మెప్పించలేక ఖాకీ చొక్కాలో నలిగిపోయే హీరో గారి తిప్పలు అన్ని ఇన్ని కావు. అవేంటో తెరమీద చూడాలి.చిన్న యాక్షన్ టచ్ ఉన్న పాయింట్ తీసుకుని ఆద్యంతం వినోదాత్మకంగా చూపించాడు అనిల్ రావిపూడి. డైలాగుల్లో తనదైన మార్కు వినిపించింది. బ్రహ్మచారులకు ఇచ్చే సలహాలు, ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ తో వచ్చిన ప్రతిసారి విక్టరీ సాధించాడని వెంకటేష్ గురించి చెప్పించడాలు బాగా పేలాయి. ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ఇద్దరికీ నటనకు ఛాన్స్ దొరికింది. భీమ్స్ బ్యాక్ గ్రౌండ్ సింపుల్ అండ్ స్మూత్ గా సాగగా మాస్ కి కావాల్సిన ఫైట్ల సరంజామా కూడా జోడించారు. వెంకటేష్ సినిమా నుంచి కోరుకునే అంశాలన్నీ పొందుపరిచినట్టు చూపించేశారు. మూవీ మొత్తం ఇలాగే ఉంటే బ్లాక్ బస్టర్ పక్కా.

## శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అర్జున్

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడ్డ బాలుడు శ్రీ తేజ్ ను టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ పరామర్శించారు. టీఎఫ్ డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో కలిసి ఆయన ఈ రోజు ఉదయం కిమ్స్ ఆస్పత్రికి వచ్చి శ్రీ తేజ్‌తో పాటు రేవతి భర్త భాస్కర్ ను పరామర్శించారు. శ్రీ తేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి భాస్కర్ ను అల్లు అర్జున్ అడిగి తెలుసుకున్నారు. రేవతి కుటుంబానికి, శ్రీ తేజ్ కు అన్ని విధాలుగా అండగా ఉంటానని అల్లు అర్జున్ భరోసానిచ్చారు. ఆ తర్వాత అల్లు అర్జున్ మీడియాతో మాట్లాడకుండానే ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ రాక సందర్భంగా ఆస్పత్రి దగ్గర పోలీసులు భారీ సంఖ్యలో భద్రతా ఏర్పాట్లు చేశారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనను దృష్టిలో ఉంచుకొని కిమ్స్ చుట్టు పక్కల భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. కోర్టు అల్లు అర్జున్ కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన క్రమంలో ఆయన ఈ రోజు ఆస్పత్రికి వచ్చి శ్రీ తేజ్ ను పరామర్శించారు. అల్లు అర్జున్..శ్రీ తేజ్ ను పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్లాలనుకుంటే ముందుగా సమాచారం ఇవ్వాలని, అప్పుడే తగినంత భద్రత కల్పిస్తామని పోలీసులు అల్లు అర్జున్ కు నోటీసులిచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చిన తర్వాత అల్లు అర్జున్ ఆస్పత్రికి వచ్చినట్లు తెలుస్తోంది.

# ఆస్కార్ నామినేషన్ల అర్హతకు కంగువ



కోలీవుడ్ హీరో సూర్య కొండంత ఆశలతో రెండేళ్లకు పైగా విలువైన సమయాన్ని కేటాయించి చేసిన ప్యాన్ ఇండియా మూవీ కంగువ ఎంత పెద్ద డిజాస్టరో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రెండు వేల కోట్లు వసూలు చేస్తుందని నిర్మాత జ్ఞానవేల్ రాజా చెప్పిన మాటలకు పొంతన లేకుండా కనీసం అందులో పదో వంతు కూడా వసూలు చేయలేక చేతులు ఎత్తేసింది. కార్తీ క్యామియో, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం, దిశా పటాని గ్లామర్, సూర్య డ్యూయల్ రోల్ ఇవేవి కాపాడకపోయాయి. ఫ్యాన్స్ వీలైనంత త్వరగా దీన్ని మర్చిపోవాలని భావించారు. ఊహించని తాజా షాక్ ఏంటంటే ఆస్కార్ బెస్ట్ పిక్చర్ నామినేషన్ల ఎలిజిబుల్ లిస్ట్ లో కంగువకు చోటు దక్కడం. నామినేషన్లకు అర్హత ఉన్నంత మాత్రాన అవార్డు వచ్చినట్టు కాదు కానీ ఆ మాత్రం సాధించడం చిన్న విషయం కాదు. ఎందుకంటే ప్రేక్షకుల మెప్పు పొందలేక కమర్షియల్ ఫెయిల్యూర్ అయిన సినిమా ఇక్కడి దాకా వెళ్లడమే గొప్ప. కథా కథనాలు పక్కనపెడితే అందులో చూపించిన దశాబ్దాల వెనుకటి అటవీ ప్రపంచం, వివిధ తెగలకు సంబందించిన నేపథ్యాలు, విజువల్ ఎఫెక్ట్స్ బహుశా ఆ లిస్టులో చోటు దక్కించుకునేందుకు అవకాశం కలిగించి ఉండొచ్చు. అయినా చాలా హాలీవుడ్ సినిమాలు మనకు నచ్చనివి, కనెక్ట్ కానివి ఆస్కార్ సాధించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ కోణంలో చూస్తే ఓకే అనుకోవచ్చు. కంగువ గాయం నుంచి బయటపడిన సూర్య ప్రస్తుతం రెట్రో చేస్తున్న సంగతి తెలిసిందే. పూజా హెగ్డే హీరోయిన్ గా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ గ్యాంగ్ స్టర్ కం లవ్ డ్రామా మీద మంచి అంచనాలు నెలకొన్నాయి. ఏప్రిల్ 10 విడుదల చేయాలనే ఆలోచన జరుగుతోంది కానీ ఇంకా ఫైనల్ చేయలేదు. ఆర్జె బాలాజీ డైరెక్షన్లో ఫాంటసీ మూవీ చేస్తున్న సూర్య ఆ తర్వాత వెట్రిమారన్ వడివాసల్ లో జాయినవుతాడు. అన్నట్టు కంగువతో పాటు నామినేషన్ ఎలిజిబిలిటీ లిస్టులో ఇండియా నుంచి పృథ్వీరాజ్ సుకుమారన్ గోట్ లైఫ్, సుచి తలాటి రూపొందించిన గర్ల్స్ విల్ బీ గర్ల్స్ ఉన్నాయి.



# క్రీడలు



## టీమ్ఇండియా షెడ్యూల్ ఇదే



బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సిరీస్‌ను భారత్ 1-3తో చేజార్చుకోవడంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలు గల్లంతయ్యాయి. 2023-25 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించగా.. ఆస్ట్రేలియా తుది పోరుకు అర్హత సాధించింది. జూన్ 11 నుంచి ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ మైదానంలో దక్షిణాఫ్రికా, ఆసీస్ మధ్య ఫైనల్ జరగనుంది. ఈ ఏడాది జూన్‌లోనే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ 2025-27 ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో వచ్చే డబ్ల్యూటీసీలో టీమ్ఇండియా మ్యాచ్‌ల షెడ్యూల్ వివరాలు బయటికి వచ్చాయి. ఇందులో భారత్ మొత్తం 18 టెస్టులు ఆడనుంది. స్వదేశంలో 9, విదేశీ గడ్డపై 9 టెస్టుల్లో తలపడనుంది. ఇంగ్లాండ్‌తో 5, వెస్టిండీస్‌తో 2, సౌతాఫ్రికాతో 2, శ్రీలంకతో 2, న్యూజిలాండ్‌తో 2, ఆస్ట్రేలియాతో 5 టెస్టులు ఆడనుంది. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనతో టీమ్ఇండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ మొదలవుతుంది. 2027 జనవరి-ఫిబ్రవరిలో స్వదేశంలో జరిగే బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌తో భారత జట్టు మ్యాచ్‌లు ముగుస్తాయి.

## ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ ఆడనివ్వని రోహిత్

2024లో భారత క్రికెట్ జట్టు ప్రదర్శన చెత్తగా మారింది. టీ20ల్లో మాత్రమే రాణించింది. వన్డేలు, టెస్ట్‌ల్లో మాత్రం పరిస్థితి దిగజారిపోయింది. అయితే, టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో ఓ ఆటగాడు స్క్వాడ్‌లో ఉన్నా.. ప్లేయింగ్ 11లో మాత్రం చోటు దక్కించుకోలేకపోయాడు. షాకింగ్ విషయం ఏంటంటే, అతనే టీ20ఐల్లో భారత్ తరపున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 2024లో టెస్ట్ ఫార్మాట్‌లో భారత క్రికెట్ జట్టు దిగజారిపోయింది. అయితే, టీ20 ప్రపంచకప్ గెలిచి ఎన్నో ఏళ్ల కలను నెరవేర్చుకుంది. ఈ క్రమంలో సంజు శాంసన్ టీ20 ఫార్మాట్‌లో పరుగుల వర్షం కురిపించాడు. కాగా, భారత్ ప్రపంచకప్ గెలిచిన ఏడాదిలోనే సంజూ ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం గమనార్హం. సంజూ 13 మ్యాచ్‌ల్లో 43.60 సగటుతో 436 పరుగులు చేశాడు. 2024లో టెస్ట్ ఫార్మాట్‌లో భారత క్రికెట్ జట్టు దిగజారిపోయింది. అయితే, టీ20 ప్రపంచకప్ గెలిచి ఎన్నో ఏళ్ల కలను నెరవేర్చుకుంది. ఈ క్రమంలో సంజు శాంసన్ టీ20 ఫార్మాట్‌లో పరుగుల వర్షం కురిపించాడు. కాగా, భారత్ ప్రపంచకప్ గెలిచిన ఏడాదిలోనే సంజూ ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం గమనార్హం. సంజూ 13 మ్యాచ్‌ల్లో 43.60 సగటుతో 436 పరుగులు చేశాడు.

గతేడాది ట్వంటీ20 ఇంటర్నేషనల్స్‌లో సంజూ మొత్తం మూడు సెంచరీలు చేశాడు. అత్యధిక స్కోరు 111 పరుగులుగా నిలిచింది. కేవలం 12 ఇన్నింగ్స్‌లలో 436 పరుగులను 180.16 స్ట్రైక్ రేట్‌తో బాదేశాడు. మూడు సెంచరీలతో పాటు 2024లో సంజూ హాఫ్ సెంచరీ కూడా చేశాడు. సంజూ మొత్తం 35 ఫోర్లు, 31 సిక్సర్లు బాదాడు. ఇదిలా ఉంటే, 2024లో, ఒక క్యాలెండర్ ఇయర్‌లో భారత ఆటగాళ్లలో అత్యధిక డకౌట్‌లు సాధించిన ఆటగాడిగా కూడా సంజు రికార్డు సృష్టించాడు.

## తొలిరౌండ్‌లోనే ఓడిన నాగల్




అక్లాండ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత సంచలన ఆటగాడు సుమిత్ నాగల్ అనూహ్యంగా తొలిరౌండ్‌లోనే నిష్క్రమించాడు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సుమిత్ 7-6(10-8), 4-6, 2-6తో యువ ఆటగాడు అలెక్స్ మిఛెల్సన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఈ ఓటమితో నాగల్ ఈ ఏడాదిని విజయంతో ప్రారంభించాలన్న కలలు నిరాశలయ్యాయి. తొలి సెట్‌ను నాగల్ చేజిక్కించుకొనే క్రమంలో ప్రత్యర్థి విసిరిన నాలుగు సెట్ పాయింట్లను బ్రేక్ చేసి మరి ఆ సెట్‌ను చేజిక్కించుకున్నాడు. రెండోసెట్‌ను పోరాడి ఓడిన నాగల్.. కీలక మూడోసెట్‌లో తొలుత 2-3తో వెనుకబడి ఆ తర్వాత వరుసగా పాయింట్లను కోల్పోయి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నాగల్ 96వ ర్యాంక్ ఆటగాడు కాగా.. అలెక్స్ 41వ ర్యాంక్ ప్లేయర్. ఆదివారం జరిగిన అర్హత పోటీలో నాగల్.. ఫ్రాన్స్‌కు చెందిన మన్నారినోను ఓడించి మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి నాగల్ నేరుగా అర్హత సాధించిన సంగతి తెలిసిందే.

## ఉద్యోగం కోసం తంటాలు పడుతోన్న దిగ్గజం



ఆస్ట్రేలియా వెటరన్ ఆటగాడు ప్రస్తుతం ఉద్యోగం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడు. 55 అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవం కలిగిన ఈ ఆటగాడు.. 1300 కంటే ఎక్కువ పరుగులు చేయడంతో పాటు 12 వికెట్లు పడగొట్టాడు. కొన్ని ఆరోపణలతో తన కోచింగ్ ఉద్యోగం కోల్పోయాడు. దీంతో ప్రస్తుతం లింక్‌డ్ ఇన్‌లో రెజ్యూం పోస్ట్ చేశాడు. ఆస్ట్రేలియా తరపున 55 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఈ ఆటగాడు నేడు ఉద్యోగం కోసం పోరాడుతున్నాడు. ఇంతకంటే అవమానకరం ఏముంటుందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇంతకీ ఆయనెవరు, ఉద్యోగం కోసం ఎందుకు తిప్పలు పడుతున్నాడో తెలుసుకుందాం. ఆస్ట్రేలియా టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ స్టువర్ట్ లా యూఎస్ఏ క్రికెట్ జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేస్తున్నాడు. అయితే, వివక్షత ఆరోపణలతో తన ఉద్యోగాన్ని కోల్పోవలసి వచ్చింది. కానీ, ప్రస్తుతం అతను లింక్‌డిన్‌లో కోచ్‌గా ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆస్ట్రేలియన్ మాజీ క్రికెటర్‌కు యూఎస్ఏ కంటే ముందు శ్రీలంక, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ పురుషుల క్రికెట్ జట్లకు కోచ్‌గా పనిచేసిన అనుభవం కూడా ఉంది. వెస్టిండీస్‌తో పాటు 2024 టీ20 ప్రపంచకప్‌కు యూఎస్ఏ ఆతిథ్యం ఇచ్చింది. ఈ ప్రపంచకప్ సమయంలో స్టువర్ట్ లా యూఎస్ఏ జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరించాడు. అతని కోచింగ్‌లో జట్టు కూడా మంచి ప్రదర్శన చేసింది. అయితే, ఆ సమయంలో ఆటగాళ్లతో సఖ్యత లోపించింది. ఇది నెదర్లాండ్స్ పర్యటనలో మరింత పెరిగాయి. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, యూఎస్ఏ జట్టులోని చాలా మంది ఆటగాళ్ళు స్టువర్ట్ లాకు వ్యతిరేకంగా బోర్డుకు ఒక లేఖ రాశారు. అందులో ఆటగాళ్ల పట్ల అతని దృక్కోణం వేరేలా ఉందని, ఇది జట్టు వాతావరణానికి ఇబ్బందులు కలిగిస్తోందని తెలిపారు. ఆటగాళ్ల మధ్య విభేదాలు సృష్టించేందుకు స్టువర్ట్ లా పనిచేస్తున్నాడని ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో అతనిపై వేటు పడింది.

## ట్రావిస్ హెడ్ షాకింగ్ కామెంట్స్



బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గెలిచిన ఆస్ట్రేలియా జట్టు.. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే, త్వరలో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఈ క్రమంలో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో హీరోగా నిలిచిన ట్రావిస్ హెడ్.. ఓ కీలక ప్రకటన చేశాడు. బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా 1-3 తేడాతో కైవసం చేసుకుంది. తొలి టెస్టులో గెలిచిన టీమిండియా ఒక్క మ్యాచ్ మినహా అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ సమయంలో టీమ్ ఇండియాకు తలనొప్పి తెచ్చిపెట్టిన బ్యాట్స్‌మెన్ మరెవరో కాదు.. ట్రావిస్ హెడ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటి వరకు టీమిండియా బౌలర్లపై విరుచుకుపడిన ఏకైక ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ ట్రావిస్ హెడ్. ఈ బ్యాట్స్‌మన్ అప్పుడు 2023 వన్డే ప్రపంచకప్ నుంచి ఇప్పుడు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత బౌలర్లను దారుణంగా భయపెట్టాడు. 31 ఏళ్ల హెడ్ మొత్తం సిరీస్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేసి 448 పరుగులు చేశాడు. ఈ క్రమంలో అతని బ్యాట్ నుంచి రెండు సెంచరీలు వచ్చాయి. న్యూజిలాండ్‌పై హెడ్ పెద్దగా విజయాన్ని కనబరచలేకపోయాడు. కానీ, టీమ్ ఇండియా బౌలర్లు అతనిని అడ్డుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారు. దీంతో హెడ్ ఫామ్ తిరిగి తెచ్చుకున్నాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ ఏడాది జూన్‌లో సౌతాఫ్రికాతో తలపడేందుకు ఆస్ట్రేలియా సిద్ధమైంది. ఈ క్రమంలో ట్రావిస్ హెడ్ ఓ కీలక విషయం వెల్లడించాడు. భారత్‌తో 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ తర్వాత ట్రావిస్ హెడ్ ఓ కీలక విషయం తెలిపాడు. క్రికెట్‌పై దృష్టి పెట్టేందుకే మద్యపానానికి స్వస్తి చెప్పానని హెడ్ తెలిపాడు. సిరీస్ తర్వాత ఫాక్స్ స్పోర్ట్స్‌తో జరిగిన సంభాషణలో హెడ్ మాట్లాడుతూ, 'రాబోయే కొద్ది రోజుల్లో నేను ఏమి చేస్తానో నాకు తెలియదు. మాకు 12 రోజుల సమయం ఉంది. శ్రీలంకకు బయలుదేరే ముందు, నేను ఖచ్చితంగా కొద్దిగా డ్రింగ్ చేస్తాను' అంటూ చెప్పుకొచ్చాడు. భారత జట్టుతో సిరీస్ నాకు చాలా కష్టంగా ఉంది. ఇలాంటి మ్యాచ్ తర్వాత, నేను ఖచ్చితంగా ఏదైనా చల్లగా ప్రయత్నిస్తాను. గత కొన్ని రోజులుగా తాగడం లేదు' అంటూ ప్రకటించాడు. ఆస్ట్రేలియా ఇప్పుడు శ్రీలంకతో ఆడాల్సి ఉంది. ఇరు జట్ల మధ్య రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఉంది. ఆస్ట్రేలియా 2-0తో ఓడినా డబ్ల్యూటీసీపై ఎలాంటి ప్రభావం ఉండదు. బోర్డర్-గవాస్కర్ సిరీస్ గురించి మాట్లాడితే, మొదటి టెస్టులో భారత్ 295 పరుగుల తేడాతో విజయం సాధించగా, రెండో టెస్టులో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య జరిగిన మూడో టెస్టు డ్రా కాగా, నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా 184 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో పాటు 5వ టెస్టును ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో కైవసం చేసుకుంది.

## మంధానకు పగ్గాలు



ఐర్లాండ్‌తో జరిగే మూడు వన్డే సిరీస్‌కు టీమిండియా మహిళల జట్టును భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్‌కు విశ్రాంతి ఇచ్చిన బిసిసిఐ.. స్మృతి మంధానకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. జనవరి 10నుంచి రాజ్‌కోట్ వేదికగా ఐర్లాండ్‌తో వన్డే సిరీస్ జరగనుంది. బిసిసిఐ సోమవారం ప్రకటించిన 15మందితో కూడిన జట్టు వైస్ కెప్టెన్‌గా దీప్తి శర్మ, వికెట్ కీపర్లుగా రీచా ఘోష్, ఉమా ఛెత్రి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. హర్మన్‌ప్రీత్ గాయం కారణంగా వెస్టిండ్‌తో జరిగిన తొలి రెండు టి20ల్లో ఆడలేకపోయింది. మూడు టి20లోకి అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లోనూ ఆడింది. గతేడాది అక్టోబర్‌లో దుబాయి వేదికగా జరిగిన మహిళల టి20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడింది. ఇక వెస్టిండిస్‌తో జరిగిన మూడు మ్యాచుల్లో పది వికెట్లు పడగొట్టిన ఫాస్ట్ బౌలర్ రేణుక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచింది. రేణుక వెన్నుముకపై ఒత్తిడి, పగులుతో ఇబ్బందిపడుతుంది. ఈ క్రమంలో ఐర్లాండ్ సిరీస్ ఇద్దరు ప్లేయర్లకు బిసిసిఐ విశ్రాంతి ఇచ్చింది. దీంతో సయాలీ సత్‌ఘరే, సైమా ఠాకూర్ పేస్ బౌలింగ్ బాధ్యతలను మోయనున్నారు. ఇక మూడు వన్డేలు ఐర్లాండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరుగుతాయి. అన్ని మ్యాచులు ఉదయం 11 గంటలకు మొదలవుతాయి. తొలి వన్డే 10న, రెండో వన్డే 12న, మూడో వన్డే 15న జరుగుతుంది.

## ఇండస్ట్రీయల్ హబ్ తో దశ మారనున్న వేంపల్లి,ముల్కల్ల గ్రామాలు

### ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు







**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 07 :** మంచిర్యాల నియోజకవర్గంలోని వేంపల్లి,ముల్కల్ల గ్రామాల్లో ఇండస్ట్రీ యల్ హబ్ మారడం వల్ల పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంగళవారం పద్మనాయక ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన భూదాతలతో సమావేశమయ్యారు. భూములను ఇండస్ట్రీయల్ హబ్ కోసం స్వచ్ఛందంగా ఇస్తున్నట్లు భూ యజమానులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వారికి కృతజ్ఞతలు తెలిపారు. భూములను ఇచ్చిన వారికి పరిహారం నెలలోపు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.ఎకరానికి పదమూడున్నర లక్షలు పరిహారంగా చెల్లిస్తామని తెలిపారు.పరిహారంతో పాటు దసరా నాటికి అన్ని సౌకర్యాలతో ఇల్లు నిర్మించి అప్పగిస్తానని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు తర్వాత భూనిర్వాసితుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని ఎల్లంపల్లి నిర్వాసితులకు ఇప్పటికి పరిహారం అందలేదని గుర్తు చేశారు.పారిశ్రామిక రంగం అభివృద్ధి విషయంలో ఎవరు అడ్డుపడిన సహించబోమని స్పష్టం చేశారు.విపక్షాలు అభివృద్ధి ని అడ్డుకోవాలనే కుట్ర పన్నాయని ఆరోపించారు.బీజేపీ వ్యాపార పార్టీ ఓట్ల కోసం మతం జపం చేస్తుందని బీఆరెస్ దుకాణం మూతపడిందని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా ప్రజలకు ఏమి చేయలేక పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో కి వచ్చిన అభివృద్ధి,సంక్షేమం కు కృషి చేస్తోందని అన్నారు.ప్రజల కు మాట ఇచ్చానంటే ఎట్టిపరిస్థితుల్లో తప్పనని తప్పితే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు.

## మొబైల్ మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ సహకారం

### మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి







**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 7:** ఈరోజు మొబైల్ మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఇది ఉచిత రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు అవగాహనా కార్యక్రమం. గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం క్రింద, ఎ ఐ జి హాస్పిటల్స్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని గగిల్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగింది.
ప్రారంభోత్సవంసభలో
డాక్టర్ టి. రఘునాథ్ స్వామి మాట్లాడుతూ,
మహిళల్లో అధికంగా కనిపించే రొమ్ము క్యాన్సర్‌ను తొందరగా గుర్తించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. మొబైల్ మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ గ్రామీణ మరియు వెనుకబడ్డ ప్రాంతాల్లో మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం అవసరమైన సదుపాయాలను అందజేస్తుందని చెప్పారు.
ఈ ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి, తగిన వైద్యం అందించడం ద్వారా ఆరోగ్య సేవలను మెరుగుపరచడమే లక్ష్యమని తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఈ ఉచిత సేవను ఉపయోగించుకోవాలని సూచించారు.
గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి ఉమా చిగురుపాటి మాట్లాడుతూ, రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా విజయవంతమైన చికిత్సకు అవకాశాలు మెరుగుపడతాయని, అలాగే మహిళలు తమ ఆరోగ్యం పట్ల చైతన్యంగా ఉండాలని సూచించారు.
ఎ ఐ జి హాస్పిటల్స్‌లో కన్సల్టెంట్ బ్రెస్ట్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రగ్యా చిగురుపాటి మాట్లాడుతూ,
ఈ మొబైల్ యూనిట్ జిల్లా వ్యాప్తంగా అనేక మహిళలకు స్క్రీనింగ్ మరియు కన్సల్టేషన్ అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు, రిమోటు ప్రాంతాల్లో కూడా ఈ సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమానికి దుండిగల్ మున్సిపల్ చైర్మన్ శ్రీ శంభిపూర్ కృష్ణ, గగిల్లాపూర్ కౌన్సిలర్ శ్రీమతి అరుణ నాగరాజు, మల్కాజ్‌గిరి డివిజన్ డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ మరియు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శోభారాణి, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సరస్వతి, దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణలతతో పాటు
ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు హాజరయ్యారు.

## జలమండలి అధికారులకు వినతి పత్రం



**గండీపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 7 జనవరి 2025** మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా జల మండలి వారికి సంబంధించిన సమస్యలపై ప్రత్యేకించి వారు త్రవ్వి పెట్టిన హుడా కాలనీ లాల్లమ్మ గార్డెన్ కూడలి, సాయి చంద్ర కాలనీ ల వద్ద రహదారుల నిర్వహణ సరిచేయాలని, కాండిట్, సుందర్ గార్డెన్ లీకేజీలు సరి చేయమని పిర్యాదు చేయడానికి బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆద్వర్యంలో జల మండలి కార్యాలయానికి కలసి కట్టుగా వెళ్ళి జల మండలి అధికారులు డి,ఇ - ఏ.ఈ లను కలసి వినతి పత్రం అందజేయడం జరిగింది. అందుకు సానుకూలంగా స్పందించి వీలైనంత తొందరగా సమస్యల పరిష్కారం చేస్తామని అధికారులు చెప్పారు. ఇట్టి కార్యక్రమంలో రూపా రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, గుట్టమీది నరేందర్, గౌరికంటి విఠల్, సంగం శ్రీకాంత్, రాజేంద్ర ప్రసాద్, కిరణ్, షేక్ ఆరీఫ్, అరిఫ్ మొహమ్మద్, బొడ్డు శ్రీధర్, విజయలక్ష్మి, సుమ, తిరుపతి తది తరులు పాల్గొన్నారు.







## గోదావరి తీరాన మహాప్రస్థానం నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 06 :** మంచిర్యాల నియోజకవర్గంలోని మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరాన మహాప్రస్థానం నిర్మాణ పనులను పరిశీలించిన మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,సంబంధిత అధికారులు అనంతరం అధికారులతో మాట్లాడి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్,కౌన్సిలర్లు, నాయకులు,మహిళా నాయకురాలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టపరమైన చర్యలు

### మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 7:** మంగళవారం రోజున ఆపరేషన్ స్మైల్- %శ్రీ% వివిధ శాఖలతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో ముఖ్యఅతిథిగా స్థానిక సంస్థల అదునపు కలెక్టర్ రాధిక గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అందరి తో సమన్వయంతో బాలల రక్షణకు వారి భద్రతకు సహకారం అందించాలని కోరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు ఉన్న బాల కార్మికులు గాని పనిచేస్తూ బాలలను వివిధ పారిశ్రామిక వాడల్లో గాని పిల్లల భిక్షాటన గాని అక్రమ రవాణా, బాలల నిర్వ స్థితి ప్రాంతాల నుంచి కాపాడి, వారికి విముక్తి కల్పించాలని, బాలలకు వెలుగులు నింపాలని అన్నారు, బాలల చేత పనిచేసుకుంటున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ రామ్మోహన్ మాట్లాడుతూ బాలల రక్షణ మరియు వారి సంరక్షణ కొరకు ఈ నెల జనవరి 1 నుంచి 31,2025 వరకు 24%ఇ%7 గంటలు అందుబాటులో ఉంటామని ఆపరేషన్ స్మైల్- %శ్రీ% నిర్వహించడం వలన బాలలకు ఎంతగానో తోడ్పడినందిస్తుందని తెలియజేశారు. ఇందులో వివిధ శాఖల అధికారులు సైబరాబాద్ రాచకొండ పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, డి ఎం అండ్ హెచ్ ఓ అధికారి రఘునాథ స్వామి, రెవిన్యూ అధికారులు, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ నాగమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎండి ఇంతియాజ్ రహీం, జిల్లా బాలల పరిరక్షణ విభాగ సభ్యులు, చైల్డ్ లైన్ సభ్యులు, మరియు వివిధ శాఖల అధికారులు వివిధ స్వచ్ఛంద సంస్థల్లో పాల్గొన్నారు.

## పొంగులేటి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కోరం కనకయ్య మేకల మల్లిబాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి జనవరి 07 (ప్రజాబలం)** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని హైదరాబాదులోని వారి క్యాంప్ ఆఫీస్ లో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధి, ఖమ్మం జిల్లాలోని యాదవుల సమస్యలపై వివరించగా సానుకూలంగా పొంగులేటి స్పందించి ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ పార్టీ హయాంలో ఈ విధంగా అయితే 6 గ్యారంటీల పథకాల అమలు జరుగుతూ ఉన్నదో, బడుగు బలహీన వర్గాల సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధికి కట్టుబడి ఉన్నదో, కాంగ్రెస్ పార్టీకి వెన్నంటి ఉండిన యాదవుల సమస్యలను ఇప్పటికే గుర్తించామని, తప్పకుండా, త్వరలో అందరికీ న్యాయం చేకూర్చే విధానం ప్రకటిస్తామని హామీ ఇచ్చారని మల్లి బాబు యాదవ్ తెలిపారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ ఫతే మహమ్మద్, బానోత్ చింతు, మూల మధుకర్ రెడ్డి, చేపల శ్రీను, కంబాల ముసలయ్య, రాసాల నాగేశ్వర్రావు మరియు తదితరులు పాల్గొన్నారు

## ప్రైమరీ హెల్త్ సెంటర్ కి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వివేక్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 7** చెన్నూర్ మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించనున్న ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనానికి మంగళవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటీ నలభై మూడు లక్షల రూపాయల నిధులతో ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నామన్నారు.

# ఇశ్రాయేల్ తీర్థయాత్రకు కార్యాలయాన్ని ప్రారంభించిన బిషప్ హౌస్ ప్రొక్రేటర్ ఫాదర్ ఐజక్



**ఖమ్మం ప్రతినిధి జనవరి 07 (ప్రజాబలం)** ఖమ్మం పట్టణం బైపాస్ రోడ్డులోని స్థానిక కరుణగిరి కాంప్లెక్స్ నందు బిషప్ హౌస్ ప్రొక్రేటర్ ఫాదర్ ఐజక్ చే హెూలీల్యాండ్ టూర్ అనగా యెరూషలేము యాత్రకు వెళ్ళదలచిన క్రైస్తవ విశ్వాసులకు మార్గదర్శకం చేయుటకు కార్యాలయము ప్రారభించబడినది యెరూషలేము యాత్రకు వెళ్లాలని అనేక క్రైస్తవ విశ్వాసులకు ఆశా ఆసక్తి ఉన్నప్పటికీ ఎలా వెళ్లాలో తెలియక చాలామంది ఇబ్బంది పడుతున్నారని ఇలాంటి కార్యాలయం అందుబాటులో ఉండుట వలన అందరికి అనుకూల మరియు సుళువైన విధంగా మార్గం సుగమనమౌతుందని భావించి క్రైస్తవ విశ్వాసులందరు ఈ మంచి అవకాశం వినియోగించుకుంటే మంచిదని ఫాదర్ ఉపన్యసించారు . కార్యాలయము నిర్వాహకులు డాక్టర్ మాచర్ల శేఖర్ బాబు మాట్లాడుతూ యెరూషలేము యాత్రలో ఇశ్రాయేల్ దేశంతో పాటు ఈజిప్ట్ పాలస్తీనా మరియు జోర్ధాన్ అను మొత్తం నాలుగు దేశాలలో పరిశుద్ధ బైబిల్ గ్రంధములోని అనేక పవిత్ర స్థలాలను చూపిస్తూ వాటి ప్రాముఖ్యతను సంపూర్ణంగా వివరిస్తూ ఈ యాత్ర ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమము లో పాస్టర్ శ్యామ్ బాబు బ్రదర్ కరుణాకర్ బ్రదర్ ప్రభాకర్ బ్రదర్ రాఘవులు బ్రదర్ ధారి బ్రదర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు

# భూ కబ్జా తిరిగి ప్రభుత్వానికి అప్పగింత



**రాజన్న సిరిసిల్ల జిల్లా, 7 జనవరి 2025,** ప్రజా బలం ప్రతినిధి.జిల్లాలో ఆక్రమణకు గురైన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన "సంచుల కుమారస్వామి" తిరిగి ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం లో ప్రభుత్వ భూమి అప్పగింత పై ఎస్పీ అఖిల్ మహజన్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన "సంచుల కుమారస్వామి" గ్రామ సర్వే నెంబర్ 464లో గల 3 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసుకుని సాగు చేసుకుంటున్నాడని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని తెలిపారు. జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదురు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఈ భూములను పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని, పేద ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. 2018 నుంచి 2023 వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉంటూ రైతు బంధు, పీఎం కిసాన్ మొదలైన ప్రభుత్వ పథకాలు లబ్ది పొందినందుకు ఆ సొమ్ము రికవరి కోసం డిమాండ్ నోటీసు జారీ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా దాదాపు 250 ఎకరాలు ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కోసమెరుపు... చిన్నచిన్న నాయకుల వద్ద ఇన్ని ఎకరాలు కబ్జా గురైతే మరి పెద్ద నాయకుల వద్ద ఇంకా ఎన్ని ఎకరాలు వేచి చూడాలి మరి

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా లాభాపేక్ష లేకుండా సంక్షేమ సేవలు

## జిల్లా కలెక్టర్ కుమార్ కుమార్ దీపక్






**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 07 :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజా సంక్షేమం కోసం సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టివాడలో గల ఆనంద నిలయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీకి అందించిన బ్లడ్ డొనేషన్ క్యాంపర్ వాహనాన్ని ఐ.ఓ.సి.ఎల్. డి.జి.ఎం.కైలాష్ కాంత్,రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్రెడ్డి లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా సేవలు అందించడం జరుగుతుందని, జిల్లాలోని దయాలసిస్, సికిల్సెల్,తలసేమియా వ్యాధిగ్రస్తులు,గర్భిణులు, ప్రమాదాలలో గాయపడిన వారికి అత్యవసర సమయాలలో రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరం నుండి రక్తాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వైద్య రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని,ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, త్వరలోనే సేవలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని, వీటితో పాటు లక్షెట్టిపేట మండల కేంద్రంలో 100 పడకలతో సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో 3 నెలలకు ఒకసారి రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఐ.ఓ.సి.ఎల్.రాష్ట్ర ఈ.డి.%ఉ% ఎస్.హెచ్.బి.అనిల్ కుమార్ సహకారంతో సి.ఎస్.ఆర్. నిధుల నుండి రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రానికి 50 లక్షల రూపాయల విలువ గల బ్లడ్ డొనేషన్ క్యాంపర్ బొలెరో వాహనం,ఆటోమేటెడ్ ఎలిసా ప్రాసెసర్,రీడర్,బ్లడ్ కనెక్షన్ మానిటర్, బ్లడ్ ట్యూబ్ సిలర్, బ్లడ్ స్టోరేజ్ రిఫ్రిజిరేటర్ ను అందించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.ఐ.ఓ.సి.ఎల్.డి.జి.ఎం. మాట్లాడుతూ ఒక్క మంచిర్యాలలోనే కాకుండా మరో 5 జిల్లా ప్రాంతాలలో సి.ఎస్.ఆర్.నిధుల నుండి తలసేమియా,సికిల్ సెల్ వ్యాధి నిర్మూలన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.ఓ.సి.ఎల్.రామగుండం ఇన్చార్జ్ ఆసిఫ్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్,రాష్ట్ర కమిటీ సభ్యులు వి. మధుసూదన్ రెడ్డి,కోశాధికారి సత్యపాల్ రెడ్డి,కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలికల గృహంలో బాలికకు ఆశ్రయం

## జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 07 :** మంచిర్యాల జిల్లాలోని బాలల రక్షణ విభాగం,చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది బృందం మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలో కాపాడిన 8 సంవత్సరాల బాలికకు ప్రభుత్వ బాలికల గృహంలో ఆశ్రయం కల్పించడం జరిగిందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం జనవరి 15వ తేదీన మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో 8 సంవత్సరాల బాలిక కాజల్ ను రెస్క్యూ చేయడం జరిగిందని, బాలల పరిరక్షణ సమితి ముందు బాలికను హాజరు పరిచి వారి ఆదేశాల ప్రకారం ప్రభుత్వ బాలికల గృహంలో ఆశ్రయం అందించి సంరక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. అప్పటినుండి ఈ బాలికకు సంబంధించి ఎవరు రాలేదని, ఈ బాలికకు సంబంధించి ఎవరైనా ఉన్నట్లయితే తగిన ఆధారాలతో జిల్లా కేంద్రంలోని బాల రక్ష భవన్ / నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని,వివరాలకు 8886592786, 9441506519, 9908541697 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# సామాన్య మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 07 :** రాష్ట్రంలో సామాన్య మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామపంచాయతీలోని వీరాంజనేయ గ్రామ సంఘం-రాజరాజేశ్వరి చిన్న సంఘం సభ్యురాలు సుద్దాల విజయ పొందిన సంచార చేపల విక్రయ వాహనాన్ని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,మంచిర్యాల,బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు,హరికృష్ణ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ అంశాలలో స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు.చేపల విక్రయ వాహనంలో తాజా చేపలు, అన్ని రకాల రుచికరమైన ఫిష్ ఫ్రై లభిస్తాయని తెలిపారు. లబ్దిదారులకు కేటాయించిన 10 లక్షల రూపాయల ప్రాజెక్టు విలువలో 4 లక్షల రూపాయలు సభ్యురాలి వాటాధనం,6 లక్షల రూపాయలు ప్రభుత్వ రాయితీ ఉందని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన పొందాలని తెలిపారు.మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని రకాల శిక్షణ అందిస్తామని,మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు.ఈ వాహనం ద్వారా చేపలు పొందేందుకు 7416639967 నంబర్లో సంప్రదించవచ్చని, ప్రజలు ఈ వాహనాన్ని వినియోగించుకొని లబ్దిదారులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఖాతాలలో 131 కోట్ల 24 లక్షల రూపాయలు జమ

## జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలా



**ప్రజాబలం బెల్లంపల్లి నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 07 :** ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 317 వరి ధాన్యం కొనుగోలు ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి 131 కోట్ల 24 లక్షల రూపాయల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 317 కొనుగోలు కేంద్రాల ద్వారా 93 వేల 852 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో 37 వేల 614 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉందని, సంబంధిత 9 వేల 789 మంది రైతుల ఖాతాలలో 131 కోట్ల 24 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 26 రైస్ మిల్లులకు సి. ఎం.ఆర్. అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 271 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి చేసి మూసి వేయడం జరిగిందని తెలిపారు.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో జె శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ, సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రంగా కడుగుతారని చెప్పారు. కాగా, స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

# సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## ప్రాజెక్ట్ పనుల పురోగతి పై ఇర్రిగేషన్, రెవెన్యూ అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి జనవరి 07 (ప్రజాబలం)** ఖమ్మం సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనుల పురోగతిపై నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, ఇంకా చేపట్టాల్సిన పనుల మ్యాప్ లను కలెక్టర్ పరిశీలించారు. సత్తుపల్లి ట్రంక్ పనులు, యాతాలకుంట టన్నెల్ పూర్తి, జూలూరుపాడు టన్నెల్ పనుల వివరాలు, పంప్ హౌస్ ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువల పరిస్థితి, పాలేరు నియోజకవర్గం లోని లింక్ కెనాల్ ఏర్పాటు పనులు, భూ సేకరణ, అటవీభూముల స్థితిగతులు, ఇతర శాఖల అనుమతుల గురించి అధికారులను వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు సీతారామ ప్రాజెక్టు పనులకు సంబంధించిన భూసేకరణ పూర్తి చేయాలని, అధికారులు భూనిర్వాసితుల తో సంప్రదింపులు జరపి, మిగులు భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. అటవీ భూమలకు సంబంధించి ఆ శాఖ నుండి అనుమతుల దృష్టి పెట్టాలన్నారు ప్రభుత్వ లక్ష్యం మేరకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇచ్చే విధంగా పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు ఈ సమీక్ష లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఇర్రిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ లో బ్రదర్స్ క్రికెట్ ప్రాంగణ ప్రారంభం

## యువతలో క్రికెట్ నైపుణ్యత పెంచేందుకు బ్రదర్స్ క్రికెట్. తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి కృష్ణ ముదిరాజు





**తూప్రాన్, జనవరి, 7 ప్రాజబలం ప్రతినిధి.** యువతలో క్రికెట్ నైపుణ్యత పెంచేందుకు మెదక్ జిల్ల తూప్రాన్ లో బ్రదర్స్ క్రికెట్ ప్రాంగణం ను ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నామని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి కృష్ణ ముదిరాజు అన్నారు. సోమవారం సాయంత్రం తూప్రాన్ మున్సిపల్ పరిధిలో 12వ వార్డు యందు కొత్త మార్కెట్ యార్డ్ ముందు బ్రదర్స్ బాక్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ హాజరై రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. కొత్త ఆలోచనతో యువత ను ఆదర్శంగా క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఎంతో అద్భుతంగా దోహదపడుతుందన్నారు. అనంతరం తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత కు ఇది ఒక దిక్సూచిగా పోటీతత్వం పెరిగి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. క్రికెట్ క్రీడా మైదాన%శీ% ను తూప్రాన్ లో ప్రారంభోత్సవం చేయడం శుభ పరిణామం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్

శ్రీ పాతూరు గణేష్ రెడ్డి, తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్.ఐ శివానందం, 12వ వార్డ్ కౌన్సిలర్ శ్రీ జమాల్పూర్ లక్ష్మీబాయి నర్సోజి, నిర్వాహకులు కొక్కొండ కాశిరెడ్డి, ఇస్లాంపూర్ సంతోష్ రెడ్డి, (రాజు), పద్మావతి ఆటోమొబైల్స్ సుదర్శన్ రెడ్డి, కొక్కొండ శ్రీధర్ రెడ్డి, కొక్కొండ శశిభూషణ్ రెడ్డి, కొక్కొండ సతీష్ రెడ్డి, సరాఫ్ సతీష్ చారి, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్, అర్.శివ శంకర్ గౌడ్, గైనిబైటి భాస్కర్ గౌడ్, టి.నాగరాజు, శివ కృష్ణ, పెద్దిగారి నగేష్, జయపల్ రాథోడ్, స్వామి, చెలిమెల రామస్వామి, నవీన్, సందీప్, ఎన్, గోపాల కృష్ణ గౌడ్,సుప్రభాత హెూటల్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారితో సెల్ఫీ దిగిన ఎంఎల్ఏ డాక్టర్ వివేక్ వెంకటస్వామి




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 7** :చెన్నూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు వెళ్తున్న చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అదే రోడ్డుపై మరొక వెహికల్ లో వెళ్తున్న చిన్నారి చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామిని రూఫ్ టాప్ ఆఫ్ పై నిలబడి అభిమానంతో సెల్ఫీ కావాలని కోరగా వెంటనే భీమారం శివారులో రన్నింగ్ లో ఉన్న కారు ఆపి ఫోటో దిగి వారితో సెల్ఫీ దిగి అబ్బురపరిచారు. అడగ్గానే సమయం కేటాయించి సెల్ఫీ ఇచ్చినందుకు అమ్మాయి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి ధన్యవాదాలు తెలిపారు.






# నేరాలనియంత్రణలో సీసీ కెమెరాలదే ప్రముఖ పాత్ర -మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి





**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 7:** నేరాలు నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్రని మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి అన్నారు మంగళవారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగడి బజార్ ఏరియాలో తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా, కాలనీలో తనిఖీ లు నిర్వహించారు. తగిన ధ్రువ పత్రాలు లేని 34 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యతని, కాలనీలో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, యువత చెడు అలవాట్లకు గంజాయి, మద్యం, డ్రగ్స్ లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలు ఉండే అనుమానాస్పద ప్రదేశాలలో నార్కోటిక్ డాగ్ తో పరిశీలించారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని లేదా సమస్యలుంటే 100 నంబర్ కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్, వాట్సాప్ కాల్స్ లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలి అని సూచించారు.

డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలి అన్నారు. కాలనీ లో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఎవరైనా నిషేధిత గంజాయిని విక్రయించిన లేదా రవాణా చేసిన మాకు సమాచారము ఇవ్వాలని , అట్టివారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com